

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం

# వ్యవసాయం

సెప్టెంబర్, 2025

సంపుటి - 11 | సంచిక-09 | పేజీలు- 52 | వెల : ₹ 20/-



# ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గత నెలలో జరిగిన వివిధ కార్యక్రమాల దృశ్యమాలిక



79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని జాతీయ జెండాను ఆవిష్కరించిన విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్య



వర్సిటీ మరియు ఆస్ట్రేలియాకు చెందిన వెస్టర్న్ సిడ్నీ యూనివర్సిటీలు సంయుక్తంగా అందిస్తున్న బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్ **2025-26** కోర్సులో ప్రవేశం పొందిన మొదటి విద్యార్థినికి ప్రవేశ పత్రాన్ని అందిస్తున్న రిజిస్ట్రార్ డా॥ జి.ఇ.సి.హెచ్. విద్యాసాగర్



పశు సంవర్ధక రంగంలో వాతావరణ స్థితిస్థాపకత యొక్క ప్రమేయం అనే అంశంపై జరిగిన సదస్సులో పాల్గొన్న విస్తరణ సంచాలకులు డా॥ ఎమ్. యాకాద్రి మరియు ఇతర అధికారులు



రైతు విజ్ఞాన కేంద్రం, సంగుపేట్‌ను సందర్శించి అక్కడి రైతులు మరియు శాస్త్రవేత్తలతో మాట్లాడుతున్న విస్తరణ సంచాలకులు డా॥ ఎమ్. యాకాద్రి



వ్యవసాయ ఆహార వ్యవస్థలో నాయకత్వాన్ని అభివృద్ధి చేయడం అనే అంశంపై ప్రసంగిస్తున్న అమెరికాలోని క్యాన్సస్ స్టేట్ యూనివర్సిటీ ప్రొ॥ పి.వి. వరప్రసాద్

# వ్యవసాయం

సంక్షిప్త వ్యవసాయ సమాచార మాస పత్రిక

సెప్టెంబర్, 2025

స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ విశ్వావసు నామ సం॥ర భాద్రపద శుద్ధ నవమి నుండి ఆశ్వయుజ శుద్ధ అష్టమి వరకు



## సంపాదక వర్గం



<u>ప్రధాన సంపాదకులు</u>

**డా॥ సి. పద్మవేణి**

ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి

<u>సాంకేతిక పర్యవేక్షణ నిపుణులు</u>

డా॥ పి. లీలా రాణి

ప్రధాన శాస్త్రవేత్త (క్రాప్ ప్రొడక్షన్) & హెడ్

డా॥ బి. పద్మజ

ప్రధాన శాస్త్రవేత్త (అగ్రానమి) & హెడ్

<u>పర్యవేక్షణ</u>

డా॥ ఆర్. సునీత దేవి

ప్రధాన శాస్త్రవేత్త, (ఎంటమాలజి)



వ్యవసాయ మాస పత్రిక సంవత్సర చందా రూ. 200/- మరియు జీవిత కాలపు (10 సంవత్సరాలు) చందా రూ. 1000/- నగదు రూపంలో లేదా డి.డి. రూపంలో చెల్లించవచ్చు.

డి. డి. అయితే

Principal Agricultural Information Officer,
Agricultural Information and Communication Center
PJTAU Press, Rajendranagar, Ranga Reddy
Pin Code : 500 030

పేరిట తీసి హైదరాబాద్‌లో చెల్లుబాటయ్యే విధంగా పంపించాలి



**చిరునామా :**

ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి
వ్యవసాయ సమాచార మరియు ప్రసార కేంద్రం
ఎ.ఆర్.ఐ క్యాంపస్, రాజేంద్రనగర్, హైదరాబాద్ - 30.
తెలంగాణ, ఫోన్ నెం. 040-24015380
e-mail : paio.pjtau@gmail.com, pjtau.paio@gmail.com
vyavasayam.pjtau@gmail.com


పాఠక మహాశయులు మాసపత్రిక అభ్యున్నతికి తోడ్పడుటకుగాను తమ అమూల్యమైన సలహాలను సూచనలను అందచేయవలసిందిగా కోరుతున్నాము.

## విషయ సూచిక


1. ఉపకులపతి సందేశం........................................ 5
2. ఈమాసంలో చేయవలసిన వ్యవసాయ పనులు................ 6
3. వాతావరణం-పంటల పరిస్థితి-విశ్లేషణ...................... 13
4. సాంకేతిక వ్యాసాలు
   - తడి-పొడి విధానంతో వరి సాగులో నీటి యాజమాన్యం.... 14
   - మొక్కజొన్న కత్తెర పురుగు మనదేశంలో ప్రవేశించి అప్పుడే ఏడు సంవత్సరాలు........................................ 15
   - వానాకాలం ఆముదం పంటను ఆశించు చీడపీడలు - యాజమాన్యం............................................. 17
   - ప్రత్తి పంటలో వచ్చు పోషక లోపాలు - యాజమాన్యం.... 19
   - ప్రత్తి పంటలో తలమాడు తెగులు యాజమాన్యం........... 20
   - సమగ్ర సస్యరక్షణ చర్యలతో మిరపసాగులో అధిక దిగుబడులు............................................. 21
   - ఆగాకర సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు........... 23
   - వ్యవసాయ మార్కెట్ ఇంటలిజెన్స్.......................... 25
   - వ్యవసాయ విశ్వవిద్యాలయ 55వ స్నాతకోత్సవం........... 26
   - వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీసి సెల్ ఏర్పాటు......... 28
   - పంటల సాగులో కలుపు సమస్యను తగ్గించుకునే మార్గాలు............................................. 29
   - ట్రెల్లిస్ / హై డెన్సిటీ పద్ధతిలో డ్రాగన్ సాగు - లాభాలు బాగు............................................. 31
   - “భారతదేశంలో పురుగుమందుల వాడకం గురించి ఉన్న అపోహలు మరియు శాస్త్రీయ వాస్తవాలు”................. 33
   - వ్యవసాయ పదవినోదం.......................................37
   - సెప్టెంబర్ మాసంలో ఉద్యాన పంటల్లో చేపట్టవలసిన సేద్యపు పనులు.......................................38
   - తల్లిపాలతో శిశువు ఆరోగ్యానికి భరోసా.................... 40
   - మిరపలో నల్ల తామర పురుగుల సమగ్ర యాజమాన్యం.... 41
   - పాడి పశువుల మేతలో విటమిన్ ‘ఎ’ ఆవశ్యకత............44
5. టి.వి.ఛానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు............................................. 46
6. రైతన్నకో ప్రశ్న............................................47
7. విశ్వవిద్యాలయ వార్తలు..................................... 48
8. రైతు విజయగాథ
   - వానాకాలం వరికి ముందుగా పచ్చిరొట్టగా పెసర సాగు - రైతు విజయగాథ............................................49

# సెప్టెంబర్ మాసం క్యాలెండర్ - 2025

## స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ విశ్వావసు నామ సం॥ర భాద్రపద శుద్ధ నవమి నుండి ఆశ్వయుజ శుద్ధ అష్టమి వరకు

| SUN ఆది రాహుకాలం సా. 4.30-6.00 | MON సోమ రాహుకాలం ఉ.7.30-9.00 | TUE మంగళ రాహుకాలం మ.3.00-4.30 | WED బుధ రాహుకాలం మ.12.00-1.30 | THU గురు రాహుకాలం మ.1.30-3.00 | FRI శుక్ర రాహుకాలం ఉ.10.30-12.00 | SAT శని రాహుకాలం ఉ.9.00-10.30 |
|---|---|---|---|---|---|---|
| | 1 భాద్రపద శుద్ధ నవమి రా. 11-18 జ్యేష్ఠ సా. 6-01 రా.వ. 2-40 ల 4-24 | 2 దశమి రా. 12-36 మూల రా. 7-59 సా.వ. 6-15 ల 7-59 | 3 ఏకాదశి రా. 1-26 పూర్వాషాఢ రా. 9-32 ఉ.వ. 6-12 ల 7-54 తె.వ. 5-53 ల | 4 ద్వాదశి రా. 1-47 ఉత్తరాషాఢ రా. 10-36 ఉ.శే.వ. 7-33 వ రా.వ. 2-42 ల 4-20 | 5 త్రయోదశి రా. 1-37 శ్రవణం రా. 11-10 తె.వ. 3-11 ల 4-47 | 6 చతుర్దశి రా. 12-57 ధనిష్ఠ రా. 11-15 వర్జ్యము లేదు |
| ○ 7 పూర్ణిమ రా. 11-50 శతభిషం రా . 10-53 ఉ.వ. 6-21 ల 7-55 తె.వ. 5-05 ల | 8 భాద్రపద బ॥ పాడ్యమి రా. 10-21 పూర్వాభాద్ర రా. 10-09 ఉ.శే.వ. 6-38 వ | 9 విదియ రా. 8-31 ఉత్తరాభాద్ర రా. 9-04 ఉ.వ. 7-19 ల 8-50 | 10 తదియ సా. 6-25 రేవతి రా. 7-43 ఉ.వ. 8-23 ల 9-54 | 11 చవితి సా. 4-08 అశ్విని సా. 6-11 ప.వ. 2-26 ల 3-56 తె.వ. 3-08 ల 4-37 | 12 పంచమి ప. 1-45 భరణి సా. 4-33 తె.వ. 3-42 ల 5-12 | 13 షష్ఠి ప. 11-17 కృత్తిక ప. 2-52 తె.వ. 5-48 ల |
| 14 సప్తమి ఉ. 8-53 రోహిణి ప. 1-16 ఉ.శే.వ. 7-18 వ సా.వ. 6-31 ల 8-02 | 15 అష్టమి ఉ. 6-36 నవమి తె. 4-38 మృగశిర ఉ. 11-48 రా.వ. 7-46 ల 9-17 | 16 దశమి రా. 2-51 ఆర్ద్ర ఉ. 10-33 రా.వ. 10-04 ల 11-36 | 17 ఏకాదశి రా. 1-25 పునర్వసు ఉ. 9-35 సా.వ. 5-23 ల 6-56 | 18 ద్వాదశి రా.12-25 పుష్యమి ఉ.8-59 రా.వ.9-42 ల 11-17 | 19 త్రయోదశి రా. 11-51 ఆశ్రేష ఉ. 8-49 రా.వ. 8-58 ల 10-35 | 20 చతుర్దశి రా.11-47 మఘ ఉ.9-07 సా.వ.5-23 ల 7-02 |
| ● 21 అమావాస్య రా.12-14 పుబ్బ ఉ.9-56 సా.వ.5-21 ల 7-12 | 22 ఆశ్వయుజ శు॥ పాడ్యమి రా. 1-10 ఉత్తర ఉ. 11-14 రా.వ. 8-15 ల 9-58 | 23 విదియ రా. 2-34 హస్త ప. 1-01 రా.వ. 9-44 ల 11-28 | 24 తదియ తె. 4-19 చిత్ర ప. 3-11 రా.వ. 9-20 ల 11-06 | 25 చవితి పూర్తి స్వాతి సా. 5-37 రా.వ. 11-50 ల 1-36 | 26 చవితి ఉ.6-19 విశాఖ రా.8-13 రా.వ. 12-38 ల 2-25 | 27 పంచమి ఉ. 8-24 అనూరాధ రా. 10-47 తె.వ. 4-56 ల |
| 28 షష్ఠి ఉ. 10-22 జ్యేష్ఠ రా. 1-09 ఉ.శే.వ. 6-41 వ | 29 సప్తమి ప. 12-05 మూల తె. 3-13 ఉ.వ. 9-50 ల 11-35 రా.వ. 1-29 ల 3-13 | 30 అష్టమి ప. 1-25 పూర్వాషాఢ తె. 4-53 ప.వ. 1-29 ల 3-11 | | | | |

05 ఈద్-మిలాదున్-నబీ

21 బతుకమ్మ ప్రారంభం

30 దుర్గాష్టమి

### పుబ్బ కార్తె (31.08.25 నుండి 13.09.25)

| | | |
|---|---|---|
| వరి | : | రసాయనిక ఎరువులు వేయుట, సస్యరక్షణ, కలుపు తీయుట, ఎలుకల నిర్మూలన |
| జొన్న | : | రబీ జొన్న వేయుటకు దుక్కులు తయారు చేయుట. |
| వేరుశనగ | : | సస్యరక్షణ, కలుపు తీయుట. |
| సోయాచిక్కుడు | : | పైరు కోయుట. |
| ప్రొద్దుతిరుగుడు | : | సస్యరక్షణ, ఎరువులు వేయుట. |
| చెఱకు | : | అడ్సాలి పంట వేయుట. |
| ఆముదం | : | సస్యరక్షణ, ఎరువులు వేయుట. |

### ఉత్తర కార్తె (14.09.25 నుండి 27.09.25)

| | | |
|---|---|---|
| సజ్జ | : | రబీ పంటలకు రసాయనిక ఎరువులు వేయుట, విత్తుట. |
| వేరుశనగ | : | సస్యరక్షణ. |
| ఆముదం | : | సస్యరక్షణ. |
| ప్రత్తి | : | సస్యరక్షణ. |
| సజ్జ | : | కోతలు. |
| నువ్వులు | : | జూన్ నెలలో వేసిన పైరు కోతలు. |
| ప్రత్తి | : | సస్యరక్షణ. |

# మారుతున్న పరిస్థితులు... మారాల్సిన వ్యవసాయం



అల్దాస్ జానయ్య
**ఉపకులపతి**

తెలంగాణ రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో వ్యవసాయ మరియు అనుబంధ రంగాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. రాష్ట్ర జనాభాలో అధిక శాతానికి ఈ రంగం ఉపాధిని కల్పించడమే కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో నివసించే సగం మందికి పైగా ప్రజలు వ్యవసాయం మీదనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. మన రాష్ట్రంలో వరి, ప్రత్తి, మొక్కజొన్న, సోయాచిక్కుడు, కంది పంటలు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయబడుతున్నాయి. వరి ఉత్పత్తిలో దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. అదేవిధంగా మాంసం ఉత్పత్తిలో 4వ స్థానం, గ్రుడ్ల ఉత్పత్తిలో 3వ స్థానంగా నిలిచింది. దీనికి భిన్నంగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు, పండ్ల ఉత్పత్తిలో వెనుకబడి ఉన్నది.

ఈ మధ్యకాలంలో మారుతున్న జీవనశైలి, ప్రజలలో పెరుగుతున్న ఆరోగ్య అవగాహన మరియు అధిక ఆదాయాలు వంటి కారణాల వలన చాలా మంది ఆహారపు అలవాట్లలో అనేక మార్పులను చేసుకుంటున్నారు. ముఖ్యంగా బియ్యం, గోధుమల వినియోగం తగ్గి అధిక పోషక విలువలున్న పప్పుధాన్యాలు, కూరగాయలు, గ్రుడ్లు, చేపలు, పండ్లు, పాల ఉత్పత్తుల మరియు మాంసం వాడకం క్రమేణా పెరుగుతున్నాయి. మాంసం, గ్రుడ్ల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఊతమిస్తుంది. పప్పుధాన్యాల మరియు నూనెగింజల ఉత్పత్తిలో కొంత మేర పెరుగుదల ఉన్నప్పటికీ, రాష్ట్ర అవసరాలు మరియు ఉత్పత్తిలో వ్యత్యాసం గమనిస్తున్నాము. కూరగాయల విషయంలో, 2.6 మిలియన్ టన్నులు అవసరం ఉండగా, కేవలం 1.6 మిలియన్ టన్నులు మాత్రమే ఉత్పత్తి చేస్తున్నాం. మన రాష్ట్ర ఆహార అవసరాల కోసం ఈ పంటల ఉత్పత్తులను ఇతర రాష్ట్రాల నుండి దిగుమతి చేసుకోవడం వలన ఆదాయం కోల్పోవలసి వస్తుంది. ఈ పంటల ఉత్పత్తులు అధికంగా ఉన్న రాష్ట్రాలు ఇప్పటికే అధిక ఆర్థిక వృద్ధిని సాధిస్తూ, తలసరి ఆదాయం వేగంగా పెరగడం గమనిస్తున్నాం.

మన రాష్ట్రంలో సాగులో ఉన్న అపరాలలో కంది, మినము, పెసర, శనగ, అలసందలు మరియు అనప ముఖ్యమైనవి. నల్లరేగడి నేలల్లో అవశేష తేమ ఉపయోగించుకొని, వరి మాగాణుల్లో యాసంగి పంటగా మినుము,పెసర సాగు చేసేవారు. అదేవిధంగా ఒకప్పుడు నూనెగింజల పంటలైనటువంటి వేరుశనగ, ప్రొద్దుతిరుగుడు మరియు ఆముదం పంటలను వానాకాలంలోనూ, నువ్వులు, కుసుమ మరియు ఆవాల పంటలు యాసంగి పంటలుగా సాగు చేసేవారు. కానీ, పెరిగిన నీటి వనరులు, యాంత్రీకరణ సౌకర్యాలు, వాతావరణ మార్పులు, కూలీల కొరత వలన ఈ పంటల సాగు విస్తీర్ణం తగ్గుముఖం పడుతుంది. అయితే, మన రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా పప్పుదినుసులు, నూనెగింజలు, కూరగాయల మరియు ఇతర ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం మరియు ఉత్పత్తి పెంచుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

రైతాంగం నేల స్వభావం మరియు వాతావరణం బట్టి నూనెగింజలు మరియు పప్పుదినుసుల వంటి ఆరుతడి పంటలను ఎంపిక చేసుకొని సాగు చేసుకున్నట్లయితే మంచి దిగుబడులు సాధించి, అధిక ఆదాయం పొందవచ్చు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహకాలను వినియోగించుకొని, పాలీ హౌసులలో కూరగాయల పంటలను పండించుకోవడం వలన మన రాష్ట్ర కూరగాయల కొరతను అధిగమించడంతో పాటు, రైతులు గణనీయమైన లాభాలు పొందే ఆస్కారం ఉంది.

కావున, రాష్ట్ర రైతాంగం శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటిస్తూ, ఆహారపు అలవాట్లకు మరియు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా వ్యవసాయ మరియు అనుబంధ రంగాల ఉత్పత్తులను పెంచుకొని ఉత్పత్తి, ఉత్పాదకతలో సమృద్ధిని సాధించి పోషకాహార భద్రతను సాధించే దిశగా అడుగులు వేస్తారని ఆశిస్తూ.....

(అల్దాస్ జానయ్య)
**ఉపకులపతి**



## వరి

తెలంగాణ రాష్ట్రంలో వరి నాట్లు దాదాపుగా పూర్తి కావచ్చాయి. ప్రస్తుతం వరి వివిధ దశల్లో ఉంది. వరి ఎక్కువ శాతం పిలకలు తొడిగే దశలో ఉంది. ఈ దశలో సరియైన ఎరువుల యాజమాన్యం మరియు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టినట్లైతే వరిలో మంచి ఫలితాలు పొందవచ్చును. ఈ సమయంలో వరిలో కలుపు నివారణ కూడా ఎంతో అవసరం.

- పిలక దశలో ఉన్న వరిపైర్లలో ఎకరానికి 30-35 కిలోల యూరియాను బురద పదునులో చల్లుకోవాలి. అంకురం దశలో 30-35 కిలోల యూరియా మరియు 15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువును వేసుకోవాలి. ఈ దశలో కాంప్లెక్స్ ఎరువులను వేయరాదు.
- ఎట్టి పరిస్థితుల్లో సెప్టెంబర్ మాసంలో వరినాట్లు వేయరాదు. ఈ మాసంలో నాట్లు వేసుకున్నట్లైతే పంట పూత సమయంలో చలి వాతావరణం వల్ల గింజ పట్టక తాలు గింజలు ఏర్పడి దిగుబడిపై ప్రభావం చూపిస్తుంది.
- ప్రధాన పొలంలో పిలకలు వేసే దశలో 2 సెం.మీ. వరకు నీరు ఉండే విధంగా చూడాలి.
- పొలంలో ఊద, ఒడిపిలి వంటి కలుపు మొక్కలు ఉన్నట్లైతే నాటిన 12 రోజులకు సైహలోఫాప్-పి-బ్యుటైల్ 1.5 మి.లీ. లేదా బిస్‌పైరిబాక్ సోడియం 0.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వరి పంటలో సెప్టెంబర్ మాసం అత్యంత కీలకమైనది. ఈ మాసంలో చీడపీడల ఉధృతి అధికంగా ఉండే అవకాశం ఉంది. ఈ నెలలో ఎడతెరిపి లేకుండా (2-3 రోజులు) గాలులతో కూడిన వర్షాలు పడినా, తుఫాను ధాటికి రోజుల తరబడి వర్షం కురిసినట్లైతే బ్యాక్టీరియా ఆకు ఎండుతెగులు ఆశిస్తుంది. తెగులు 5 శాతం కంటే ఎక్కువ గమనించినట్లైతే తాత్కాలికంగా నత్రజని ఎరువులను వేయడం ఆపివేయాలి. తెగులు ఆశించిన పొలం నుండి నీటిని ఒకటి రెండుసార్లు పూర్తిగా బయటికి పంపాలి. తెగులు వ్యాప్తిని అరికట్టుటకు అగ్రిమైసిన్ 0.4 గ్రా. లేదా ప్లాంటామైసిన్ లేదా పోషామైసిన్ 0.2 గ్రా. 5-7 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.
- ప్రధాన పొలంలో అగ్గితెగులు ఆశించే అవకాశం ఉంది. కావున అగ్గితెగులు మచ్చలు తొలిదశలోనే గుర్తించి ఐసోప్రోథయోలేన్ 1.5 మి.లీ. లేదా ట్రైసైక్లజోల్ 0.6 గ్రా. లేదా కాసుగామైసిన్ 2.5 మి.లీ. లేదా ట్రైసైక్లజోల్ + మ్యాంకోజెబ్ 2.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- పొలంలో గట్ల వెంబడి ఉన్న మొక్కలలో 10 శాతం పిలకలలో పాముపొడ తెగులు ఉన్నట్లు గమనించినట్లైతే హెక్సాకొనజోల్ 2 మి.లీ. లేదా ప్రొపికొనజోల్ 1 మి.లీ. లేదా వాలిడామైసిన్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- ఆలస్యంగా నాట్లు వేసిన ప్రాంతాలలో ఉల్లికోడు అధికంగా ఆశించే అవకాశం ఉంది. కనుక పొలంలో 5 శాతం ఉల్లిగొట్టాలు లేదా దుబ్బుకి ఒక కోడు సోకిన పిలక గమనించినట్లైతే కార్బోఫ్యూరాన్ 3సిజి 10 కిలోలు లేదా ఫిప్రోనిల్ 0.3జి గుళికలు 8 కిలోలు ఎకరానికి చల్లుకోవాలి.
- సెప్టెంబర్ నుండి వరి పంటను సుడిదోమ ఆశిస్తుంది. పిలకదశలో దుబ్బుకి 10-15 దోమలు గుర్తిస్తే అంకురం నుండి ఈనిక దశలో దుబ్బుకి 20-25 దోమలు ఉన్నట్లైతే తొలిదశలో ఎసిఫేట్ + ఇమిడాక్లోప్రిడ్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. దోమ ఉధృతి ఎక్కువగా ఉన్నట్లైతే డైనోటెఫ్యూరాన్ 20 యస్‌జి 0.4 గ్రా. లేదా పైమెట్రోజైన్ 50 డబ్ల్యుజి 0.6 గ్రా. లేదా ట్రైఫ్లూమెజోపైరిమ్ 0.485 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 40% + ఎథిప్రోల్ 40% డబ్ల్యుజి 0.25 గ్రా. లీటరు నీటికి మొక్కల మొదళ్ళపై పడేటట్లు పిచికారి చేయాలి. దోమ ఉధృతి దోహదపడే మందులైన ప్రొఫెనోఫాస్, సింథటిక్ పైరిత్రాయిడ్స్ మరియు బయోమందులను వాడరాదు. పొలాన్ని అడపాదడపా ఆరగట్టాలి.



- ఈ మాసంలో కాండంతొలిచే పురుగు యొక్క రెక్కల పురుగు ఉధృతి అధికంగా ఉండే అవకాశం ఉంది. ముఖ్యంగా అంకురం నుండి చిరుపొట్టదశలో ఉన్న వరి పైర్లలో కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్‌పి 400 గ్రా. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 18.5 ఎస్‌సి 60 మి.లీ. ఎకరానికి పిచికారి చేయాలి.

డా॥ సిహెచ్. దామోదర్ రాజు, ప్రధాన శాస్త్రవేత్త (వరి) & హెడ్, వరి పరిశోధన సంస్థ, రాజేంద్రనగర్, హైదరాబాద్, ఫోన్ నెం. 8333818218

## మొక్కజొన్న

- ప్రస్తుతం కురిసిన అధిక వర్షాల వల్ల నీరు నిలిచి మొక్కజొన్న పంట దెబ్బతినే అవకాశముంది. కావున ముందుగా అధిక నీరు నిలిచిన పొలాల్లో మురుగు నీటి కాల్వలను ఏర్పరచుకొని బయటకు పారద్రోలాలి.
- వర్షాలు ఆగిన తర్వాత ఎకరాకు 30-40 కిలోల యూరియా మరియు 20 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను పైపాటుగా వేయాలి.
- ఆకుమచ్చ మరియు ఆకుమాడు తెగుళ్ళు ఆశించినచో మ్యాంకోజెబ్ 2.5 గ్రా. లేదా ప్రొపికొనజోల్ 1 మి.లీ. ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పంటపై పిచికారి చేయాలి.
- ప్రస్తుతం పంటదశలో మొక్కజొన్నలో కత్తెర పురుగు ఉధృతి తగ్గే అవకాశం ఉంది. అవసరమైనచో, నివారణకు క్లోరాంట్రానిలిప్రోల్ 0.4 మి.లీ. లేదా స్పైనిటోరం 0.5 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి మొక్క సుడిలో మందు ద్రావణం పడునట్లు పిచికారి చేయాలి.
- ఎదిగిన లార్వాల నివారణకు విషపు ఎరను పెట్టుకోవాలి. వరి తవుడు 10 కిలోలు + బెల్లం 2 కిలోలు + 2-3 లీటర్ల నీటిలో కలిపి 24 గంటలు పులియనిచ్చి మరుసటిరోజు థయోడికార్బ్ 100 గ్రా. కలిపి ఉండలుగా తయారుచేసి సాయంకాలం వేళలో మొక్కల సుడులలో వేసుకోవాలి.

## చిరుధాన్యాలు

**జొన్న:** ఈ పంట వేసిన 35 రోజుల నుండి పంట కోసే వరకు కాండం తొలుచు పురుగు ఆశిస్తుంది. కావున ఈ పురుగు నివారణకు ఎకరానికి 4 కిలోలు కార్బోఫ్యూరాన్ 3సిజి గుళికలను కాండం సుడుల్లో వేయాలి. అదేవిధంగా కత్తెర పురుగు ఉనికి గమనించినట్లైతే మొదటి దశ లార్వాకు వేపనూనె (అజాడిరక్టిన్) 1500 పిపియం 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. పురుగు ఉధృతి అధికంగా ఉంటే క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి మొక్క సుడుల్లో పడే విధంగా పిచికారి చేయాలి.

**సజ్జ:** పంట పూత దశలో ఉంటుంది. వానాకాలంలో 20-25 రోజులకు మించి బెట్ట పరిస్థితులు ఏర్పడితే పూత మరియు గింజకట్టే దశలో నీటితడులు ఇవ్వడం ద్వారా అధిక దిగుబడిని సాధించవచ్చు. గులాబి రంగు పురుగు ఆశించినట్లైతే నివారణకు క్లోర్‌పైరిఫాస్ 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. మబ్బులతో కూడిన వాతావరణం మరియు వర్షపు తుంపరలు తేనెబంక తెగులు వ్యాప్తికి దోహదపడతాయి. పుష్పించే సమయంలో ఆశించే ఈ తెగులు నివారణకు కార్బండాజిమ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**రాగి:** ఎదిగిన మొక్కలలో అగ్గితెగులు ఆశించినప్పుడు ఆకులు, కణుపులు, వెన్నులపైన నూలుకండె ఆకారం మచ్చలు ఏర్పడతాయి. కణుపులు విరిగిపోతాయి. వెన్నుపై గింజలు తాలుగా మారుతాయి. అగ్గితెగులు నివారణకు కార్బాండాజిమ్ 1 గ్రా. లేదా మ్యాంకోజెబ్ 2.5 గ్రా. లేదా ట్రైసైక్లోజోల్ 0.6 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పంట పూత, గింజ పాలుపోసుకునే దశల్లో పైరు నీటి ఎద్దడికి గురికాకుండా చూడాలి.

**కొర్ర:** ఈ పంటలో అగ్గితెగులును గమనించినట్లైతే రాగి పంటలో సూచించిన విధంగా మందులను పిచికారి చేయాలి. పూత మరియు గింజ పాలుపోసుకునే దశల్లో పైరు నీటి ఎద్దడికి గురికాకుండా చూసుకోవాలి.

డా॥ యం. సుజాత, ప్రధాన శాస్త్రవేత్త (మొక్కజొన్న మరియు చిరుధాన్యాలు) & హెడ్, మొక్కజొన్న పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్, ఫోన్ నెం. 9182968409



## వేరుశనగ

- వానాకాలం పంటలో లద్దెపురుగు ఆశించినట్లైతే, పురుగు తొలిదశలో ఉన్నప్పుడు 5% వేప గింజల కషాయం పిచికారి చేసుకోవాలి. ఎకరాకు 8-10 పక్షి స్థావరాలను అమర్చాలి. ఎదిగిన లార్వాలను నివారించేందుకు ఫ్లూబెండమైడ్ 20% డబ్ల్యూజి 0.6 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.
- ఆకుమచ్చ తెగులు ఉధృతి గమనించినట్లైతే 2 మి.లీ. హెక్సాకొనజోల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.
- యాసంగి వేరుశనగ పంటను సాధారణంగా సెప్టెంబర్ 15 నుండి విత్తుకోవచ్చు. విత్తుకునే ముందు నేలను మెత్తగా దున్ని చదును చేసుకోవాలి. ఆఖరి దుక్కిలో 4-5 టన్నుల పశువుల ఎరువు, 100 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్, 33 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ మరియు 20 కిలోల యూరియా వేసుకోవాలి. ఎకరానికి 65-80 కిలోల గింజ అవసరమవుతుంది. ఒక కిలో విత్తనానికి 3 గ్రా. మ్యాంకోజెబ్ లేదా 1 గ్రా. టెబ్యుకొనజోల్‌తో విత్తనశుద్ధి చేసుకోవాలి. వరుసకు వరుసకు మధ్య 22.5 సెం.మీ., మొక్కకు మొక్కకు మధ్య 10 సెం.మీ. దూరం ఉండే విధంగా విత్తుకోవాలి. అలాక్లోర్ అనే కలుపు మందును 1.5-2.0 లీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 48 గంటలలోపు పిచికారి చేసుకోవాలి.

## ఆముదం

- భూమిలో తేమ ఉన్న సమయంలో 15 కిలోల యూరియాను పైపాటుగా వేయాలి. దాసరి పురుగు ఉధృతిని గమనించినట్లైతే తొలిదశలో 5 మి.లీ. వేపనూనె లీటరు నీటికి, పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నట్లైతే డైమిథోయేట్ 30% ఇసి 2 మి.లీ. లేదా మలాథియాన్ 50 ఇసి 3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఎకరాకు 8-10 పక్షి స్థావరాలను ఏర్పాటు చేసుకోవాలి.
- రసం పీల్చే పురుగుల నివారణకై ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పొగాకు లద్దె పురుగును గమనించినట్లైతే తొలిదశలో ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. 5 కిలోల వరి తవుడు + 500 గ్రా. బెల్లం + 500 మి.లీ. ఎసిఫేట్ 1.5 గ్రా. కలిపి విషపు ఎరను వాడవచ్చును. ఎండు తెగులును గమనించినట్లైతే కార్బండాజిమ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్ళ దగ్గర నేలను తడపాలి.
- వర్షాకాలం ఆముదం పంట ఇప్పుడు పూత దశలో ఉంటుంది. కాబట్టి బూజు తెగులు రాకుండా ఉండేందుకు వాతావరణ హెచ్చరికల ప్రకారం వర్షానికి 4-6 గంటల ముందు మరియు వర్షాలు తగ్గాక ప్రొపికొనజోల్ 1 మి.లీ. లేదా కార్బండాజిమ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఎకరాకు 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఎరువును అదనంగా వేసుకుంటే తర్వాత వచ్చే గెలలు ఆరోగ్యంగా వస్తాయి.

## నువ్వులు

- ఆలస్యంగా విత్తుకున్న నువ్వు పంటలో మొక్కలు మొలిచిన 15-20 రోజులకు కలుపును మరియు అదనపు మొక్కలను తీసివేయాలి.
- విత్తిన 30-35 రోజులకు గొర్రుతో అంతరకృషి చేయాలి.
- మొక్కలు మొలిచిన 7-20 రోజులలో మొక్కలు చనిపోవడం గమనించినట్లైతే కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి కలుపుకొని మొక్కల మొదళ్ళ దగ్గర పోయాలి.

## ప్రొద్దుతిరుగుడు

- పొగాకు లద్దెపురుగులను గమనించినట్లైతే నొవాల్యురాన్ 1.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. బీహారి గొంగళి పురుగు నివారణకై క్వినాల్‌ఫాస్ 25 ఇసి 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు, బూడిద తెగులు నివారణకై ప్రొపికొనజోల్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఆగష్టు రెండవ పక్షంలో



విత్తిన ప్రొద్దుతిరుగుడు పంటపై రసం పీల్చే పురుగులను గమనించినట్లైతే ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా డైమిథోయేట్ 2.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

## కుసుమ

- కుసుమ పంటను సెప్టెంబర్ రెండవ పక్షం నుండి వేసుకోవచ్చు. తేమను నిలుపుకునే బరువైన నల్లరేగడి నేలలు కుసుమ సాగుకు అనుకూలం. సాధారణంగా ఎకరానికి 4 కిలోల విత్తనం అవసరం అవుతుంది. కిలో విత్తనాన్ని 3 గ్రా. థైరమ్ లేదా కాప్టాన్ లేదా 1 గ్రా. కార్బండాజిమ్‌తో విత్తనశుద్ధి చేసుకోవాలి. ఎత్తు మడులు, కాలువల పద్ధతిలో నాటుకున్నట్లైతే తేమ సంరక్షణతోపాటు అధిక దిగుబడులు పొందవచ్చును.

డా॥ ఎమ్. శ్రీధర్ , ప్రధాన శాస్త్రవేత్త (నూనె గింజలు), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, ఫోన్ నెం. 8186945838

## సోయాచిక్కుడు

- సోయాచిక్కుడు, ప్రస్తుతం కాయ ఏర్పడే దశ నుండి గింజ నిండే దశలో ఉంది. సాధారణంగా సోయా పంటలో ఆశించే తెగుళ్లలో ఎక్కువగా పూత దశ నుండే ఆశించడం జరుగుతుంది.
- మన రాష్ట్రంలో కురిసిన అధిక వర్షాల వల్ల పొలాలలో నీరు చేరడం వలన వేరుకుళ్ళు తెగులు మరియు ఆంత్రాక్నోస్ ఆకుమచ్చ మరియు కాయకుళ్ళు తెగులు ఆశించడం జరుగుతుంది. వీటితోపాటు మసి బొగ్గు మరియు రైజోక్టోనియా ఏరియల్ బ్లాయిట్ తెగుళ్ళు ఆశించే అవకాశం ఉంది.
- వేరుకుళ్ళు తెగులు నివారణకు, లీటరు నీటికి 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 1 గ్రా. కార్బండాజిమ్ మందుతో మొక్క చుట్టూ భూమిని తడపాలి.
- ఆంత్రాక్నోస్ ఆకుమచ్చ మరియు కాయకుళ్ళు తెగులు, మసి బొగ్గు తెగులు మరియు రైజోక్టోనియా ఏరియల్ బ్లైట్ తెగుళ్ళ నివారణకు, 2.5 గ్రా. టెబ్యుకొనజోల్ 10% + సల్ఫర్ 65% డబ్ల్యుజి లేదా 0.6 మి.లీ. పైరాక్లోస్ట్రోబిన్ + ఫ్లక్సాపైరోక్సాడ్ లేదా 1 గ్రా. టెబ్యుకొనజోల్ లేదా 1 మి.లీ. ప్రొపికొనజోల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయవలెను.
- కాండం తొలిచే ఈగ మరియు కాండం తొలుచు పురుగులను అదుపు చేయడానికి, థయోమిథాక్సామ్ 12.6 శాతం + లామ్డాసైహలోత్రిన్ 9.5 శాతం లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 9.3% లామ్డాసైహలోత్రిన్ 4.6% లేదా 1.2 మి.లీ. ఇసోసైక్లోసోరం వంటి పురుగుమందులను, 10 గ్రా. 13:00:45 లీటరు నీటిలో కలిపి పిచికారి చేయడం వలన పంట దిగుబడి కూడా పెరుగుతుంది. తెల్లదోమ ఉధృతి అధికంగా ఉంటే, పైన తెలిపిన సింథటిక్ పైరిథ్రాయిడ్స్ మందులను పిచికారి చేయకూడదు.
- పొగాకు లద్దె పురుగు నివారణకు, 0.3 మి.లీ. క్లోరాంట్రానిలిప్రోల్ లేదా 1.65 గ్రా. నొవాల్యురాన్ 5.25% + ఎమామెక్టిన్ బెంజోయేట్ 0.9% యస్‌సి లీటరు నీటికి కలిపి పిచికారి చేయవలెను.
- అలాగే, పల్లాకు తెగులు ఉధృతి అక్కడక్కడ గమనించడం జరిగింది. ఈ తెగులు తెల్లదోమ ద్వారా వ్యాపిస్తుంది. కావున తెల్లదోమ నివారణకు, 1.25 మి.లీ. డయాఫెంథయురాన్ 50% డబ్ల్యుపి లేదా 0.5 గ్రా. ఎసిఫేట్ + బైఫెంత్రిన్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయవలెను.

డా॥ ఎం. రాజేందర్ రెడ్డి, ప్రధాన శాస్త్రవేత్త (సోయాచిక్కుడు), వ్యవసాయ పరిశోధన స్థానం, ఆదిలాబాద్, ఫోన్ నెం. 97041 34304

## అపరాలు

**యాసంగి-మినుము, పెసరకు అనువైన రకాలు:**

**మినుము:** ఎమ్.బి.జి-1070, ఎమ్.బి.జి-207, జి.బి.జి-1, టి.బి.జి-104, ఎల్.బి.జి-787, ఎల్.బి.జి-752, పి.యు-31.

**పెసర:** ఎమ్.జి.జి-385, ఎమ్.జి.జి-295, ఎమ్.జి.జి-351, ఎమ్.జి.జి-347, ఎమ్.జి.జి-348, డబ్ల్యు.జి.జి-42,



టి.యం.-96-2, ఎల్.జి.జి-460, ఎల్.జి.జి-407, ఐ.పి.యు-2-14.

**విత్తే సమయం:** యాసంగి-15 సెప్టెంబర్ నుండి అక్టోబర్ చివరి వరకు విత్తాలి.

**విత్తన మోతాదు:** 6-8 కిలోలు ఎకరాకు విత్తనం అవసరమవుతుంది.

**విత్తనశుద్ధి:** కిలో విత్తనానికి 3 గ్రా. థైరమ్ లేదా కాప్టాన్ లేదా మ్యాంకోజెబ్ మందుతో విత్తనశుద్ధి చేసిన తరువాత 5 గ్రా. థయోమిథాక్సామ్ లేదా 5 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ మందుతో విత్తనశుద్ధి చేసి విత్తితే తొలిదశలో ఆశించే రసంపీల్చే పురుగులు మరియు తెగుళ్ళ బారి నుండి కాపాడుకోవచ్చును. చివరగా విత్తే ముందు 10 కిలోల విత్తనానికి 200 గ్రా. రైజోబియం కల్చర్‌ను పట్టించి విత్తుకోవాలి.

**అంతరకృషి:** పెసర/మినుము పైరును 30 రోజుల వరకు కలుపు బారి నుండి రక్షించుకోవాలి. 20 రోజులు, 30 రోజుల దశలో గొర్రు/దంతి ద్వారా అంతకృషి చేస్తే కలుపు నివారణతోపాటు తేమను కూడా నిలుపుకోవచ్చు. కలుపు అధికంగా ఉండే భూములలో పెండిమిథాలిన్ 30% ఎకరాకు 1.0-1.4 లీటర్ల చొప్పున విత్తిన వెంటనే గాని మరుసటి రోజుగాని పిచికారి చేయాలి. వెడల్పాకు కలుపు నివారణకు ఇమజితాఫిర్ (పర్సుట్) 300 మి.లీ. ఎకరాకు లేదా 2 నుండి 3 ఆకుల గడ్డిజాతి కలుపు నివారణకు ఎకరాకు 400 మి.లీ. క్విజలోపాప్ ఇథైల్ లేదా ప్రొపిక్విజాపాప్ 10% ఇసి 250 మి.లీ. పిచికారి చేయాలి. కలుపు మందులు పిచికారి చేసేటప్పుడు నేలలో తగు తేమ ఉండేలా చూసుకోవాలి.

**నీటి యాజమాన్యం:** వానాకాలంలో పెసర, మినుమును వర్షాధారంగా పండిస్తారు. బెట్ట పరిస్థితులలో అవసరం మేరకు కీలక దశల్లో 1-2 తడులు ఇచ్చినచో మంచి దిగుబడి సాధించవచ్చును.

**కీలక దశలు:** పూత మరియు కాయ తయారయ్యే దశలో పంట బెట్టకు గురికాకుండా చూడాలి. బెట్ట పరిస్థితుల్లో 2% (20 గ్రా. లీటరు నీటికి) యూరియా ద్రావణాన్ని అవసరాన్ని బట్టి 2 లేదా 3 సార్లు పిచికారి చేయాలి.

**యాసంగి కంది:** కంది పైరును నీటి వసతి ఉన్న ప్రాంతాలలో సెప్టెంబర్ నెలలో సాగు చేసుకునే అవకాశముంది.

**రకాలు:** డబ్ల్యు.ఆర్.జి-65, ఐసిపియల్-2740, టిడిఆర్జి-4, ఐసిపియల్-87119 (ఆశ), డబ్ల్యుఆర్జి-255, టిడిఆర్జి-59.

**విత్తు సమయం:** సెప్టెంబర్ 15 నుండి అక్టోబర్ 15 వరకు విత్తుకోవచ్చును.

**విత్తు దూరం:** భూ స్వభావాన్ని బట్టి 60×20 సెం.మీ. / 90×20 సెం.మీ. / 120×20 సెం.మీ. దూరాన్ని మార్చుకొనవలెను.

**ఎరువులు:** నత్రజని 20 కిలోలు, భాస్వరం 50 కిలోలు హెక్టారుకు దుక్కిలో వేయవలెను. సూటి ఎరువులు అయినటువంటి యూరియా మరియు సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ వాడవలెను.

కంది పెరిగే దశలో ఆకు చుట్టూ పురుగు ఆశిస్తుంది. దీని ఉధృతి ఎక్కువగా ఉన్నట్లైతే నివారణకు క్లోరోపైరిఫాస్ 2 మి.లీ. లేదా క్వినాల్ఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

తొలకరిలో వేసిన మినుము, పెసర పైర్లు పూత మరియు కాయ దశల్లో మరియు కంది శాఖీయ దశల్లో ఉన్నాయి. మినుము, పెసర పైర్లకు ముఖ్యంగా క్రింది పురుగులు మరియు తెగుళ్ళు ఆశించే అవకాశం ఉంది.

**తలమాడు లేదా మొవ్వుకుళ్ళు:** వైరస్ వల్ల కలిగే తెగులు, తామర పురుగులు దీని వ్యాప్తికి దోహదపడుతాయి. ముఖ్యంగా బెట్ట వాతావరణంలో ఈ తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. ఈ తెగులును నివారించాలంటే తామర పురుగులను నియంత్రించవలెను. వీటి నివారణకు 1 గ్రా. ఎసిఫేట్ లేదా ఫిప్రోనిల్ 1.5 మి.లీ. లేదా డైమిథోయేట్ 2.0 మి.లీ. లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి ఉధృతిని బట్టి వారం రోజుల వ్యవధిలో మందులను మార్చి మార్చి పిచికారి చేయాలి. పంట కంటే ఒక అడుగు ఎత్తులో నీలి రంగు జిగురు అట్టలను, ఎకరానికి 20 ఉంచినట్లైతే తామర పురుగుల ఉధృతిని తెలుసుకోవచ్చును.

**పల్లాకు తెగులు:** పల్లాకు తెగులు సోకిన మొక్కలను మరియు ఇతర కలుపు మొక్కలను పీకి నాశనం చేయవలెను. పైరు పై ఒక అడుగు



ఎత్తులో పసుపు రంగు రేకులను గాని అట్టలను గాని ఉంచి వాటి మీద ఆముదం గాని గ్రీజుగాని పూసినట్లైతే తెల్లదోమ ఉధృతిని తెలుసుకొనవచ్చును. తెల్లదోమ నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లీటరు నీటికి కలిపి, పురుగుల ఉధృతిని బట్టి 7 నుండి 10 రోజుల వ్యవధిలో మందులను మార్చి మార్చి పిచికారి చేయాలి.

**మారుకా మచ్చల పురుగు:** పూతదశలో 'మారుకా' అను గూడు పురుగు ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు లీటరు నీటికి క్లోర్‌పైరిఫాస్ 2.5 మి.లీ. లేదా నొవాల్యురాన్ 1.0 మి.లీ. లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ. మందును పిచికారి చేస్తే పురుగును నివారించవచ్చు. అవసరమైతే వారం రోజుల తర్వాత మరల పిచికారి చేయాలి.

**ఆకుమచ్చ తెగులు:** ఈ తెగులు సోకిన ఆకులపై గోధుమ రంగు గుండ్రని చిన్న చిన్న మచ్చలు కనిపిస్తాయి. ఈ మచ్చలు పెద్దవై ఆకులు ఎండి రాలిపోతాయి. దీని వలన కాయల్లో గింజలు సరిగ్గా నిండవు. నివారణకు లీటరు నీటికి 2.5 గ్రా. మ్యాంకోజెబ్ లేదా 1 గ్రా. క్లోరోథలోనిల్ లేదా 1 గ్రా. కార్బండాజిమ్ లేదా 1 గ్రా. థయోఫానేట్ మిథైల్‌లను కలిపి పిచికారి చేయాలి.

**డా॥ కె. రుక్మిణి దేవి, ప్రధాన శాస్త్రవేత్త (అపరాలు) & హెడ్, వ్యవసాయ పరిశోధన స్థానం, మధిర, ఫోన్ నెం. 7675050041**

## ప్రత్తి

- రాష్ట్రంలో ప్రస్తుతం ప్రత్తి పంట పూత, కాత / కాయ ఏర్పడే దశలో ఉంది.
- నేలలో అధిక తేమ లేదా బెట్ట పరిస్థితుల్లో ప్రత్తి పంటలో పూత, కాత రాలటం జరుగుతుంది లేదా ఎక్కువ మోతాదులో యూరియా వాడినా లేదా తక్కువ పొటాషియం వాడినా లేదా భూమిలో బోరాన్ తక్కువగా ఉన్నా పూత, కాత రాలుతుంది.
- ప్రత్తిలో పూత, కాత పిందె రాలటం ఎక్కువగా ఉంటే 5 లీటర్ల నీటికి 1 మి.లీ. ప్లానోఫిక్స్ (ఎన్ఎఎ 10 పిపిఎమ్) కలుపుకొని పిచికారి చేయాలి.
- యూరియా మరియు పొటాష్ ఎరువును ప్రత్తి పంట 80-90 రోజుల దశ వరకే వాడాలి. విత్తిన 80-90 రోజుల తర్వాత నుండి ఎరువులు వేయడం ఆపివేయాలి.
- ప్రత్తి మొక్క ఎదుగుదల తక్కువగా ఉన్నట్లైతే పైపాటుగా లీటరు నీటికి 10 గ్రా. చొప్పున 13:0:45 (మల్టి-కె) లేదా 19:19:19 (పాలీఫీడ్) లేదా యూరియాను పురుగు లేదా తెగులు మందులను పిచికారి చేసేటప్పుడు కలుపుకొని పైపాటుగా వాడుకోవచ్చు.
- ప్రత్తి మొక్క మధ్య ఆకులు ఎరుపు లేదా పండాకుగా మారినట్లైతే లీటరు నీటికి 10 గ్రా. మెగ్నీషియం సల్ఫేట్ + 2 గ్రా. జింక్ సల్ఫేట్ + 2 గ్రా. బోరాన్‌ను కలిపి వారం-పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేసుకోవాలి.
- అధిక సాంద్రతలో ప్రత్తిని సాగు చేస్తున్న రైతులు ప్రత్తి చేను 60-65 రోజుల దశలో ఉంటే మొక్క పెరుగుదలను మరియు శాఖీయ కొమ్మల పెరుగుదలను అదుపులో ఉంచుటకై మెపిక్వాట్ క్లోరైడ్ మందును లీటరు నీటికి 1.2 మి.లీ. కలుపుకొని పిచికారి చేసుకోవాలి.
- ప్రత్తిలో పేనుబంక, పచ్చదోమ మరియు తామర పురుగులు ఆశించే అవకాశం ఉంది.
- తామర, పేనుబంక మరియు పచ్చదోమ నివారణకై ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. లేదా ఫ్లోనికామిడ్ 0.3 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ. లేదా సల్ఫాక్సాఫ్లోర్ 0.75 గ్రా. లేదా డైఫెన్‌థయూరాన్ 1.25 గ్రా. డైనోటోఫ్యూరాన్ 0.4 గ్రా. లేదా స్పైనోటోరమ్ 0.9 మి.లీ. లేదా ఎసిఫేట్ + ఇమిడాక్లోప్రిడ్ 2 గ్రా. లీటరు నీటికి కలుపుకొని మందులను మార్చి మార్చి పిచికారి చేసుకోవాలి.



- తెల్లదోమ నివారణకై సల్ఫాక్సాఫ్లోర్ 0.75 గ్రా. లేదా డైఫెన్‌థయూరాన్ 1.25 గ్రా. లేదా బైఫెన్‌థ్రిన్ + డైఫెన్‌థయూరాన్ 1.25 గ్రా. మందులను లీటరు నీటికి కలుపుకొని పిచికారి చేసుకోవాలి.
- తలమాడు తెగులు (టి ఎస్ వి) ప్రత్తిలో ఆశించినట్లు గమనించడం జరిగింది. తామర పురుగులు ఈ తెగులు వ్యాప్తికి దోహదబడతాయి. అదేవిధంగా వయ్యారిభామ కలుపు మొక్కలు పూతకు రాక ముందే పీకి వేయాలి.
- తామర పురుగు నివారణకై ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా సల్ఫాక్సాఫ్లోర్ 0.75 గ్రా. లేదా థయోమిథాక్సామ్ 0.2 గ్రా. కలుపుకొని పిచికారి చేసుకోవాలి.
- గులాబిరంగు పురుగు నివారణకై పంట పూత దశ నుండే లింగాకర్షక బుట్టలు ఎకరాకు 4 నుండి 8 వరకు పెట్టుకోవాలి. గుడ్డిపూలను ఎరి వేయాలి. పురుగు తాకిడిని బట్టి మొదటగా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. + వేపనూనె 5 మి.లీ. లీటరు నీటికి కలుపుకొని పిచికారి చేసుకోవాలి.
- ప్రత్తి పంటలో కనిపించు వివిధ ఆకుమచ్చల నివారణకై లీటరు నీటికి 2.5 గ్రా. మ్యాంకోజెబ్ లేదా 1 గ్రా. కార్బండాజిమ్ లేదా 2.5 గ్రా. కార్బండాజిమ్ + మ్యాంకోజెబ్ మిశ్రమాన్ని 1 లేదా 2 సార్లు పిచికారి చేసుకోవాలి.

**డా॥ జి. వీరన్న, ప్రధాన శాస్త్రవేత్త (ప్రత్తి), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్, ఫోన్ నెం. 8332970247**

## చెఱకు

అధిక వర్షాలు మరియు తుఫాను గాలులకు పంట పడిపోకుండా మొక్కల వరుసల మొదళ్ళకు ఎత్తుగా మట్టిని ఎగదోయాలి. నీటి ముంపునకు గురైన లేదా గురికాబోయే తోటల్లో, ప్రతి 24 మీటర్లకు 40 సెం.మీ. లోతు, 60 సెం.మీ. వెడల్పుగల కాలువలను ఏర్పాటు చేసుకోవాలి. తోటల్లో నీరు నిల్వకుండా మురుగు నీటి కాల్వల ద్వారా గాని లిఫ్టు పంపులు వినియోగించి తరచుగా నీటిని తీసివేయాలి.

ఈ మాసంలో దూదేకుల పురుగు పంటను ఆశించి, పురుగులు ఆకుల అడుగుభాగాన గుంపులు గుంపులుగా చేరి, ఆకుల నుండి రసాన్ని పీల్చి వేయడం వలన ఆకులు వడలిపోతాయి. క్లోర్‌పైరిఫాస్ 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసి ఈ పురుగును నివారించుకోవచ్చు.

వాతావరణం మబ్బుగా ఉండి 19-35 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రత మరియు 80-90 శాతం గాలిలో తేమ ఉన్నప్పుడు తెల్లపేను (ఊలి ఎఫిడ్) అభివృద్ధి చెందుతుంది. దీని యొక్క తల్లి మరియు పిల్ల పురుగులు ఆకుల అడుగుభాగంలో గుంపులుగా ఉండి రసాన్ని పీల్చడం వలన తెలుపు, పసుపు వర్ణం మిళితమైన మచ్చలు ఏర్పడతాయి. మొదట అంచులు, తర్వాత మొత్తం ఆకులు క్రమేపి ఎండిపోతాయి. ఈ పురుగుల విసర్జన తియ్యని జిగట పదార్థం లాగా ఉండి కిందున్న ఆకుల పై భాగాన పడి, దాని మీద సూటీమోల్డ్ అనే నల్లని శిలీంధ్రం పెరిగి ఆకు మసిబారుతుంది. గాలి ద్వారా 1.5-2.0 కిలోమీటర్ల దూరం వరకు ఈ పురుగులు వ్యాప్తి చెందగలవు. దీని నివారణకు, పంటకు సిఫార్సు చేసిన మోతాదులో నత్రజని ఎరువులు వాడాలి. పురుగు ఆశించిన ఆకులను తీసి తగులబెట్టాలి. లీటరు నీటికి క్లోర్‌పైరిఫాస్ 2.5 మి.లీ. మోతాదులో కలిపి పిచికారి చేయాలి.

ఈ మాసంలో పిండి పురుగు కూడా పంటను ఎక్కువగా ఆశించి నష్టపరుస్తుంది. పురుగులు ఆకు తొలిమెలకు, చెఱకు గడలకు మధ్య గుంపులు గుంపులుగా చేరి గడల నుండి రసాన్ని పీల్చివేస్తాయి. పంట పక్వానికి వచ్చునప్పుడు పిండినల్లి తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఉధృతంగా ఉన్నప్పుడు మొవ్వు ఎండిపోతుంది. ఎదిగిన తోటల్లో పురుగు నివారణకు ఆకులు రెలచి, బహిర్గతమైన కణుపుల మీద లీటరు నీటికి క్లోర్‌పైరిఫాస్ 2.5 మి.లీ. మోతాదులో కలిపి పిచికారి చేయాలి. ఇటీవల కాలంలో ఆకుపై ఆశిస్తున్న పిండినల్లి (డిస్మికాకస్ కారెన్స్) నివారణకు కూడా పైన సూచించిన మందులను ఆకు తడిచేటట్లుగా పిచికారి చేసి, పురుగును అదుపులో ఉంచవచ్చు.

**డా॥ యం. విజయ్ కుమార్, ప్రధాన శాస్త్రవేత్త (చెఱకు) & హెడ్ వ్యవసాయ పరిశోధన స్థానం, బసంత్‌పూర్, మెదక్, ఫోన్ నెం. 9849535756**

# వాతావరణం-పంటల పరిస్థితి-విశ్లేషణ

డా॥ పి. లీలా రాణి
వ్యవసాయ వాతావరణ పరిశోధన కేంద్రం, వ్యవసాయ పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్

భారత వాతావరణ విభాగం వారి సమాచారం ప్రకారం నైరుతి ఋతుపవనాలు మే 24వ తేదీన కేరళలో ప్రవేశించాయి. రాష్ట్రంలో నైరుతి ఋతుపవనాలు మే 26వ తేదీన ప్రవేశించి రెండు రోజుల వ్యవధిలో అంటే మే 28వ తేదీ వరకు రాష్ట్రమంతటా విస్తరించాయి. ఇప్పటివరకు రాష్ట్రంలో 01.06.2025 నుండి 03.09.2025 వరకు కురిసిన వర్షపాతాన్ని గమనించినట్లయితే సాధారణ వర్షపాతం 593.0 మి.మీ. గాను 757.5 మి.మీ అనగా సాధారణ వర్షపాతం కంటే 28 శాతం ఎక్కువ వర్షపాతం నమోదైనది.

రాష్ట్రంలో వానాకాలం పంటకాలానికి ఇప్పటి వరకు (28.08.2025) సాధారణ విస్తీర్ణంలో (ఎకరాలలో) వరి-95.34 శాతం (5956406), జొన్న-68.10 శాతం (34548), మొక్కజొన్న - 119.51శాతం (622883), ప్రత్తి - 92.51 శాతం (4526485), కంది - 71.07 శాతం (475980), పెసర - 70.82 శాతం (60748), మినుములు - 68.54 శాతం (22551) మరియు వేరుశనగ - 24.70 శాతం (6803) సాగు చేయటం జరిగింది. ఈ సంవత్సరం వానాకాలం పంటకాలంలో ఇప్పటి వరకు 93.70 శాతం మేర పంటలు సాగుచేయటం జరిగింది. ఇందులో ఆహార పంటలు 96.95 శాతం, పప్పుదినుసులు 70.73 శాతం, నూనె గింజల పంటలు 64.66 శాతం సాగుచేయటం జరిగింది.

వాతావరణ విభాగం సమాచారం ప్రకారం సెప్టెంబర్ మాసంలో సాధారణం నుండి సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యేసూచనలు ఉన్నాయి మరియు గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా మరియు కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే సూచనలున్నాయి.

**అధిక వర్షాల నుండి పంటల సంరక్షణకు చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులు**

- భారీ వర్షాలు కురిసిన ప్రాంతాలలో పొలం నుండి మురుగు నీటిని తీసివేయాలి.
- నేల ద్వారా వ్యాప్తి చెందే తెగుళ్ళను నివారించుటకు 3 గ్రా. కాపర్-ఆక్సి-క్లోరైడ్ లేదా 2 గ్రా. కార్బెండజిమ్ + మ్యాంకోజెబ్ శిలీంధ్రనాశక మందును లీటరు నీటికి కలిపి నేల బాగా తడిచేటట్టు మొక్కల మొదళ్ళ చుట్టూ పోయాలి.
- ముంపుకు గురైన పంట త్వరగా కోలుకోవడానికి 10 గ్రా. 19:19:19 లేదా 13-0-45 లేదా యూరియా లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.

**వాతావరణాధారిత వ్యవసాయ సలహాలు**

- వర్షాధార పంటలలో చివరి అంతర కృషి తరువాత గొడ్డు చాలు వేయడం ద్వారా నేలలో తేమను సంరక్షించుకోవచ్చు.
- అధిక వర్షాల వలన వరి పంట పూతదశలో మానిపండు మరియు గింజ నల్ల మచ్చ తెగులు ఆశించుటకు అనుకూలం. నివారణకు, ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్ 25% + టెబ్యుకోనజోల్ 50% (75 డబ్ల్యుజి) 160 గ్రా. ఎకరానికి లేదా ప్రోపికోనజోల్ 200 మి.లీ. ఎకరానికి లేదా పికాక్సీస్ట్రోబిన్ 7% + ప్రోపికోనజోల్ 12% ఎస్‌సి 400 మి.లీ. ఎకరానికి పిచికారి చేయాలి.

**అధిక వర్షాల వలన వరిలో బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు ఆశించుటకు అనుకూలం. తెగులు గమనించినట్లయితే నివారణకు:**

- నత్రజని ఎరువులను వేయడం తాత్కాలికంగా వాయిదా వేయాలి మరియు పొలం నుండి నీటిని తీసివేయాలి.
- ప్లాంటోమైసిన్ 0.2 గ్రా. + కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లేదా అగ్రిమైసిన్ 0.4 గ్రా. + కాపర్ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- అధిక వర్షాల వలన నల్లరేగడి నేలలోని ప్రత్తికి ఎండు తెగులు సోకుటకు అవకాశం ఉన్నది. నివారణకు, 3 గ్రా. కాపర్ఆక్సీక్లోరైడ్ మందును లీటరు నీటిలో కలిపి మొక్కల మొదళ్ళ చుట్టూ నేలను తడపాలి.
- అధిక వర్షాల తరువాత ప్రత్తిలో బ్యాక్టీరియా ఆకు మచ్చ తెగులు గమనించినట్లయితే నివారణకు 3 గ్రా. కాపర్-ఆక్సి- క్లోరైడ్ లేదా 1 గ్రా. కార్బండాజిమ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- మొకాలు ఎత్తుదశలో ఉన్న పైరులో ఒక కిలో సున్నం మరియు 9 కిలోల ఇసుకను కలిపి మొక్క సుడులలో వేసి కత్తెర పురుగును నివారించుకోవలెను. మొక్కజొన్నలో కత్తెర పురుగు గమనించినట్లయితే నివారణకు 0.4 మి.లీ. క్లోరాంట్రానిలిప్రోల్ లేదా 0.5 మి.లీ. స్పైనోటోరం మందును లీటరు నీటికి కలిపి ఆకు సుడుల లోపల తడిచేలా పిచికారి చేయాలి.
- పూత దశలో ఉన్న మొక్కజొన్న పంట బెట్ట పరిస్థితులను తట్టుకోలేదు కావున రైతులు పైరుకు జీవసంరక్షక నీటి తడి తప్పనిసరిగా ఇవ్వవలెను.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం.9704157445

# తడి–పొడి విధానంతో వరి సాగులో నీటి యాజమాన్యం

జె. విజయ్, జి. ఆదిత్య మరియు డా॥ ఎన్. వెంకటేశ్వర్ రావు

కృషి విజ్ఞాన కేంద్రం, జమ్మికుంట








ప్రపంచ వ్యాప్తంగా సగం కంటే ఎక్కువ జనాభా ప్రధాన ఆహారంగా వాడే వరి పంటను సాగు చేయడానికి ఎక్కువ మోతాదులో నీరు అవసరం. సంప్రదాయ పద్ధతిలో కిలో బియ్యం ఉత్పత్తి చేయడానికి 3000 నుండి 5000 లీటర్ల నీరు అవసరం అవుతుంది. ఇది ఇతర ఆహార ధాన్యాల ఉత్పత్తికి అయ్యే నీటి వినియోగం కంటే 2-3 రెట్లు అధికం. కాబట్టి తక్కువ నీటితో ఎక్కువ ఉత్పాదకత సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తక్కువ నీటి వినియోగంతో దిగుబడులు తగ్గకుండా వరి పంటను సాగు చేయడానికి అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ వారు తడి పొడి విధానాన్ని రూపకల్పన చేసారు.

తడి–పొడి వరి సాగు (ఏడబ్ల్యుడి) అనేది ఒక స్థిరమైన సాగునీటి యాజమాన్య పద్ధతి. సాధారణంగా, సాంప్రదాయ పద్ధతిలో పొలం మొత్తం నీరు నిలువ కట్టడానికి బదులుగా, ఎడబ్ల్యుడి విధానంలో - నేల అవసరాన్ని బట్టి, తేమ స్థితిగతులను చూసి, "క్రమంగా నీరు పెట్టడం మరియు ఆరబెట్టడం" చేయాలి. ఇలా, తడి–పొడి పద్ధతిలో సాగునీరు ఎప్పుడు అవసరం అవుతుందో అప్పుడు మాత్రమే అందించి, తరువాత పొలాన్ని ఆరబెట్టడం - ఆరుతడి సాగు యొక్క ప్రధాన సూత్రం. ఈ పద్ధతిలో రెండు తడుల మధ్య సమయం వాతావరణ పరిస్థితులు, నేల రకం మరియు పంట కాలాన్ని బట్టి 1 నుండి 10 రోజుల వరకు ఉంటుంది.

**పొలంలో అమర్చుకునే నీటి గొట్టం నిర్మాణం:**

ఈ పద్ధతిలో మార్కెట్‌లో దొరికే ప్లాస్టిక్ పైపు (15 సెం.మీ. వ్యాసము, 30 సెం.మీ. పొడవు) కు సగభాగం (15 సెం.మీ) వదిలి మిగతా 15 సెం.మీ. పైపుకు 2 సెం.మీ. ఎడంతో రంధ్రాలు చేసుకోవాలి. ఈ పైపును రంధ్రాలున్నంత వరకు ఒక ఒడ్డుకు దగ్గరగా పొలంలో దింపాలి. ఆ తరవాత పైపు లోపల మట్టిని అడుగు భాగం వరకు తీసివేయాలి. పైపు లోపలి నీటి మట్టం మరియు పొలంలో నీటి మట్టం ఒకే ఎత్తులో ఉండేటట్లు జాగ్రత్తపడాలి.

**తడి పొడి విధానం అమలు పద్ధతి:** నాటు వేసిన కొన్ని రోజుల తర్వాత అనగా సుమారు 1-2 వారాలు లేదా నేరుగా విత్తే పద్ధతిలో సాగు చేసే వరిలో మొక్క 10 సెం. మీటర్ల ఎత్తు పెరిగిన తర్వాత ఈ పద్ధతిని ఆరంభించవచ్చు.

**నాటిన నుండి చిరుపొట్ట దశ వరకు:** పైపులో నీటి మట్టం నేల మట్టం కన్నా 5 సెం.మీ. క్రిందకు తగ్గినచో, పొలంలో నీటి మట్టం నేల మట్టంపై 5 సెం.మీ పైకి ఉండేటట్లు నీటిని పెట్టాలి.

పూత దశ నుండి గింజ పాలు పోసుకునే దశ వరకు: పైపులో నీటి మట్టం నేల మట్టం కన్నా 3 సెం.మీ. క్రిందికి తగ్గినప్పుడు, తిరిగి నేల మట్టంపై 5 సెం.మీ. ఉండేటట్లు నీటిని పెట్టాలి.

**లాభాలు:**

1. పంటలకు అవసరమైన నీటి తడుల సంఖ్య తగ్గడం వలన 15-30 శాతం నీరు ఆదా అవుతుంది
2. వరి దుబ్బు మరియు కంకుల సంఖ్య ఎక్కువగా ఉండడం వల్ల చేను మీద పడిపోదు.
3. నేల భౌతిక పరిస్థితులు మెరుగుపరచడమే కాకుండా యంత్రం ద్వారా కోతకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి.
4. కరెంట్ ఖర్చు, సాగు ఖర్చు తగ్గుతాయి.
5. మీథేన్ అనబడే కాలుష్య కారకం విడుదల తగ్గుతుంది.
6. హైడ్రోజన్ సల్ఫైడ్ వలన వరికీ హాని కలుగకుండా ఉంటుంది.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 8500119198

# మొక్కజొన్న కత్తెర పురుగు మనదేశంలో ప్రవేశించి అప్పుడే ఏడు సంవత్సరాలు...

డా॥ బి. రామ్ ప్రసాద్, డా॥ ఇ. రజనీకాంత్, డా॥ బి. హరికృష్ణ, డా॥ జి. ఉషారాణి, డా॥ ఇ. ఉమారాణి,
డా॥ కె. మదన్ మోహన్ రెడ్డి మరియు డా॥ ఎమ్. రాజేంద్రప్రసాద్
వ్యవసాయ పరిశోధన స్థానం మరియు ఏరువాక కేంద్రం, కరీంనగర్



తెలంగాణ రాష్ట్రంలో మొక్కజొన్న పంటను (2023-24) వానాకాలంలో 2.21 లక్షల హెక్టార్లలో సాగు చేయబడి 4500 కి/హె. ఉత్పాదకత సాధించబడినది. ప్రస్తుత పరిస్థితులలో మొక్కజొన్న వరి, గోధుమ తర్వాత ప్రధాన ఆహార పంటగా పరిగణించబడుతుంది. ఎందుకంటే ఇది అనేక రకాల పారిశ్రామిక ఉత్పత్తులలో విస్తృతంగా ఉపయోగించబడుతుంది. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన మొక్కజొన్న పంటను గత కొన్ని సంవత్సరాలుగా కత్తెర పురుగు ఆశించి మొక్కజొన్న దిగుబడులను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. భారతదేశంలో ఈ కీటకం 2018 జూలై నెలలో కర్ణాటకలో మొదటగా గుర్తించబడింది. ఈ సంవత్సరం జూలై నాటితో ఈ కత్తెర పురుగు మన భారతదేశానికి వచ్చి 7 సంవత్సరాలు అయింది. ఈ కత్తెర పురుగు మొక్కజొన్న అన్ని భాగాలను ఆశించి నష్టపరుస్తుంది. దీనిని నియంత్రించడం చాలా కష్టతరం ఎందుకంటే....

1. ఈ పురుగు అధిక పునరుత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉన్నది.
2. నిద్రావస్థ దశ లేకపోవడం వలన సంవత్సరమంతా జీవించి ఉండగలదు.
3. సుదూర ప్రాంతాలకు వెళ్ళే సామర్థ్యం కలదు.
4. పురుగు వ్యాప్తికి అనుకూలమైన వాతావరణ పరిస్థితులలో ప్రత్యుత్పత్తి పెరిగే అవకాశం.
5. పురుగుకి అనుకూల వాతావరణ పరిస్థితులు ఉన్నట్లైతే సంవత్సరం పొడవునా మొక్కజొన్నను ఆశించగలదు.
6. ఈ పురుగుకి వలస సామర్థ్యం చాలా ఎక్కువ, ఒక రాత్రిలోనే 100 కిలోమీటరు దూరం వరకు ప్రయాణించగలదు.

ఈ పురుగు మొక్కజొన్న పంట తొలిదశ నుండి కోత దశ వరకు వివిధ భాగాలను ఆశించి నష్టం చేస్తుంది. గ్రుడ్ల నుండి పొదగబడిన చిన్న పిల్ల పురుగులు తొలిదశలో ఆకుల మీద పత్రహరితాన్ని గోకి తింటాయి. రెండవ దశలో పురుగులు కాండం మొవ్వులో చేరి లోపల తింటాయి. తర్వాత దశ లార్వాలు ఆకులమీద పెద్ద పెద్ద రంధ్రాలు చేసి మొవ్వను పూర్తిగా తినడం వలన మొవ్వ చనిపోతుంది. అలాగే పురుగు తిని విసర్జించిన మల పదార్థంతో మొవ్వ అంతా నిండి ఉంటుంది. ఇది మొక్కజొన్న కంకి మరియు లేత కండె భాగాన్ని కూడా తిని నష్టపరుస్తుంది. ఇది మొక్కజొన్ననే కాకుండా చెఱకు, వరి మరియు ఇతర పంటలను కూడా ఆశించి నష్టపరుస్తుంది. ప్రతీ ఏడాది మొక్కజొన్నలో ఈ కత్తెర పురుగు వల్ల ప్రపంచ వ్యాప్తంగా సుమారు 8.3 నుండి 20.6 మిలియన్ టన్నుల మేరకు దిగుబడి నష్టం జరుగుతున్నట్లు అంచనా వేయబడింది.

ఈ కత్తెర పురుగు తొలుత భారతదేశంలో 2018లో కర్ణాటక రాష్ట్రంలో దీని ఉనికిని ధృవీకరించడం జరిగింది. తదుపరి 1-3 సంవత్సరాల వ్యవధిలోనే జమ్ముకాశ్మీర్ మరియు హిమాచల్ ప్రదేశ్ మినహా మిగతా అన్ని ప్రాంతాలలో వ్యాపించడం జరిగింది.

కత్తెర పురుగు రెండు అత్యంత దగ్గర సంబంధమున్న రకాల (స్ట్రెయిన్) సమూహంగా పరిగణించబడుతుంది. ఇవి మొక్కజొన్న రకం (స్ట్రెయిన్), వరి రకం (స్ట్రెయిన్), మొక్కజొన్న స్ట్రెయిన్‌కు ముఖ్యంగా మొక్కజొన్న, జొన్న లాంటి పంటలతో అనుబంధం, వరి స్ట్రెయిన్‌కు వరి మరియు ఇతర గడ్డిజాతి పశుగ్రాసాలతో అనుబంధం ఉంటుంది.

### సమగ్ర యాజమాన్య పద్ధతులు:

**విత్తనశుద్ధి:** విత్తనం విత్తే ముందు కిలో విత్తనానికి సయాంట్రానిలిప్రోల్ + థయోమిథాక్సామ్ (ఫోర్టాంజాడ్యుయో) 6 మి.లీ. కలిపి విత్తనశుద్ధి చేసి విత్తుకున్నట్లైతే సుమారుగా 2-3 వారాల వరకు మొక్కజొన్న పంటను కత్తెర పురుగు తాకిడి నుండి రక్షించుకోవచ్చును. పురుగుపై నిఘా మరియు పురుగు వ్యాప్తిని

అరికట్టుటకు ఎకరానికి 10 చొప్పున లింగాకర్షక బుట్టలను అమర్చుకోవాలి. దీని ద్వారా సుమారుగా 30 నుండి 40% వరకు పురుగు వల్ల కలిగే నష్టాన్ని కూడా అరికట్టవచ్చు.

- మొక్కజొన్న మొలకెత్తిన 14 రోజులలోపు 5% వేప కషాయం లేదా వేపనూనె (1500 పిపియం) లీటరు నీటికి 5 మి.లీ. చొప్పున పిచికారి చేసుకున్నట్లైతే చాలా వరకు గ్రుడ్లను నశింపచేయవచ్చును.
- గ్రుడ్లను ఎప్పటికప్పుడు ఏరివేసి నాశనం చేయాలి.
- ఎండాకాలం లోతు దుక్కులు చేసుకోవాలి.
- మోతాదుకు మించి నత్రజని ఎరువులను వాడరాదు.
- పంటలో కలుపు లేకుండా చూసుకోవాలి.
- అంతర పంటలుగా పెసర, మినుము లేదా బొబ్బర్లు వేసుకొని కొద్ది వరకు కత్తెర పురుగు ఉధృతిని తగ్గించుకోవచ్చును.
- మొక్క మొలిచిన నెలలోపు మొగిలో 9:1 నిష్పత్తిలో ఇసుక మరియు సున్నం కలిపి సుడిళ్ళో వేసుకోవాలి.
- లింగాకర్షకు బుట్టలలో 3-4 మగ రెక్కల పురుగులు పడిన వెంటనే ఎకరానికి వారానికి ఒకసారి పురుగు ఉధృతిని బట్టి 50,000 చొప్పున ట్రైకోగ్రామా ప్రిటియోజమ్ లేదా టీలీనామస్‌రిమస్ గ్రుడ్డు పరాన్న జీవులను వదిలి పురుగు ఉధృతిని కొద్ది వరకు అరికట్టవచ్చును.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9963073087**

**టి.వి. ఛానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు**

| క్రమ సంఖ్య | తేది | అంశము | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|---|
| | | **I. డి.డి.- యాదగిరి (రైతు నేస్తం) : సాయంత్రం 6.00-7.00** | |
| 1 | 03.09.2025 | వానాకాలం వరి సాగులో అధిక దిగుబడులకు మేలైన యాజమాన్య పద్ధతులు | **డా॥ బి. సతీష్ చంద్ర,** సీనియర్ శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్) & హెడ్ వ్యవసాయ పరిశోధన స్థానం, కునారం, ఫోన్ నెం. 8333818202 / 9948990788 |
| 2 | 10.09.2025 | చెఱకులో అధిక దిగుబడికి సూచనలు | **డా॥ యం. విజయ్ కుమార్,** ప్రధాన శాస్త్రవేత్త (క్రాప్ ఫిజియాలజీ) వ్యవసాయ పరిశోధన స్థానం, బసంతపూర్ ఫోన్ నెం. 9849535756 |
| 3 | 15.09.2025 | ప్రస్తుతం వరి పంటలో చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలు | **శ్రీమతి ఎ. రాములమ్మ,** ఎస్.యం.ఎస్. (క్రాప్ ప్రోటక్షన్) కృషి విజ్ఞాన కేంద్రం, కంపాసాగర్, ఫోన్ నెం. 8317505717 |
| 4 | 22.09.2025 | ప్రత్తిని ఆశించే చీడపీడలు - వాటి నివారణ | **డా॥ కె. రాజశేఖర్,** సీనియర్ శాస్త్రవేత్త (ఎంటమాలజీ) & హెడ్ వ్యవసాయ పరిశోధన స్థానం, అదిలాబాద్, ఫోన్ నెం. 9908556659 |
| 5 | 29.09.2025 | ప్రస్తుత వానాకాలం కంది సాగులో మెళకువలు | **డా॥ సి. సుధాకర్,** ప్రధాన శాస్త్రవేత్త (అగ్రానమి) వ్యవసాయ పరిశోధన స్థానం, తాండుర్, ఫోన్ నెం. 9849626312 |
| | | **II. టి-శాట్ (రైతు మిత్ర - సోమవారం): సాయంత్రం 4.00-5.00** | |
| 1 | 01.09.2025 | ప్రత్తి పంటలో సస్యరక్షణ | **డా॥ జె. రాజేందర్,** శాస్త్రవేత్త (ప్లాంట్ పాథలజీ) ఇన్స్టిట్యూట్ ఆఫ్ బయోటెక్నాలజీ(ఐ.బి.టి.), రాజేంద్రనగర్ ఫోన్ నెం. 7013123589 |
| 2 | 08.09.2025 | కంది పంటలో తెగుళ్ళు - నివారణ | **డా॥ జి. పద్మజ,** శాస్త్రవేత్త (ప్లాంట్ పాథలజీ) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్, ఫోన్ నెం. 9032974787 |
| 3 | 15.09.2025 | వరిలో సస్యరక్షణ | **డా॥ యం. రాజశేఖర్,** అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఎంటమాలజీ) వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, ఫోన్ నెం. 8247421216 |
| 4 | 22.09.2025 | యాసంగి పంటల్లో విత్తన శుద్ధి | **డా॥ యం. శంకర్,** శాస్త్రవేత్త (ఎంటమాలజీ) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంపాలెం, ఫోన్ నెం. 9490992296 |
| 5 | 29.09.2025 | యాసంగిలో అపరాల సాగు యాజమాన్యం | **డా॥ ఎస్. సంధ్య కిషోర్,** సీనియర్ శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, జగిత్యాల, ఫోన్ నెం. 9948976575 |

# వానాకాలం ఆముదం పంటను ఆశించు చీడపీడలు - యాజమాన్యం

డా॥ వి. దివ్యారాణి, డా॥ యం. శంకర్, డా॥ యన్. నళిని, డా॥ కె. సదయ్య, డా॥ జి. ఈశ్వర్ రెడ్డి, జి. మాధురి,
డా॥ యస్. వాణిశ్రీ మరియు డా॥ యమ్. మల్లారెడ్డి
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం



ఆముదం పంట మెట్ట ప్రాంతాలలో సాగుచేసే పంటలలో ముఖ్యమైన వాణిజ్య పంట. సాగు విస్తీర్ణం ఉత్పత్తిలో భారతదేశం ప్రపంచంలో ప్రథమస్థానంలో ఉంది. ఈ పంట మనదేశంలో దాదాపు 13 రాష్ట్రాలలో సాగుచేస్తున్నారు. అయితే ఈ పంటను వానాకాలంలో సాగుచేసినప్పుడు అనేక రకాల చీడపీడలు ఆశించి దిగుబడులను తగ్గిస్తున్నాయి. ప్రస్తుతం జూన్ మరియు జూలై మాసంలో విత్తుకున్న ఆముదం పంటను ఆశించు పురుగులు - తెగుళ్ళు వాటి యాజమాన్యం గురించి తెలుసుకుందాం.

**ఆముదం పంటను ఆశించు తెగుళ్ళు:** వానాకాలం ఆముదంను ఆశించు తెగుళ్ళలో మొలకకుళ్ళు తెగులు, బూజు తెగులు మరియు ఎండుతెగులు ప్రధానమైనది.

**మొలకకుళ్ళు తెగులు:** ఈ తెగులు సాధారణంగా విత్తుకున్న 30-40 రోజులలోపు పంటను ఆశించి మొలకలు చనిపోయేలా చేస్తుంది. ఈ తెగులు ముఖ్యంగా విత్తనం నాటిన తరువాత నేలలో అధిక తేమ మరియు అధిక వర్షపాతం, మురుగునీటి పారుదల సౌకర్యం లేనప్పుడు ఎక్కువగా ఆశిస్తుంది. ఈ తెగులు సోకిన బీజదళాలపై గోధుమరంగు మచ్చలు ఏర్పడి మొలకకుళ్ళి పోతుంది. ముదురు ఆకులపై మచ్చలు పెద్దవిగా ఉంటాయి. క్రమేణా మొలక చనిపోవడం జరుగుతుంది.

**నివారణ:** తెగులు సోకిన వెంటనే మొలక చుట్టూ మొదళ్ళు తడిచే విధంగా 1 గ్రా. కార్బండాజిమ్ లేదా 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 2.5 గ్రా. మెటలాక్సిల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

**బూజుతెగులు:** ఈ తెగులు ప్రధానంగా వానాకాలం ఆముదంలో ఎక్కువగా ఆశిస్తుంది. తుఫాను ఉండి ఎడతెరిపి లేకుండా 5-6 రోజులు వర్షాలు కురుస్తూ వాతావరణంలో తేమ 90% ఉండి, రాత్రి ఉష్ణోగ్రతలు $20^0$ సెం.గ్రే లేదా తక్కువగా ఉన్నప్పుడు తెగులు ఆశించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. తెగులు సోకిన కాయలపైన ముందుగా గోధుమరంగు మచ్చలు ఏర్పడి తరువాత బూడిద వంటి శిలీంధ్రం పెరుగుతుంది. తరువాత శిలీంధ్రం కాయలోపలికి వ్యాపించి కాయలు మెత్తబడి, కుళ్ళిపోయి, రాలిపోవడం జరుగుతుంది. గోధుమరంగు మచ్చలు క్రమేణా గెల నుండి కాండం మీద కూడా వ్యాపించి ఆ భాగం మెత్తబడి విరిగి పోవడం జరుగుతుంది.

**నివారణ:**

- వరుసల మధ్య 90 సెం.మీ. లేదా 120 సెం.మీ., మొక్కల మధ్య 60 సెం.మీ. దూరం పాటించాలి. దీని ద్వారా గాలి వెలుతురు సరిగ్గా ప్రసరించి తెగులు వ్యాపించడం కొంతవరకు తగ్గించవచ్చు.
- తుఫాను సూచనలు వెలువడిన వెంటనే 1 లీటరు నీటికి 1 మి.లీ. ప్రొపికొనజోల్ కలిపి ఒకసారి గెలలు తడిచే విధంగా పిచికారి చేసుకోవాలి. అదేవిధంగా వర్షాలు వెలసిన తరువాత మరొక్కసారి పిచికారి చేసినట్లైతే తెగులు యొక్క వ్యాప్తిని దానివలన కలిగే నష్టాన్ని అరికట్టవచ్చు.
- అదేవిధంగా వర్షాలు తగ్గిన తరువాత ఎకరానికి 20 కిలోల యూరియా మరియు 10 కిలోల పొటాష్ వేయడం ద్వారా క్రొత్త గెలలు వచ్చే అవకాశం ఉంటుంది. దీని ద్వారా తెగులు వల్ల వచ్చే నష్టాన్ని తగ్గించవచ్చు.

**ఎండుతెగులు:** ఈ తెగులు నాటిన 20 రోజుల నుండి చివరి దశ వరకు పంటను ఆశిస్తుంది. తెగులు సాధారణంగా నేల ద్వారా వ్యాప్తి చెందుతుంది. తెగులు సోకిన ఆకులు పసుపు రంగుకు మారి గిడసబారిపోతాయి. తరువాత క్రమేణా మొక్క ఎండిపోవడం జరుగుతుంది. ఎండుతెగులు సోకిన మొక్క కాండంను చీల్చి చూస్తే లోపల నలుపురంగుకు మారి తెల్లని శిలీంధ్రం పెరుగుదలను గమనించవచ్చు.

**నివారణ:** విత్తనాన్ని నాటే ముందు కిలో విత్తనానికి 2 గ్రా. కార్బండాజిమ్ లేదా 10 గ్రా. ట్రైకోడెర్మా విరిడి అనే జీవ శిలీంధ్రనాశినిని కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి.

- అదేవిధంగా పంటను ఒకే నేలలో సాగుచేసినప్పుడు తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. దీని నివారణకు 2 కిలోల ట్రైకోడెర్మా పొడిని 100 కిలోల పశువుల ఎరువులో కలిపి 15 రోజులు మాగబెట్టి ఆఖరి దుక్కిలో చల్లుకోవాలి.
- తెగులు సోకిన మొక్కల మొదళ్ళు తడిచే విధంగా 1 గ్రా. కార్బండాజిమ్ లేదా 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్‌ని లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

## ఆముదం పంటను ఆశించు పురుగులు:

### దాసరి పురుగు / నామాల పురుగు:

- ఈ పురుగు ఆగష్టు నుండి అక్టోబర్ మాసం వరకు ఎక్కువగా పంటను ఆశిస్తుంది. మొక్కల అడుగుభాగాన చేరి పత్రహరితాన్ని గోకి తినడం వలన ఆకు మొత్తం ఈనెలుగా మిగిలిపోతుంది. లార్వాలు భూమిలో లేదా ఆకుల ముడతలో కోశస్థ దశలుగా మారిపోతాయి.

**నివారణ:** ఆగష్టు నుండి అక్టోబర్ మాసంలో ట్రైకోగ్రామా పరాన్న జీవులను ఎకరానికి 50,000 చొప్పున వదిలి పురుగును నియంత్రించవచ్చు.

- ఎకరానికి 8-10 పక్షిస్థావరాలు ఏర్పాటు చేయాలి. దీనివలన పక్షులు లార్వాలను తినివేస్తాయి.
- సహజ పరాన్న జీవులకు హాని చేయని అజాడిరక్టిన్ 1500 పిపియం 5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- పంటకోత తరువాత చెత్తను తగులబెట్టడం ద్వారా కోశస్థ దశలను నాశనం చేయవచ్చు.
- పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లేదా నొవాల్యురాన్ 1 మి.లీ. లేదా థయోడికార్బ్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయవలెను.

### పొగాకు లద్దె పురుగు:

- ఈ పురుగు ఉధృతి సెప్టెంబర్ నుండి నవంబర్ వరకు ఎక్కువగా ఉంటుంది. తొలిదశ లార్వాలు ఆకు అడుగుభాగాన చేరి గోకి తినడం వలన ఆకులు జల్లెడాకులుగా మారతాయి.

**నివారణ:**

- వేసవి లోతుదుక్కులు చేయడం ద్వారా కోశస్థదశలను నాశనం చేయవచ్చు.
- గ్రుడ్ల సముదాయాన్ని, పిల్లపురుగులు ఉన్న ఆకులు ఏరి నాశనం చేయాలి.
- ఎకరానికి 4-8 లింగాకర్షక బుట్టలను ఏర్పాటుచేసి రెక్కల పురుగుల ఉధృతిని గమనించాలి.
- మొదట దశ లార్వాలను నాశనం చేయుటకు అజాడిరక్టిన్ 1500 పిపియం 5 మి.లీ. లేదా క్లోరోపైరిపాస్ 2.5 మి.లీ. రెండవ దశ లార్వాలకు ప్రొఫెనోపాస్ 2 మి.లీ. లేదా నొవాల్యురాన్ 1 మి.లీ. లేదా థయోడికార్బ్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- ఎదిగిన లార్వాల నివారణకు విషపు ఎరను (5 కిలోల తవుడు + 1/2 కిలో బెల్లం 1500 మి.లీ. క్లోరిపైరిపాస్ కలిపి చిన్న ఉండలుగా చేయాలి). తయారు చేసుకొని సాయంత్రం వేళల్లో పొలంలో అక్కడక్కడ చల్లుకోవాలి.
- పురుగు ఉధృతి ఎక్కువైనప్పుడు ఫ్లూబెండమైడ్ 0.25 గ్రా. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**కొమ్మ మరియు కాయతొలుచు పురుగు:** మొగ్గ దశలో ఈ పురుగు ఉధృతిని గమనించవచ్చు. లార్వా కాయలను తొలిచి లోపల ఎదుగుతున్న గింజలను తినివేస్తాయి.

**నివారణ:** పురుగు నివారణకు పూతదశలో మరియు 20 రోజుల తరువాత 1.5 గ్రా. ఎసిఫేట్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

- పురుగు ఆశించినప్పుడు 2 మి.లీ. ప్రొఫెనోఫాస్ లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

**పచ్చదోమ:** తల్లి మరియు పిల్ల పురుగులు ఆకుల నుండి రసంపీల్చడం వలన పసుపు పచ్చగా మారి తరువాత ఆకులు మాడిపోతాయి.

**నివారణ:** అజాడిరక్టిన్ 1500 పిపియం 5 మి.లీ. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

- పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ప్రొఫెనోపాస్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9603012196**

# ప్రత్తి పంటలో వచ్చు పోషక లోపాలు – యాజమాన్యం

డా॥ ఇ. రజనీకాంత్, డా॥ జి. ఉషారాణి, డా॥ బి. హరిక్రిష్ణ, డా॥ కె. మదన్‌మోహన్ రెడ్డి, డా॥ ఇ. ఉమారాణి,
డా॥ రాజేంద్రప్రసాద్ మరియు డా॥ బి. రామ్‌ప్రసాద్

వ్యవసాయ పరిశోధన స్థానం, కరీంనగర్





తెలంగాణ రాష్ట్రం మనదేశంలో ప్రత్తి పండించే రాష్ట్రాల్లో ఒకటి. గత సంవత్సరం దాదాపుగా 20 లక్షల హెక్టార్లలో సాగు చేసి తెలంగాణ రాష్ట్రం విస్తీర్ణం మరియు ఉత్పత్తిలో మూడో స్థానంలో ఉంది. ఈ పంట తొలిదశలో పోషక లోపాలు ఏర్పడినప్పుడు సరైన యాజమాన్యం పాటించినట్లయితే అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

సాధారణంగా ప్రత్తిలో జింక్, మెగ్నీషియం మరియు బోరాన్ వంటి సూక్ష్మపోషకాల లోపం కనిపిస్తూ ఉంటుంది.

**జింక్ లోపం:** ఆకులు ఈనెలు ఆకు పచ్చగా ఉండి ఈనెల మధ్య భాగం పసుపు పచ్చగా మారుతుంది. ఆకులు చిన్నవిగా ముడతలు పడి మొక్క గిడసబారి పోతుంది. ఈ లోపం ఎక్కువ ఒకే పంట సాగు చేయడం, భాస్వరం ఎరువులు ఎక్కువగా వేయడం వలన మరియు చౌడు భూములలో ఎక్కువగా కనబడుతుంది. దీని నివారణకు 2 గ్రా. జింక్ సల్ఫేట్‌ను లీటరు నీటికి కలిపి 2 లేదా 3 సార్లు 5 రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి ఎకరాకు 20 కి. జింక్ సల్ఫేట్‌ను భూమిలో వేసి కలియదున్నాలి.

**మెగ్నీషియం లోపం:** ముదురు ఆకుల అంచులు పసుపు రంగుకు మారి ఈనెలు మాత్రం ఆకుపచ్చగా ఉండి తర్వాత ఆకులు ఎర్రబడి ఎండిపోతాయి. ఈ లోపం పొటాషియం అధిక మోతాదుల్లో ఉన్న నేలల్లో కనబడుతుంది. దీని నివారణకు 10 గ్రాముల మెగ్నీషియం సల్ఫేటును లీటర్ నీటికి కలిపి 2 సార్లు పది రోజుల వ్యవధిలో పైరుపై పిచికారి చేసుకోవాలి.

**బోరాన్ లోపం:** ఈ లోపం వల్ల “కాండం గిడసబారి కాండంపై పగుళ్ళు ఏర్పడతాయి, పూలు చిన్నగా మారి పూత మరియు పిందె రాలుతుంది. ఈ లోపం వర్షాభావ లేదా అధిక వర్షపాతం ఉన్నప్పుడు కనబడుతుంది. దీని నివారణకు 1.5 గ్రా. బోరాక్స్‌ను కలిపి ఒకటి లేదా రెండు సార్లు పది రోజుల వ్యవధిలో పిచికారి చేసుకోవాలి.

**పండాకు తెగులు:** ప్రత్తిలో ఆకులు ఎర్రబడడాన్ని పండాకు తెగులు అంటారు. ఈ సమస్య ఎక్కువగా బిటి ప్రత్తిలో అడుగు ఆకుల మీద కనబడుతుంది. మొదట ఆకులు గులాబి రంగుకు మారి తర్వాత ఎర్రబడి ఎండిపోతాయి.

ఈ సమస్య ఎక్కువ అధిక బెట్ట లేదా తేమకు గురైనప్పుడు మరియు మొక్క ఒత్తిడికి లోనైనపుడు కనబడుతుంది. దీని నివారణకు లీటరు నీటికి 10 గ్రా. మెగ్నీషియం సల్ఫేట్ మరియు 10 గ్రా. యూరియా లేదా డి.ఎ.పి కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేసుకోవాలి.

**పూత పిందె రాలడం:** ఈ సమస్య ఎక్కువగా మొక్క అధిక తేమగాని, బెట్టకు గాని, గురైనచో మొక్క హార్మోన్‌లలో మార్పు వచ్చి పూత పిందె రాలును. దీని నివారణకు 1 మి.లీ. ప్లానోఫిక్స్ (10 పి.పి.ఎమ్) ద్రావణాన్ని 5 లీటర్ల నీటిలో కలిపి 10–15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేసుకోవాలి. ఈ ప్రానోఫిక్స్ ద్రావణాన్ని విడిగా గాని, 20 గ్రా. యూరియా లేదా డి.ఎ.పి. కలిపి గాని పిచికారి చేసుకోవాలి. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ఈ పోషక లోపాలు వచ్చే అవకాశం ఉంది, కావున పైన తెలిపిన సవరణ చర్యలను సరైన సమయంలో చేపట్టి నష్టం కలగకుండా కాపాడుకోవాలని రైతు మిత్రులకు విన్నపం.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం. 9908698043

# ప్రత్తి పంటలో తలమాడు తెగులు యాజమాన్యం

డా॥ వి. రమ్య, డా॥ ఎస్. ఓం ప్రకాశ్, డా॥ జి. వీరన్న, డా॥ వి. వెంకన్న, డా॥ వై. ప్రశాంత్ మరియు డా॥ ఆర్. ఉమారెడ్డి

ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్





తెలంగాణ రాష్ట్రంలో ప్రత్తి పంటను సుమారు 43.3 లక్షల ఎకరాలలో సాగు చేయడం జరిగింది. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు ప్రత్తిలో తలమాడు తెగులు ఆశించడానికి మరియు వ్యాప్తికి చాలా అనుకూలంగా ఉన్నాయి. జూలై మరియు ఆగష్టు మాసాలలో కురిసిన వర్షాలకు కలుపు మొక్కల ఉధృతి పొలాల గట్ల మీద ఖాళీ స్థలాలలో ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా వయ్యారిభామ తుత్తురు బెండ, ఉత్తరేణి వంటి కలుపు మొక్కలు పూతదశలో ఉన్నప్పుడు బెట్ట వాతావరణం ఉన్నట్లైతే తామర పురుగుల ఉధృతి పెరిగి ప్రత్తి పంటలో తలమాడు తెగులు వచ్చే అవకాశం ఉంటుంది. ఈ తెగులు టొబాకో స్ట్రీక్ వైరస్ వలన కలుగుతుంది.

**తెగులు లక్షణాలు:** తెగులు సోకిన మొక్కల కొమ్మల చివరి లేత ఆకులు కొంతభాగం పొగాకు రంగుగా మారి ఆ భాగంలో ఆకుల పెరుగుదల ఆగిపోవడం వల్ల ఆకులు వంకర తిరిగినట్లు కుంచించుకుపోతాయి. తెగులు ఆశించిన మొక్క యొక్క లేత ఆకులు నల్లగా మారి మాడిపోతాయి. తెగులు చెట్టు మొత్తం వ్యాపించదు. వ్యాధి సోకిన కొమ్మలు మాత్రమే ఎండిపోతాయి. వాటిలో ఎదుగుదల ఆగిపోయి గిడసబారుతాయి. కొమ్మలకు ఉన్న పూమొగ్గలు ఎండిరాలిపోతాయి. శాఖీయ కొమ్మలపై ఉండే గూడలు వరుసగా మాడిపోయి రాలిపోతాయి.

**తెగులు వ్యాప్తి:** వయ్యారిభామ మొదలగు కలుపు మొక్కలలో ఈ వైరస్ నివాసం ఉన్నప్పటికీ బయటకు ఎలాంటి లక్షణాలు కనిపించవు. తామర పురుగు పూతకు వచ్చిన కలుపు మొక్కల మీద రసం పీల్చినప్పుడు వైరస్‌తో కూడిన పుప్పొడి రేణువులు తామర పురుగుల వివిధ భాగాలను అంటుకుంటాయి. మళ్ళీ తామర పురుగులు ప్రత్తి మొక్కలను ఆశించి ఆకులను గీకి రసం పీల్చేటప్పుడు, పుప్పొడి రేణువులో వైరస్ క్రిములు ప్రవేశించి తెగులును కలుగజేస్తాయి.

**నివారణ:**

తెగులు ఆశించడానికి కలుపు మొక్కలు మరియు తామర పురుగులు ప్రధాన కారకాలు. కాబట్టి రెండింటిని అరికట్టి పొలంలో మరియు గట్ల పైన కలుపు లేకుండా శుభ్రంగా ఉంచుకొని తామర పురుగు నివారణకు ఎకరానికి పది నీలిరంగు అట్టలను అమర్చుకోవాలి. వేపనూనె (1500 పిపియం) వంటి వృక్ష సంబంధ మందులను లీటరు నీటికి 5 మి.లీ. లేదా వేపగింజల కషాయం 5 శాతం పిచికారి చేసుకోవాలి. తామర పురుగుల ఉధృతి బట్టి నష్ట పరిమితి స్థాయి దాటినప్పుడు ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా ఫ్లోనికామిడ్ 0.3 గ్రా. లేదా డైఫెన్‌థయూరాన్ 1.25 గ్రా. లేదా సల్ఫక్సాఫ్లోర్ 0.75 గ్రా. లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు మందులను మార్చి మార్చి పిచికారి చేసుకోవాలి.

రైతులు తెగులును సకాలంలో గుర్తించి తగు నివారణ చర్యలు చేపట్టి పంట దిగుబడులను కాపాడుకోవాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9553951891

# సమగ్ర సస్యరక్షణ చర్యలతో మిరప సాగులో అధిక దిగుబడులు

డా॥ యస్. శ్రీనివాస్ నాయక్ మరియు డా॥ యస్. మాలతి

వ్యవసాయ కళాశాల, వరంగల్



మిరప వాణిజ్య పంట. ఈ పంటను ముఖ్యంగా ఎండు మిరపకాయల కోసం, సుగంధ ద్రవ్యంగాను మరియు "క్యాప్సైసిన్" అను ఆల్కలాయిడ్ ఉండటం వలన సుగంధ ద్రవ్యంగా (మసాల) కోసం, క్యాన్సర్ రహిత మందుల తయారీలో వాడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా మిరప పంటని 16.46 లక్షల హెక్టార్లలో, 49.10 లక్షల టన్నుల దిగుబడితో, 2.98 టన్నులు/హెక్టారు ఉత్పాదకతతో సాగుచేస్తున్నారు. మిరప సాగులో భారతదేశం ప్రథమ స్థానంలో ఉంది. 18.74 లక్షల టన్నుల దిగుబడితో - ముఖ్యంగా, దక్షిణాది రాష్ట్రాలు మిరప పంటను ఎక్కువ సాగు చేస్తున్నాయి. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రం రెండవ స్థానంలో ఉంది. మన రాష్ట్రం ముఖ్యంగా 1.13 లక్షల హెక్టార్లలో, 507 లక్షల టన్నుల ఉత్పత్తితో, హెక్టారుకు 4.5 టన్నుల ఉత్పాదకతతో సాగు చేస్తుంది. మన రాష్ట్రంలో ఖమ్మం, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల్‌లో ప్రధానంగా సాగు చేస్తున్నారు. మిరప పంటలో దిగుబడి తగ్గడానికి చీడపీడలు ప్రధాన కారణం. దాదాపు 57 రకాల పురుగులు మిరప పంటను ఆశించి నష్టపరుస్తున్నాయి, వీటిలో కీటకాలైన తామర పురుగులు, ఎర్రనల్లి ప్రధానమైనవి. తామర పురుగులు పై ముడతని, ఎర్రనల్లి క్రింది ముడతని కలిగిస్తాయి, తద్వారా ఆకులన్ని కూడా ముడతలు ముడతలుగా మారి పత్రహరిత శాతం తగ్గి ఉత్పాదకత తగ్గుతుంది. ఈ తామర పురుగులలో చూసుకుంటే 1935 నుండి కూడా పసుపురంగు, తామర పురుగు కొన ఆకులను ఆశించి రసాన్ని పీల్చి నష్టాన్ని కలుగజేస్తాయి. కాని 2015లో నల్లతామర పురుగు భారతదేశంలోకి ప్రవేశించి మిరపపంటను ప్రధానంగా పుష్పాలను ఆశించి పుప్పొడిని తిని నష్టాన్ని కలుగజేస్తున్నాయి. ఈ తామర పురుగులే కాకుండా ఎర్రనల్లి, తెల్లదోమ, కాయతొలుచు పురుగులు ఆశించి నష్టపరుస్తున్నాయి. మిరప పంటలో అధిక దిగుబడిని సాధించాలంటే ఈ కీటక పురుగులను సమర్థవంతంగా నివారించాలి. ఈ పంటలో ముఖ్యంగా రెండు రకాల దశలుంటాయి. రైతు సోదరులు ముఖ్యంగా నర్సరీలో విత్తనాలు విత్తుకొని తరువాత మిరప నారును ప్రధానంగా పొలంలో వేసుకోవడం జరుగుతుంది.

**ఆరోగ్యకరమైన నారు కోసం సస్యరక్షణ చర్యలు:**

మిరపనారు విత్తుకోవడానికి ముందు, నేలను మెత్తటి దుక్కి కొరకు 3-4 సార్లు దున్ని చదును చేసుకోవాలి. ఎకరానికి 10 టన్నుల పశువుల ఎరువు వేయాలి. ఒక మీటరు వెడల్పు, 15 సెం.మీ. ఎత్తు ఉండేటట్లు, నారుమడులు 30 సెం.మీ. కాలువలు తీయాలి. ఒక ఎకరం ప్రధాన పొలంకి ఒక సెంటు నారుమడి కావాలి. దీనికి 650 గ్రా. విత్తనం సరిపోతుంది. ఈ సెంటు నారుమడికి 1 కిలో వేపపిండి, అదేవిధంగా 10 కిలోల వానపాముల ఎరువు (వర్మీకంపోస్ట్)ను కలుపుకోవాలి. ఈ సెంటు నారుమడికి 80 గ్రా. ఫిప్రోనిల్ గుళికలను వాడినచో రసంపీల్చు పురుగులను నివారించుకోవచ్చును. రసంపీల్చు పురుగుల నివారణకు విత్తనాన్ని విత్తుకునే ముందు 8 గ్రా. ఇమిడాక్లోప్రిడ్‌ను, ఇతర తెగుళ్ళ నివారణకు 3 గ్రా. కాప్టాన్ లేదా 3 గ్రా. మ్యాంకోజెబ్‌ను కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి. విత్తన 9వ రోజు మరియు 13వ రోజు, 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను లీటరు నీటికి కలిపి నారుమడికి అంతటా కూడా రోజ్‌క్యాన్‌తో తడపాలి. తామర పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే ఫిప్రోనిల్ అను మందును 3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**ప్రధాన పొలంలో సమగ్ర సస్యరక్షణ చర్యలు:** ప్రధాన పొలంలో తామరపురుగులు, నల్లి, పేనుబంక, పూత పురుగులు, కాయతొలుచు పురుగులు ఆశించి నష్టపరుస్తాయి.

**తామర పురుగులు:** తామర పురుగుల నివారణకు బ్రోఫ్లానిలైడ్ 300 ఎస్‌సి 0.2 మి.లీ. లేదా సైయాంట్రానిలిప్రోల్ 10.26 ఒడి 1.2 మి.లీ. లేదా ఫ్రిప్రోనిల్ 5 ఎస్‌పి 2 మి.లీ. లేదా ఫ్లక్సామెటమైడ్ 10% ఈసి 0.8 మి.లీ. లేదా స్పైనోటోరమ్ 11.7 ఎస్‌సి 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసి నివారించుకోవచ్చును.

**నల్లి:** ఈ నల్లి నివారణకు లీటరు నీటికి క్లోర్‌ఫెన్‌పైర్ 10 ఎస్‌సి 2 మి.లీ. లేదా సైనోపైరాఫెన్ 30 2 మి.లీ. లేదా డయాఫెంథ యురాన్ 50 డబ్ల్యుపి 1.2 గ్రా. లేదా ఫెనాజాక్విన్ 10 ఇసి 2.5 మి.లీ. లేదా ఫెన్‌పైరాక్సిమేట్ 5 ఇసి 1.2 మి.లీ. లేదా స్పైరోమెసిఫెన్ 22.90 ఎస్‌సి 1 మి.లీ. రసాయనిక మందులను మార్చి మార్చి పిచికారి చేసి నివారించుకోవచ్చును.

**పేనుబంక:** ఈ పేనుబంక నివారణకు ఫ్లోనికామిడ్ 50 డబ్ల్యుజి 0.4 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 70 డబ్ల్యుఎస్ 0.7 గ్రా. లీటరు లేదా టోల్‌ఫెన్‌పైరాడ్ 15 ఇసి 2 మి.లీ. లేదా ఎసిఫేట్ 50 + ఇమిడాక్లోప్రిడ్ 1.8 ఎస్‌పి 2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేసి నివారించుకోవచ్చును.

**పూత పురుగులు:** ఈ పూత పురుగుల నివారణకు ఎసిటామిప్రిడ్ 20 ఎస్‌పి 0.2 గ్రా. లేదా డింప్రోపైరిడాజ్ 120 ఎస్‌ఎల్ 2 మి.లీ. లేదా పైరిప్రాక్సిఫెన్ 10 ఇసి 1.7 మి.లీ. లీటరు లేదా పైరిప్రాక్సిఫెన్ + డయాఫెంథయురాన్ 25% ఎస్ఇ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసి నివారించుకోవచ్చును.

**కాయతొలుచు పురుగులు:** ఈ పురుగులలో ముఖ్యంగా పొగాకు లద్దెపురుగు, శనగపచ్చ పురుగు, పచ్చరబ్బరు పురుగులు మిరపని ఆశించి నష్టపరుస్తాయి. ఈ పురుగుల నివారణకు స్పైనోశాడ్ 45 ఎస్‌సి 0.32 మి.లీ. లీటరు లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 5.2% + నొవాల్యురాన్ 8.5 ఎస్‌సి 1 మి.లీ. లేదా ఫ్లూబెండమైడ్ 39.35 ఎస్‌సి 0.25 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసి నివారించుకోవచ్చును.

**తెగుళ్ళు:**

**నారుకుళ్ళు తెగులు:** నివారణకు 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను ఒక లీటరు నీటిలో కలిపి తడుపుకోవాలి. ఎత్తయిన నారుమడుల్లో నారును పెంచాలి.

బ్యాక్టీరియా ఆకుమచ్చ తెగులు: నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రా. + 1 గ్రా. స్ట్రెప్టోసైక్లిన్ 10 లీ. నీటిలో కలిపి పిచికారి చేయాలి.

**సెర్కోస్పోర ఆకుమచ్చ తెగులు:** నివారణకు మ్యాంకోజెబ్ 50 గ్రా. కార్బండాజిమ్ 200 గ్రా. పిచికారి చేయాలి.

**కొమ్మకుళ్ళు తెగులు:** నివారణకు 30 గ్రా. ప్రొపికొనజోల్ + 1 గ్రా. స్ట్రెప్టోసైక్లిన్‌ను 10 లీ. నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి.

**కొమ్మ ఎండు మరియు కాయకుళ్ళు తెగులు:** నివారణకు ప్రొపికొనజోల్ 200 మి.లీ. లేదా డైఫెన్‌కొనజోల్ 100 మి.లీ. పూత సమయంలో, కాయలు పండు బారే సమయంలో పిచికారి చేయాలి. కాయకుళ్ళు తెగులు సోకిన మొక్కల నుండి సేకరించరాదు.

**మొక్కల ఎండుతెగులు:** నివారణకు లీటరు నీటికి 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ ద్రావణంలో వడలిపోయిన చెట్ల మొదళ్ళు వడలిపోయిన చెట్ల చుట్టూ ప్రక్కల మొదళ్ల తడిపి, నత్రజని మరియు నీటి తడులు తగ్గించాలి.

**వైరస్ తెగులు:** మొక్కలు గిడసబారి, ఆకులు చిన్నవిగా తయారయి, కుచ్చులుగా మారి, పండు బారుతాయి. పూత, పిందె ఆగిపోతుంది. పీనట్ బడ్-నెక్రోసిస్ వైరస్ ఆశించడం వలన మొవ్వు మొదలు భాగం కుళ్ళి ఎండిపోతుంది. విచక్షణ రహితంగా పురుగుమందులను వాడకూడదు. విత్తనాన్ని లీటరు నీటికి 150 గ్రా. ట్రైసోడియం ఆర్థోఫాస్ఫేటుతో విత్తనశుద్ధి చేయాలి. చేను చుట్టూ జొన్న, మొక్కజొన్న మొదలయిన ఎత్తైన పైరులు పెంచాలి. వైరస్ సోకిన మొక్కలను పీకి నాశనం చేయాలి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 8778857772**

**టి.వి. ఛానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు**

| క్రమ సంఖ్య | తేది | అంశము | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|---|
| | | III. టి-శాట్ - (శనివారం): సాయంత్రం 4.00-5.00 | |
| 1 | 06.09.2025 | మొక్కజొన్న సాగులో సస్యరక్షణ | **డా॥ బి. మల్లయ్య,** ప్రధాన శాస్త్రవేత్త (పాథాలజీ) మొక్కజొన్న పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, ఫోన్ నెం. 9440504167 |
| 2 | 20.09.2025 | కుసుమ పంటలో మేలైన రకాలు మరియు యాజమాన్య పద్ధతులు | **డా॥ టి. రాజేశ్వర రెడ్డి,** శాస్త్రవేత్త (ప్లాంట్ పాథలజీ) తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, తాండూర్, ఫోన్ నెం. 9390898305 |
| 3 | 27.09.2025 | రైతు నేస్తం - ప్రత్యక్ష వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం | **డా॥ యం. శ్రీనివాసులు,** కో-ఆర్డినేటర్ ఎలక్ట్రానిక్ వింగ్, పి.జె.టి.ఎ.యు., రాజేంద్రనగర్, ఫోన్ నెం.: 8333818238 |




# ఆగాకర సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు

డా॥ బి. సంతోష్, డా॥ బి.ఎస్.కె. నిఖిల్, డా॥ డి. అనిత కుమారి,
డా॥ ఆర్. ప్రీతమ్ గౌడ్, డా॥ వి. సురేష్ మరియు భాగ్యశాలి హెగ్డే
కూరగాయల పరిశోధన స్థానం, రాజేంద్రనగర్

ఆగాకర, దోస కుటుంబానికి చెందిన బహువార్షిక కూరగాయ పంట. మనం ఒకసారి నాటితే 5-6 సంవత్సరాల వరకు పంటను తీసుకోవచ్చు. దీనిని బోడ కాకర, బొంత కాకర, అడవి కాకర మరియు పిచ్చికాకర అని పిలుస్తారు. తెలంగాణలోని ఉమ్మడి ఖమ్మం, మహబూబ్-నగర్, ఆదిలాబాద్, కరీంనగర్ మరియు నిజామాబాద్ జిల్లాల్లోని అటవీ ప్రాంతాలు, ఎత్తైన కొండ ప్రాంతాలు దీని సాగుకు అనువైనవి. దీనిలో 'బి గ్రూపుకు చెందిన విటమిన్లు (థయామిన్, రైబోఫ్లావిన్, నియాసిన్), పీచుపదార్థం, కెరోటిన్ మరియు ప్రోటీన్లు ఎక్కువగా ఉంటాయి. అందువల్ల మధుమేహ వ్యాధి నివారణకు, మలబద్ధక నివారణకు, కంటిచూపు పెంపొందించుటకు, చురుకుదనానికి ఎక్కువగా వాడుకలో ఉన్నది. అంతేకాక చర్మ వ్యాధి, దగ్గు, ఆయాసం వంటి శ్వాస వ్యాధులకు, కడుపులో అల్సర్లకు, పైల్సుకు, కామెర్లు లాంటి కాలేయ, పిత్తాశయ మరియు మూత్ర సంబంధ రోగాలకు కూడా ఉపయోగిస్తారు. రక్తవృద్ధికి తోడ్పడుతుంది. బోడకాకర వేరు దుంపలను జీర్ణ మూత్ర వ్యవస్థ సంబంధిత రోగాల నివారణ కోసం వాడుతారు.

దీని కాయలు 2-10 సెం.మీ. పొడవు, 3-5 సెం.మీ. వెడల్పు, 20-80 గ్రా. బరువు కలిగి ఉంటాయి. మెత్తని ముళ్ళు కాయ నిండా ఉండి, ఆకుపచ్చ రంగులో ఉంటాయి. పండిన కాయలు నారింజ పసుపు వర్ణంగా మారుతాయి. గింజలపై గుజ్జు ఎర్రగా మారుతుంది. పూలు పసుపు లేదా తెలుపు వర్ణంలో ఉంటాయి. లేత కాయలను కూరగాయగా వాడుతారు. పండిన కాయలు కూరకు పనికిరావు.

## రకాలు

- **ఆర్కా భరత్:** అధిక దిగుబడినిచ్చే రకం, ఇది రైతుల ఆదాయాన్ని పెంచుతుంది. కాయలు 8-10 సెం.మీ. పొడవు కలిగి ఉంటాయి. ఇది ఐఐహెచ్ఆర్, బెంగుళూరు నుండి విడుదల అయ్యింది.
- కాశిగౌతమ్, కాశి హరితిక రకాలు ఐఐవిఆర్, వారణాసి నుండి విడుదల అయ్యాయి.
- **నీలంచల్ శ్రీ:** దీనిని ఒడిశాలోని భువనేశ్వర్ (ఐఐహెచ్ఆర్) విడుదల చేసారు. దీని పండ్లు గుండ్రంగా మరియు లేత ఆకుపచ్చ రంగులో ఉంటాయి.
- తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలలో స్థానిక రకాలను సాగు చేస్తున్నారు.

**వాతావరణం:** అధిక వర్షపాతం, మధ్యస్థ వేడి, అధిక తేమతో కూడిన వాతావరణం దీని సాగుకు మిక్కిలి అనుకూలం.

**నేలలు:** ఎర్ర నేలలు, సారవంతమైన ఇసుక నేలలు అనుకూలం. కొండల మీది కొద్దిపాటి లోతుగల రాళ్ళతో కూడిన ఎర్ర నేలల్లో కూడా సాగుచేయవచ్చు. మధ్యస్థ లోతు కలిగిన నేలలు దుంప పెరుగుదలకు అనుకూలం. నల్ల నేలలు, గరప నేలల్లో కూడా సాగు చేసుకోవచ్చు.

**పొలం తయారీ:** మెత్తటి దుక్కిని తయారు చేసుకొని వరుసల మధ్య 1.5 మీ. దూరం, వరుసలో మొక్కల మధ్య 1 మీ. దూరంతో వేసవి ప్రారంభంలో గుంతలు తీసి గడ్డలను నాటుకోవాలి.

## ప్రవర్ధనం

1. **దుంపల ద్వారా:** బోడ కాకర మొక్క తీగలు జూన్ నుండి అక్టోబరు వరకు ఉంటాయి. ఆ తర్వాత తీగలు చనిపోయి, భూమిలోని దుంపలు నిద్రావస్థలో ఉంటాయి. కనుక జూన్ నుండి అక్టోబరు మధ్య ఎక్కువగా పూసే ఆడ మొక్కలను ఎంచుకోవాలి. వీటి దుంపలను సేకరించి విత్తన దుంపలుగా మరునటి సంవత్సరం నాటుకోవచ్చు. 2-3 సంవత్సరములలో వీటికి వచ్చే పిల్ల దుంపలను కూడా విత్తనంగా వాడవచ్చు.

**2. విత్తనం ద్వారా:** విత్తనం మొలక 30 శాతంగా ఉంటుంది. విత్తటానికి కనీసం 24 గంటలు ముందు నీటిలో నానబెట్టి విత్తుకోవాలి. అందులో మరల ఆడ, మగ మొక్కలు ఉంటాయి. ఎకరాకు 1.5×1 మీ. దూరంలో నాటుటకు 900 ఆడ మొక్కలు మరియు 100 మగ మొక్కలు అవసరం అవుతాయి. నారుమడిని 4×1 మీ. సైజులో 15 సెం.మీ. ఎత్తులో తయారు చేయాలి. 15 సెం.మీ. వరుసల మధ్య 10 సెం. దూరంలో విత్తనాలు విత్తాలి. వీటిపై గడ్డి వేసి పెట్టాలి. 35-45 రోజులలో మొలకలు వస్తాయి. మార్చి నెలాఖరు నుండి మే మొదటి పక్షం వరకు నారుమడి వేస్తే, జూన్‌లో నాటుటకు తయారవుతాయి.

**నాటుట:** దుంపలు లేదా విత్తనం మొక్కలను 30×30×30 సెం.మీ. కొలతలు కలిగి పశువుల ఎరువుతో నింపిన గుంతలలో నాటుకోవాలి. నేరుగా గుంతలలో విత్తనాలు నాటుకోవాలంటే ప్రతి గుంతకు 10-15 విత్తనాలు వేస్తే 3-5 మొలకలు 35-45 రోజులలో వస్తాయి. పూతకు వచ్చిన తర్వాత ఆడ, మగ మొక్కలను గుర్తించి ఆ తర్వాత ఆడ : మగ మొక్కలను 10:1 నిష్పత్తిలో నాటుకోవాలి

**ఎరువులు:** ఎకరానికి 8-10 టన్నుల ఎరువును, 32-40 కిలోల భాస్వరం, 16-20 కిలోల పొటాష్‌ను వాడాలి. 40 కిలోల నత్రజనిని 3 సమభాగాలుగా నాటిన 15,30,45 రోజులలో అన్ని మొక్కలకు సమంగా ఇవ్వాలి.

**అంతర కృషి:** భూమికి 4-6 అడుగుల ఎత్తులో కొబ్బరి తాడు/జిఐ వైరులతో పందిరి ఏర్పరచుకోవాలి. ఎప్పటికప్పుడు తీగలను వాటి మీదకు పాకించాలి. పందిరి మీద తీగలను ప్రాకిస్తే గాలి, సూర్యరశ్మి సమానంగా తగిలి అధిక దిగుబడులు, పురుగుల బెడద తగ్గి నాణ్యమైన దిగుబడులు వస్తాయి.

కలుపు లేకుండా మొక్కల పళ్ళాలు 0.5 మీ. పరిమాణంలో శుభ్రంగా వుంచుకోవాలి. 7-10 రోజుల వ్యవధిలో నీరు పెట్టాలి. పూత సమయంలో పిందె పెరిగేటప్పుడు నీటి ఎద్దడి లేకుండా చూసుకున్నట్లయితే అధిక దిగుబడులు వస్తాయి.

**సస్యరక్షణ:** పేనుబంక, తామర పురుగులు, పాముపొడ, ఆకు తినే పురుగు, కాయతొలిచే పురుగు మరియు పండు ఈగ ఈ పంటను ఆశించి నష్ట పరుస్తాయి. రసం పీల్చే పురుగుల నివారణకు ఫిప్రోనిల్ 5% ఎస్‌సి (2 మి.లీ.) పిచికారి చేయాలి. పాముపొడ తెగులు నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ (0.4 గ్రా.లీ.) లేదా ఇమిడాక్లోప్రిడ్ (0.3 మి.లీ.) ఇగుర్లు వచ్చే దశలోనే 10 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచ్చికారి చేయాలి. ఆకులు, కాయలు తొలిచే పురుగుల నివారణకు థయోడికార్బ్ (0.5 గ్రా.లీ.) లేదా బ్యాక్టీరియా సబంధిత పురుగు మందులు (2 గ్రా.లీ.) చల్లి సమర్థవంతంగా నివారించవచ్చు.

పండు ఈగ నివారణకు ఎకరానికి 4-6 మిథైల్ యూజినాల్ ఎరలు ఏర్పాటు చేసుకొని పండు ఈగని సమర్థవంతంగా నివారించవచ్చు.

**కాయ కోత-దిగుబడి:** ఆగష్టు నుండి అక్టోబరు చివరి దాకా కాయలువస్తాయి. ఆపై తీగలు ఎండిపోతాయి. మరల మరుసటి సంవత్సరం తొలకరికి దుంపలు చిగురిస్తాయి. వారానికి రెండు సార్లు కోత వస్తుంది. ప్రతి కోతకు 40 కిలోల కాయలు వస్తాయి (8-10 క్వి./ఎకరాకు). అధిక దిగుబడికి మొదటగా బ్రష్‌తో మగ పూల నుండి పుప్పొడి సేకరించి ఉదయం వేళలో ఆడ పూలపై అద్దాలి. కాయలు కోసేటప్పుడు తీగలు తెగిపోకుండా జాగ్రత్తగా కోయాలి. కాపు అనంతరం నవంబరు నుండి నీరు పెట్టరాదు. నిద్రావస్థలో ఉంచాలి. మరల మే నుండి మొలకలు వస్తాయి.

**మార్కెటింగ్:** వెదురు బుట్టల్లో అడుగున ఎండు గడ్డిని పరిచి, తర్వాత కాయలను నింపి, ఆ పైన తడిగోనె సంచితో కప్పి ప్యాకింగ్ చేసినట్లైతే దూర ప్రాంత రవాణా చేసుకోవచ్చు.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 7893102170**

**ఆగష్టు 2025 మాసంలో పి.జె.టి.ఏ.యు. వారి అగ్రికల్చర్ వీడియో యూట్యూబ్ ఛానల్‌లో అప్‌లోడ్ చేసిన నూతన షార్ట్స్**

| క.సం. | తేది | అంశం |
|---|---|---|
| 1 | 13.08.2025 | అధిక వర్షాలు మొక్కజొన్న సాగులో సూచనలు |
| 2 | 20.08.2025 | మొక్కజొన్నలో బ్యాక్టీరియా కాండం కుళ్ళు తెగులు - నివారణ |



# వ్యవసాయ మార్కెట్ ఇంటలిజెన్స్

డా॥ ఆర్. విజయ కుమారి, జి. రామకృష్ణ, పి. వెంకటేష్ మరియు ఏ. శ్రీనివాస్
వ్యవసాయ ఆర్థిక శాస్త్ర విభాగం, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, హైదరాబాద్

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వ్యవసాయ ఆర్థిక శాస్త్ర విభాగం, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్‌లో వ్యవసాయ మార్కెట్ ఇంటలిజెన్స్ కేంద్రంను ఒక పరిశోధన పథకంగా వ్యవసాయ పంటల ముందస్తు ధరలను అంచనా వేయుటకు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ వారి ఆర్థిక సహాయంతో స్థాపించడం జరిగింది. ఈ కేంద్రం 2025-26 సంవత్సరం వానాకాలం (ఖరీఫ్)లో సాగు చేసి వివిధ రకాల పంటల ముందస్తు ధరలను పంటకోత సమయంలో ఏ విధంగా ఉండునో అంచనా వేయడం జరిగింది. ఈ ముందస్తు ధరలను అంచనా వేయుటకు రాష్ట్ర ప్రధాన మార్కెట్లలోని 7 నుండి 23 సంవత్సరాల నెలవారీ మోడల్ ధరలను తీసుకొని విశ్లేషణ చేయడం జరిగింది. ఈ విశ్లేషణ ఫలితాలు మరియు మార్కెట్ సర్వేలను అనుసరించి 2025-26 వానాకాలం (ఖరీఫ్) పంటకోత సమయంలో ధర ఏ విధంగా ఉండునో అంచనా వేయడం జరిగింది. దానిని అనుసరించి:

**వానాకాలం (ఖరీఫ్) పంట కోత సమయంలో వివిధ పంటల అంచనా ధరలు**

| క్ర.సం | పంటలు | ప్రధాన మార్కెట్ | అంచనా ధరలు వర్తించు సమయం | అంచనా ధరలు (రూ./క్వి). |
|---|---|---|---|---|
| 1. | జొన్న | మహబూబ్‌నగర్ | సెప్టెంబర్-అక్టోబర్ | 1950-2250 |
| 2. | సజ్జ | నిజామాబాద్ | సెప్టెంబర్-అక్టోబర్ | 2210-2520 |
| 3. | పెసర | సూర్యాపేట్ | సెప్టెంబర్-అక్టోబర్ | 6700-6900 |
| 4. | మినుములు | తాండూర్ | సెప్టెంబర్-అక్టోబర్ | 7390-7810 |
| 5. | సోయాచిక్కుడు | నిజామాబాద్ | సెప్టెంబర్-అక్టోబర్ | 4350-4650 |
| 6. | టమాటా | బోయినపల్లి | సెప్టెంబర్-అక్టోబర్ | 1500-1800 |
| 7. | వంకాయ | బోయినపల్లి | సెప్టెంబర్-అక్టోబర్ | 1590-1910 |
| 8. | బెండ | బోయినపల్లి | సెప్టెంబర్-అక్టోబర్ | 1600-1800 |

ముందస్తు ధరల గురించిన సమాచారం కోసం దిగువ ఇవ్వబడిన ఫోన్ నెంబర్లని సంప్రదించగలరు.
మొబైల్ నెం. : 9948780355, 9154828514, ఈ మెయిల్ : amic.pjtsau@gmail.com
వెబ్ సైట్ : https://pjtau.edu.in/agri-marketing-intelligence.html

**గమనిక :** గత 20 సంవత్సరాల ధరలను విశ్లేషించి పైన తెలిపిన ధరలను వివిధ పంటల ముఖ్య మార్కెట్లలో అంచనా వేయడం జరిగింది. పంట రకము, నాణ్యత, అంతర్జాతీయ ధరలు, ఎగుమతి లేదా దిగుమతి పరిమితుల మూలంగా అంచనా ధరలలో మార్పు ఉండవచ్చును, కావున భవిష్యత్‌లో పంటల ధరల మార్పునకు ఈ కేంద్రం ఏ విధమైన బాధ్యత వహించదు.

# వ్యవసాయ విశ్వవిద్యాలయ 55వ స్నాతకోత్సవం









ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం 55వ స్నాతకోత్సవం 02.08.2025న రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి గౌ॥ శ్రీ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ 1965లో నాటి ప్రధానమంత్రి లాల్ బహుదూర్ శాస్త్రి జాతికి అంకితం చేసిన ఈ వ్యవసాయ విశ్వవిద్యాలయం బహుముఖాలుగా విస్తరించడం చాలా గర్వకారణమని, వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లకు దీటుగా పనిచేస్తూ వ్యవసాయ విశ్వవిద్యాలయం తన ప్రయాణాన్ని సాగిస్తుందని, దేశంలోనే తొలిసారిగా ఈ మధ్యనే పిజెటిఏయు, సెంటర్ ఫర్ డిజిటల్ అగ్రికల్చర్ ఏర్పాటు చేయడం అభినందనీయం అని, అదేవిధంగా స్మార్ట్, డిజిటల్ వ్యవసాయాల పరిశోధనలకు పెద్ద పీట వేస్తూ ఎస్‌బిఐ ఫౌండేషన్ సహకారంతో అరిసా లాబ్‌ని ఏర్పాటు చేయడం జరిగింది. భవిష్యత్తులో విశ్వవిద్యాలయం దేశంలో తొలి పది స్థానాల్లో నిలవనుందని, ఈ మధ్య నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు', 'ప్రతి గ్రామానికి నాణ్యమైన విత్తనాలు' కార్యక్రమాల వల్ల రైతాంగానికి చాలా మేలు జరిగిందని అన్నారు. వాతావరణ మార్పులు, మార్కెటింగ్ తదితర సవాళ్లకు అనుగుణంగా శాస్త్రవేత్తలు కొత్త పరిష్కారాలు చూపించాలని, యువతకి, మహిళలకి ఉపాధి కల్పించడంతోపాటు పేదరికం రూపుమాపి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో వ్యవసాయానికి ప్రధాన పాత్ర అని యువ పట్టభద్రులు రైతులకు నిరంతర సేవలందిస్తూ వారి సాగుని లాభసాటిగా చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చరల్ రీసెర్చ్ డైరెక్టర్ జనరల్ మరియు డిపార్ట్మెంట్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ కార్యదర్శి డా॥ మంగీలాల్ జాట్ ముఖ్య అతిథిగా విచ్చేసి స్నాతకోత్సవ ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో చదివిన ఎందరో వ్యక్తులు నేడు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ స్థానాల్లో ఉండి దేశానికి, రైతాంగానికి సేవలు అందిస్తున్నారని, ఒకనాడు ఆహార కొరత ఎదుర్కొన్న దేశం నేడు ఆహార ధాన్యాల మిగులు స్థాయికి చేరుకుందని, దీనికి శాస్త్ర విజ్ఞానం, ప్రభుత్వాల విధానాలు, రైతుల నిరంతర శ్రమలే దోహదం చేశాయన్నారు. నేడు తెలంగాణ వరి ఉత్పత్తిలో దేశంలోనే ప్రథమ స్థానంలో నిల్చిందన్నారు. భూగర్భజలాల క్షీణత, భూసార క్షీణత, పర్యావరణ విధ్వంసం, పర్యావరణ మార్పులు వంటి సవాళ్లను నేడు మనం ఎదుర్కొంటున్నామని, ఈ సవాళ్లను సమర్థంగా ఎదుర్కొని 2047 నాటికి "వికసిత్ భారత్" గా రూపాంతరం చెందటానికి అందరూ కృషి చేయాలని, స్థానిక పంటలను, తృణధాన్యాల పంటలను విరివిగా ప్రోత్సహించాలని, కొత్త కొత్త అంశాల్లో పరిశోధనలు చేపట్టాలని, వ్యవసాయ రంగంలో డేటాని సమర్థంగా

వినియోగించుకోవాలని, సహజ సేంద్రియ వ్యవసాయ, అంతరపంటల సాగులపై దృష్టి పెట్టాలని సూచించారు. నూతన నైపుణ్యాల్ని ఉపయోగించుకోవాలని, పరిశోధనల్ని రైతుల ముంగిటకు సాధ్యమైనంత త్వరగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో అధునాతన నైపుణ్యాలు, బోధనలకి పెద్దపీట వేయాలని, మానవ వనరుల యాజమాన్యాన్ని సమర్థవంతంగా చేపట్టాలని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా సంస్థల్లో అవసరమైన సంస్కరణలు చేపట్టి సంస్థలన్ని పూర్తి సమన్వయంతో పనిచేయాలని, వ్యవసాయ పరిశోధనల్లో పెట్టుబడులు మరింత పెరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.



విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్య వార్షిక నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశ్వవిద్యాలయం వివిధ పంటల్లో విడుదల చేసిన వంగడాలు జాతీయస్థాయిలో ఆదరణ పొందుతున్నాయని, బోధన, పరిశోధన, విస్తరణల్లో విశ్వవిద్యాలయం బహుముఖ ప్రతిభ కనబరుస్తుందని, దేశ, విదేశాలకు చెందిన అనేక ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని, అగ్రి హబ్, ఇతర ల్యాబ్‌లను విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేశామని తెలిపారు. విశ్వవిద్యాలయ కులపతి శ్రీ జిష్ణుదేవ్ వర్మ, గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గార్ల తోడ్పాటుతో విశ్వవిద్యాలయాన్ని అత్యున్నత స్థాయికి తీసుకెళ్లడానికి కృషి చేస్తున్నామని వివరించారు.



ఈ సందర్భంగా 2021- 2022 మధ్య ఉత్తీర్ణులైన 844 మంది యుజి, పిజి, పిహెచ్‌డి విద్యార్థులకి విశ్వవిద్యాలయ కులపతి, రాష్ట్ర గవర్నర్ శ్రీ జిష్ణుదేవ్ వర్మ అధ్యక్షతన జరిగిన ఈ స్నాతకోత్సవంలో పట్టాలు ప్రధానం చేశారు. అదేవిధంగా అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన 20 మంది విద్యార్థులకు 30 బంగారు పతకాలు అందచేయడం జరిగింది. కంది అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థిని జి. భార్గవి బీటెక్ (అగ్రికల్చరల్ ఇంజనీరింగ్)లో అత్యధిక గ్రేడ్ పాయింట్ సాధించినందుకు 6 బంగారు పతకాలు, వరంగల్ వ్యవసాయ కళాశాలకు చెందిన విద్యార్థిని అర్షియా తబస్యుమ్ బీఎస్‌సి(ఆనర్స్) అగ్రికల్చర్‌లో అత్యధిక గ్రేడ్ పాయింట్ సాధించినందుకు నాలుగు బంగారు పతకాలు పొందడం జరిగింది. ఈ స్నాతకోత్సవంలో రిజిస్ట్రార్ డా॥ జి.ఇ.సి.హెచ్. విద్యాసాగర్, విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యులు, విశ్వవిద్యాలయ అధికారులు, పూర్వ ఉపకులపతులు, రిజిస్ట్రార్ లు, ఐసిఏఆర్ సంస్థల ప్రతినిధులు, అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.





# వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీసీ సెల్ ఏర్పాటు






ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలనా భవనం, రాజేంద్రనగర్‌లో బీసీ సెల్ ను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి గౌ॥ శ్రీ పొన్నం ప్రభాకర్ 08.08.25న ప్రారంభించారు. రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్, గౌ॥ శ్రీ జి. నిరంజన్, రాజేంద్రనగర్ శాసనసభ్యులు గౌ॥ శ్రీ టి. ప్రకాష్ గౌడ్, విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్య సమక్షంలో బీసీ సెల్ ఆఫీసర్ ఇన్ ఇన్‌ఛార్జ్‌గా నియమితులైన డా॥ సిహెచ్. దామోదర రాజుని గౌ॥ పొన్నం ప్రభాకర్ లాంచనంగా కుర్చీలో కూర్చుండబెట్టడం జరిగింది. బీసీ సెల్ ని ప్రారంభించిన అనంతరం రాజేంద్రనగర్ కళాశాలకి అనుబంధంగా ఉన్న అకాడమిక్ బ్లాక్ లోని సెమినార్ హాల్‌ని గౌ॥ పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో బీసీ సెల్ ఏర్పాటు చేయడం చాలా అభినందనీయమని, ఇదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ అన్ని శాఖలు, విద్యాసంస్థల్లో బీసీ సెల్ లను ఏర్పాటు చేయాలని సూచించారు. బీసీ రిజర్వేషన్ కోసం ముఖ్యమంత్రి గౌ॥ రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలోని తమ ప్రభుత్వం అన్ని స్థాయిల్లోనూ అలుపెరుగని పోరాటం చేస్తుందని, అందరి ఉజ్వల భవిష్యత్తు కోసం తాము చేస్తున్న ఈ పోరాటానికి ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని, కొంతమంది స్వార్థం కోసం ఈ ప్రక్రియను అడ్డుకోవద్దని, ఈ రిజర్వేషన్ వల్ల విద్యార్థులు, ఉద్యోగులకి చాలా ప్రయోజనం జరుగుతుందన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులకు కొత్త వంగడాలు, పరిజ్ఞానం, సాంకేతికతను అందించడానికి శాస్త్రవేత్తలు కృషి చేయాలని, తమ ప్రభుత్వానికి వ్యవసాయం ప్రాధాన్యత అంశమని, రాష్ట్రమంత్రి వర్గం అంతా వచ్చి విశ్వవిద్యాలయం వేదికగా రైతు భరోసా నిధులు విడుదల చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వ్యవసాయ కళాశాలలు, పరిశోధన స్థానాలకు వెళ్లేందుకు రైతులు, విద్యార్థులకు అవసరమైన రవాణా ఏర్పాటు చేస్తామని, విద్యార్థుల స్కాలర్ షిప్ ల పెండింగ్ అంశాన్ని సమీక్షిస్తానన్నారు. వెస్ట్రన్ సిడ్నీ విశ్వవిద్యాలయంతో కలిసి పిజెటిఎయు డ్యూయల్ డిగ్రీ అందించడం గొప్ప ముందడుగు అని అభినందించారు. స్థానిక శాసనసభ్యులు గౌ॥ టి. ప్రకాష్ గౌడ్ బీసీ సెల్ మౌలిక వసతులకి 10 లక్షల రూపాయల తోడ్పాటు అందిస్తారని ప్రకటించారు. ఎంతో అనుభవం, పట్టుదల ఉన్న ప్రొ॥ అల్దాస్ జానయ్య నేతృత్వంలో విశ్వవిద్యాలయం మంచి అభివృద్ధి పధాన సాగుతుందని, దేశ, విదేశాల్లోని అధునాతన విజ్ఞానం రైతులకు చేరువవుతుందని ఆకాంక్షించారు. రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గౌ॥ జి. నిరంజన్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం ఏర్పాటైన 60 ఏళ్లకి ఉపకులపతిగా బీసీ వ్యక్తి నియమితులవడం, బీసీ సెల్ ఏర్పాటు చేయడం హర్షదాయకం అని అన్నారు. భారతదేశం విభిన్న వర్గాల, కులాల సమాహారం అని అందరూ అందరి అభివృద్ధికి కలిసి పనిచేయాలని అభిప్రాయపడ్డారు. ఈ బీసీ సెల్ ఏర్పాటు వల్ల విశ్వవిద్యాలయంలోని బీసీ ఉద్యోగులు, విద్యార్థులకు మేలు జరుగుతుందని అన్నారు. స్థానిక శాసన సభ్యుడు గౌ॥ టి. ప్రకాష్ గౌడ్ బీసీ సెల్ ఏర్పాటు పట్ల హర్షం వ్యక్తం చేశారు.

వర్సిటీ ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్య మాట్లాడుతూ ప్రస్తుత ముఖ్యమంత్రి గౌ॥ ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం రాజ్యాంగ విలువలకు అనుగుణంగా పాలన సాగిస్తుందని ప్రజాస్వామిక స్ఫూర్తి, సామాజిక న్యాయం, సమ్మిళిత అభివృద్ధి, సంక్షేమం ప్రధాన అంశాలుగా రాష్ట్ర ప్రభుత్వ పాలన సాగుతుందన్నారు. ముఖ్యమంత్రి గారి ఆలోచనలను స్ఫూర్తిగా తీసుకొని తమ విశ్వవిద్యాలయంలో అందరి సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని, పాలకమండలి ఏకగ్రీవంగా బీసీ సెల్ ఏర్పాటుకు అంగీకరించిందని, విద్యార్థులకు డ్యూయల్ డిగ్రీ అందించే ఉద్దేశంతో వెస్ట్రన్ సిడ్నీ విశ్వవిద్యాలయంతో ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. యుజీ లో 40 మందికి, పీజీ లో 10 మందికి ప్రవేశాలు కల్పిస్తున్నామని వారి ఫీజుల చెల్లింపులకి ఆర్థిక సాయం అందించవలసిందిగానూ, అదేవిధంగా విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలలు, పరిశోధనా స్థానాలకు విద్యార్థులు, రైతులు వెళ్లేందుకు రవాణా సదుపాయం కల్పించవలసిందిగా కోరుతూ మంత్రి గౌ॥ పొన్నం ప్రభాకర్ గారికి ఉపకులపతి వినతి పత్రాలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పంటల సాగులో కలుపు సమస్యను తగ్గించుకునే మార్గాలు

డా॥ బి. పద్మజ, డా॥ టి. రాంప్రకాశ్ మరియు డా॥ టి. అంజయ్య

కలుపు యాజమాన్య విభాగం, పిజెటిఏయు, హైదరాబాద్








వివిధ పంటల సాగులో రైతాంగం ఎదుర్కొనే అతి ముఖ్యమైన సమస్య కలుపు యాజమాన్యం. కలుపు మొక్కలు పంటల కంటే ముందే మొలవటం, భూమి లోతు నుంచి తేమను మరియు పోషకాలను గ్రహించగలగటం, బెట్టను సమర్థవంతంగా ఎదుర్కొనటం, తొందరగా పూత దశకు చేరుకుని అధిక విత్తన తయారీ మరియు వ్యాప్తి వంటి లక్షణాలు కలిగి ఉండటం వలన వాటి నిర్మూలనకు ఎన్ని పద్ధతులు అవలంభించినప్పటికీ పంటలతో పోటీ పడుతూనే ఉంటాయి. ఈ విధంగా వివిధ పంటలలో 35–45 శాతం దిగుబడి నష్టాన్ని కలిగిస్తాయి. భారతదేశంలో సాగయ్యే ముఖ్యమైన వరి, ప్రత్తి, మొక్కజొన్న, కంది, గోధుమ, సోయాబీన్, వంటి పంటలలో సాలీనా కలుపు మొక్కల వలన 11 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లుతుందని అంచనా వేయబడింది. కలుపు మొక్కలు వివిధ రకాలైన చీడపీడలకు ఆశ్రయమివ్వటం వలన కూడా సాగు ఖర్చులు పెరుగుతాయి.

కూలీల కొరత మరియు అధిక వేతనాల వలన కలుపు యాజమాన్యం కొరకు రైతులు యాంత్రిక మరియు కలుపు మందుల మీద ఆధారపడి వ్యవసాయం చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. వరి, మొక్కజొన్న, ప్రత్తి, సోయాబీన్, చెఱకు మరియు అపరాలలో సమర్థవంతమైన కలుపు మందులు అందుబాటులో ఉన్నాయి. కాని కలుపు మందులను సరైన సమయంలో, సరైన మోతాదులో ఆయా పంటలకు నిర్దేశించిన వాటిని మాత్రమే వాడాలి. ఒకే కలుపు మందును లేదా ఒకే పని తీరు కలిగిన కలుపు మందులను ప్రతిసారి వాడితే వివిధ కలుపు మొక్కలు నిరోధకతను ఏర్పరచుకునే ప్రమాదం ఉంది. అంతేకాకుండా సిఫారసు చేసిన మోతాదు కంటే ఎక్కువగా వాడితే పర్యావరణానికి నష్టం వాటిల్లుతుంది. యంత్రాల వాడకం మరియు ఆయా ప్రదేశాలలో లభ్యత పెరగవలసిన అవసరం ఉంది. చిన్న చిన్న కమతాలకు అనువైన కలుపు వినాశక యంత్రాలను తయారు చేయాలి. ఇటువంటి పరిస్థితులలో పంటల సాగులో చిన్న చిన్న మార్పులు లేదా జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా కలుపు సమస్యను గణనీయంగా తగ్గించుకోవచ్చు.

1. పంటల విత్తనాలలో కలుపు విత్తనాలు లేకుండా చూసుకోవడం: విత్తనాలు కొనేటప్పుడు లేదా ఇతర రైతుల దగ్గర నుండి సేకరించినప్పుడు కలుపు విత్తనాలు కలవకుండా జాగ్రత్త పడాలి. ఉదాహరణకు వరిలో ఊద/బడిపిలి విత్తనాలు కలవటం లేదా అపరాల విత్తనాలలో బంగారు తీగ విత్తనాలు ఉండటం వలన ఈ కలుపు మొక్కలు కొత్త ప్రదేశాలకు చేర్చబడతాయి.

2. ఆరుతడి పంటలు విత్తే ముందు భూమిని దున్నిన తర్వాత కొంత సమయం ఇవ్వటం వలన తేమ ఉన్న పరిస్థితులలో భూమి పై పొరలలో ఉన్న కలుపు మొక్కలు మొలకెత్తుతాయి. పంటలను విత్తే ముందు పైపైన భూమిని దున్నితే ఈ కలుపు మొక్కలు నశిస్తాయి. ఈ పద్ధతిని ఇంగ్లీషులో 'స్టేల్ సీడ్ బెడ్ టెక్నిక్' అంటారు. చాలా తక్కువ ఖర్చుతో భూమిలో కలుపు మొక్కల గింజలను తగ్గించుకోవచ్చు. దున్నటం కుదరని పక్షంలో లీటరు నీటికి 5.0 మి.లీ. పారాక్వాట్ కలుపు మందును కలిపి పిచికారి చేసి రెండు రోజుల తర్వాత పంట గింజలను విత్తుకోవచ్చు. కూరగాయ పంటలకు చాలా ఉపయోగకరమైన పద్ధతి.

3. వరి నారుమడిలో కలుపును నివారించాలి: వరి నారుమడులలో ఊద/బడిపిలి మొక్కలను నిర్మూలించటానికి విత్తిన 10-15 రోజులకు లీటరు నీటికి 1.5 మి.లీ. చొప్పున సైహలోఫాప్ ఇథైల్ అనే కలుపుమందును కలిపి పిచికారి చేయాలి. దీని వలన కలుపు మొక్కలు ప్రధాన పొలానికి చేరకుండా నివారించవచ్చు.

4. పొలాలు మరియు కాల్వ గట్ల మీద కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు యాంత్రిక పద్ధతులు లేదా కలుపు మందులు వాడి నాశనం చేయాలి.

5. బంజరు భూములు మరియు ఖాళీ ప్రదేశాలలో కలుపు మొక్కలను పెరగనిస్తే ఇది విత్తన భాండాగారంగా మారతాయి. కాబట్టి ఇటువంటి ప్రదేశాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి.

6. తంగ వంటి కలుపు మొక్కలు ఎక్కువగా ఉంటే అటువంటి భూమిలో 2-3 సంవత్సరాలు వరి పంట నాటితే తగ్గుముఖం పడుతుంది.

7. వేసవి కాలంలో నల్లటి పాలిథీన్ షీటును భూమి మీద కప్పటం వలన సూర్యరశ్మి వేడికి కలుపు గింజలు నాశనమవుతాయి. వరి మరియు కూరగాయ నారుమడులలో ఈ పద్ధతిని అవలంభించవచ్చు.

8. పంట వరుసల మధ్య పాలిథీన్ షీటును గాని, వరి గడ్డి లేదా వేరుశనగ పొట్టు, పంటల వ్యర్థాలు, వరి పొట్టు, లేదా పీకి వేసిన కలుపు మొక్కలు (పుష్పించక ముందు) వంటి వాటిని పరచటం వలన కలుపు మొలవకుండా ఉంటుంది. ముఖ్యంగా ద్విదళ జాతికి చెందిన ఏకవార్షిక కలుపు మొక్కల నివారణకు ఈ పద్ధతి బాగా అనుకూలమైనది. దీనిని మల్చింగ్ పద్ధతి అంటారు. సేంద్రీయ మరియు సహజ వ్యవసాయ పద్ధతులలో అనుకూలమైనది.

9. ప్రత్తి, కంది మరియు మొక్కజొన్న వంటి పంటల వరుసల మధ్య పెసర, అలసంద వంటి రొట్ట బాగా పెరిగే పంటలు లేదా జీలుగ, జనుము వంటి పచ్చిరొట్ట పంటల గింజలను విత్తి తర్వాత 30-45 రోజులకు వరుసల మధ్య కలియదున్నటం లేదా కోసి వరుసల మధ్య పరిస్తే కలుపు మొక్కల ఉధృతి తగ్గుతుంది మరియు భూమికి బలం చేకూరుతుంది.

10. ఆరుతడి పంటలలో డ్రిప్ మరియు ఫర్టిగేషన్ పద్ధతి అవలంభిస్తే కలుపు సమస్య చాలా వరకు తగ్గుతుంది.

11. పండ్ల తోటలలో వరుసల మధ్య అంతర పంటలు వేయాలి. పెద్ద తోటలలో పచ్చిరొట్ట పంటలు సాగు చేయవచ్చు లేదా పశుగ్రాసాలను పెంచడం ద్వారా కలుపు మొక్కలను అదుపు చేయవచ్చు. మరియు అధిక ఆదాయాన్ని పొందవచ్చు. చెట్ల పాదులలో జనుమును విత్తుకోవడం ద్వారా భూసారాన్ని కూడా పెంచవచ్చు.

12. పంటలలో యాంత్రిక పద్ధతులు లేదా కలుపుమందులు వాడినప్పుడు ఎక్కడైనా కొన్ని కలుపు మొక్కలు కనిపిస్తే పుష్పించక ముందే వాటిని చేతితో తీసివేయాలి. దీని వలన నిరోధకత ఏర్పడకుండా నివారించవచ్చు.

13. కూరగాయలు మరియు ఆకుకూరలలో కలుపు మందులు వాడకుండా ఇతర పద్ధతులు పాటిస్తేనే మంచిది. కలుపు మందుల అవశేషాలు ఉండవు.

14. వయ్యారిభామ, గుర్రపు డెక్క వంటి సమస్యాత్మక కలుపు మొక్కలపై పెంకు పురుగులు లేదా లార్వాలు కనిపిస్తే వాటిని ఇంకా పెరగటానికి దోహదం చేయాలి.

15. పంటమార్పిడి పాటించడం వలన కొన్ని కలుపు మొక్కల ఉధృతి తగ్గుతుంది. ఉదా॥ వరి పంటను ప్రతి సీజన్‌లో సాగు చేయడం వలన ఒడిపిలి/ఊద మరియు చీపురు గడ్డి ఉధృతి పెరుగుతుంది. కాబట్టి ఇతర పంటలలో పంటమార్పిడి చేయాలి. జొన్నమల్లె, పొగమల్లె మరియు బంగారు తీగ వంటి పరాన్న జాతికి చెందిన కలుపు మొక్కల నియంత్రణకు తప్పనిసరిగా పంటమార్పిడి పద్ధతి పాటించాలి.

16. ఎరువులను పంట మొక్కలకు దగ్గరగా వేయాలి.

17. సరైన సాంద్రతలో విత్తాలి. తొందరగా రొట్ట పెరిగే రకాలు కలుపు మొక్కల నుండి పోటీని సమర్థవంతంగా తట్టుకుంటాయి.

18. వెదజల్లే పద్ధతి కాకుండా వరుసలలో విత్తుకుంటే అంతరకృషి అనుకూలంగా ఉండి కలుపు నియంత్రణ సులభంగా ఉంటుంది.

ఈ పద్ధతులను పాటించడం ద్వారా కలుపు మొక్కలు అదుపులో ఉండటమే కాకుండా పర్యావరణం పరిరక్షించ బడుతుంది మరియు భూసారం కూడా కాపాడబడుతుంది.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9440040605**

# ట్రెల్లిస్/హై డెన్సిటి పద్ధతిలో డ్రాగన్ సాగు – లాభాలు బాగు

డా॥ సురుకుంట కిరణ్ రెడ్డి, డా॥ ఎం. సునీల్ కుమార్, డా॥ బి. జయ చంద్ర రెడ్డి, డా॥ ఆర్. సునీల్ కుమార్ మరియు డా॥ శ్రీధర్ చౌహాన్

వ్యవసాయ కళాశాల, ఆదిలాబాద్



మారుతున్న ఆహార అలవాట్ల దృష్ట్యా, ఆరోగ్యంపై పెరుగుతున్న జాగ్రత్తల దృష్ట్యా దానికి సమానంగా మనదేశంలో ముఖ్యంగా మన ఇరు తెలుగు రాష్ట్రాలలో భిన్నమైన పంటల సాగు వైపు యువరైతులు అడుగేస్తున్నారు. దీనిలో భాగంగా మనదేశంలో గత కొన్ని సంవత్సరాలుగా విరివిగా సాగవుతున్న విదేశీ పంట డ్రాగన్‌ఫ్రూట్. సౌత్ మెక్సికో ప్రాంతంలో ఆవిర్భవించిన ఈ పండును తినడానికి మనదేశంలో చాలా మంది వినియోగదారులు మొగ్గు చూపుతున్నారు. ఇందుకు కారణం ఎంతో ప్రత్యేకమైన రుచి, ఆకర్షించే రంగు మరియు పోషకాలు పుష్కలంగా ఉండటంతో పాటు ఎన్నో రకమైన ఆరోగ్యకర ప్రయోజనాలు కూడా ఉన్నాయి. సాంప్రదాయ పద్ధతిలో స్తంభం మరియు రింగ్ పద్ధతిలో డ్రాగన్ సాగును మనం తరచుగా చూస్తుంటాం అయితే ట్రెల్లిస్ పద్ధతిలో డ్రాగన్ సాగు అనేది నూతనమైన పద్ధతి.

### ట్రెల్లిస్ పద్ధతిలో డ్రాగన్ సాగు వలన ప్రయోజనాలు

- స్తంభం మరియు రింగ్ పద్ధతితో పోలిస్తే రెట్టింపు దిగుబడిని పొందవచ్చు.
- పెట్టుబడిని కేవలం రెండేళ్లలో తిరిగి తీసుకోవచ్చు.
- స్తంభం మరియు రింగ్ పద్ధతిలో స్తంభాలకు మధ్య ఉండే ఖాళీ స్థలాన్ని ఈ పద్ధతిలో పూర్తిగా వినియోగించుకోవచ్చు.
- భవిష్యత్తులో ధరలు తగ్గినప్పటికీ అధిక దిగుబడుల వల్ల రైతులకు నష్టం వచ్చే అవకాశం ఉండదు.

### డ్రాగన్ ఫ్రూట్ సాగుని ట్రెల్లిస్ పద్ధతిలో ఎలా చేయాలి?

- ముందుగా డ్రాగన్ ఫ్రూట్ సాగు చేసే భూమిని తయారు చేసుకోవాలి. భూమిని చదునుగా దున్నుకోవాలి, భూమిలో పెద్దరాళ్లు లేకుండా చూసుకోవాలి.
- సిమెంటు స్తంభాలు, ఇనుప పట్టీలు మరియు జి.ఐ. వైరును ఉపయోగించి మొక్కలకు ఊతమివ్వడం వలన ఈ పద్ధతిలో డ్రాగన్ పంటను సాగు చేయవచ్చు.
- వరసల్లో మొదటి స్తంభాన్ని 4×5 అంగుళాల మందంతో 10 అడుగుల ఎత్తు ఉండేలా వేసుకోవాలి.
- ఒక 10 అడుగుల స్తంభం తర్వాత మూడు 7 అడుగుల స్తంభాలు వేసుకోవాలి, ప్రతి స్తంభానికి 8 నుండి 10 అడుగుల దూరం ఉండేలా రెండు ఫీట్ల లోతులో నాటుకోవాలి.
- ఇప్పుడు స్తంభాల మధ్యలో వెదురు కర్రలను 2 అడుగుల దూరంలో అమర్చుకోవాలి.
- నల్లరేగడి నేలలో సాగు చేసినట్లయితే దాదాపు ఒక అడుగు ఎత్తులో మడులను ఏర్పాటు చేసుకోవాలి.
- ప్రతి స్తంభానికి పైభాగంలో దాదాపు రెండు అడుగుల పొడవు, 5 మి.మీ. మందం కలిగిన ఇనుప పట్టీలను ఒకే ఎత్తులో బిగించుకోవాలి.
- బిగించిన ఇనుప పట్టీలకి స్తంభానికి ఇరువైపులా రెండు నుంచి మూడు రంధ్రాలు ఏర్పాటు చేసుకోవాలి.
- 4 మి.మీ. & 8 గేజ్ జి.ఐ. వైర్‌ని ఏర్పాటుచేసిన రంధ్రాల గుండా అన్ని పోల్స్‌ని కలుపుతూ చివరి స్తంభాలకి బిగించాలి.
- వరుసలో చివరి మరియు మధ్యలో ఉన్న స్తంభాలకి ఊతమిచ్చే స్తంబాలను అమర్చాలి.
- ఇప్పుడు డ్రిప్ వ్యవస్థను సిద్ధం చేసి డ్రిప్ పైప్స్ పరచుకొని కొంత సమయం పాటు నీటిని బెడ్స్‌కి అందించడం ద్వారా తడిగా చేయాలి.
- ఇలా చేయడం వల్ల మొక్కలు నాటడానికి సులువుగా ఉంటుంది
- డ్రాగన్ కొమ్మలు నాటినట్లయితే మొదటి డోస్‌గా ఎలాంటి ఎరువులు ఇవ్వకూడదు ఎందుకంటే మొక్కలకు వేరువ్యవస్థ ఉండదు కాబట్టి అవి చనిపోయే అవకాశం ఉంటుంది
- నర్సరీలో పెంచిన మొక్కలు నాటినట్లయితే ముందుగా బాగా మక్కిన పేడను మొదటి డోస్‌గా మడులపై వేసి మట్టితో కప్పుకోవాలి
- ఈ మడులపై వేసిన పేడకి సుడోమోనాస్ మరియు ట్రైకోడెర్మాను సరైన మోతాదులో ముందే కలిపి ఉంచాలి.

- ఈ వెదురు కర్రలకు ఇరువైపులా ఒక్కో మొక్కను నాటుకోవాలి. ఇలా నాటుకోవడం వల్ల ఎకరానికి 4,000 నుండి 4500 వరకు మొక్కలు వచ్చే అవకాశం ఉంటుంది.
- తల్లి మొక్క సైడ్ పిలకలలో దృఢంగా పైభాగంలో ఉన్న పిలక తప్ప మిగతా పిలకలు అన్నీ తొలగించుకోవాలి.
- ఒకే దృఢమైన పిలకను ఎదగనిస్తూ దాన్ని వెదురు కర్రలకు కడుతూ పైకి తీసుకెళ్లాలి. ముందుగా అమర్చిన జి.ఐ.వైర్స్‌పై ఈ పిలకలను పరిచేంత వరకు పెంచుకోవాలి.
- ఒకసారి జిఐ వైర్స్‌పై పరచబడిన తర్వాత పిలకలను పైభాగంలో తుంచి వేయాలి. ఇలా తుంచిన తర్వాత కొన్ని రోజులకి వేరే పిలకలు పుట్టడం మొదలవుతాయి. ఈ పిలకలను తుంచకూడదు.
- ఈ పిలకలు కొమ్మలుగా ఎదిగి, పూలను, పండ్లను ఇస్తాయి.
- పైన చెప్పిన విధంగా వివిధ దశల ద్వారా ట్రెలిస్ పద్ధతిలో డ్రాగన్ ఫ్రూట్‌ని సాగు చేయవచ్చు.

**ట్రెల్లిస్ పద్ధతిలో ఎండ నుండి డ్రాగన్ పంటను కాపాడుకునే మెలకువలు:**

- మన రెండు తెలుగు రాష్ట్రాలలో ఎండాకాలంలో ఎండలు తీవ్రస్థాయిలో ఉంటాయి కాబట్టి డ్రాగన్ మొక్కలను కాపాడుకోవడం ఎంతో ముఖ్యం ఇందులో చాలా పద్ధతులు ఉన్నాయి.
- మొదటిది చైనా క్లే లేదా కాయోలైన్‌ను స్ప్రే చేయడం. ఇలా చేయడం వల్ల మొక్క ఉపరితలంపై ఉష్ణోగ్రత ప్రభావం నాలుగు నుంచి ఐదు డిగ్రీలు తగ్గుతుంది.
- 200 లీటర్ల నీటిలో 25 కేజీల చైనా క్లే వేసి బాగా కలిపి స్ప్రే చేయాలి. దీని ప్రభావం 15 రోజుల వరకు ఉంటుంది మధ్యలో వర్షం పడినట్లు అయితే ఇంకోసారి స్ప్రే చేయాల్సి ఉంటుంది.
- 20 మి.మీ. డ్రిప్స్ పైప్స్‌ని ముందుగా ఏర్పాటు చేసుకున్న 10 అడుగుల స్తంభాలకి అనుసంధానం చేస్తూ స్తంభాలన్నింటికీ అమర్చుకోవాలి.
- ప్రతిమూడు ఫీట్ల దూరంలో ఈ 20 మి.మీ. డ్రిప్స్ పైప్స్ పైన ఫాగర్స్‌ని అమర్చుకోవాలి. ఎండలు ఎక్కువగా ఉన్న సమయంలో ఒక గంట సేపటి వరకు వీటి ద్వారా నీటిని స్ప్రే చేయాలి. దీనివల్ల మొక్క ఉపరితల భాగం చల్లబడి ఎండలకి పాడవ్వకుండా ఉంటుంది.
- ప్రతి 10 అడుగుల స్తంభానికి ముందుగా దాని పైన మధ్యభాగంలో నిలువుగా ఇనుప కడ్డీలు అమర్చుకోవాలి. దానికి ఐరన్ యాంగిల్స్‌ని అడ్డంగా అమర్చి బిగించాలి. ఇలా అడ్డంగా బిగించిన ఇనుప యాంగిల్స్ గుండా షేడ్ నెట్స్‌ని అమర్చుకోవాలి.

**డ్రాగన్ ఫ్రూట్‌ని ట్రెల్లిస్ పద్ధతిలో సాగుచేయడానికి అయ్యే ఖర్చు వివరాలు:**

| | | |
|---|---|---|
| భూమి తయారీ | = | 5000 |
| 7 అడుగుల సిమెంట్ స్తంభాలు | = | 1,60,000 |
| 10 అడుగుల సిమెంట్ స్తంభాలు | = | 80,000 |
| వెదురు కర్రలు | = | 35000 |
| ఎత్తుమడుల ఏర్పాటు | = | 10000 |
| డ్రాగన్ మొక్కలు | = | 2,00,000 |
| ఇనుప పట్టీలు | = | 50,000 |
| జి.ఐ.వైర్స్ | = | 90000 |
| డ్రిప్ సిస్టం | = | 60000 |
| లేబర్ ఖర్చులు | = | 50,000 |
| చీడపీడల నియంత్రణ (ఒక సంవత్సరానికి) | = | 30,000 |
| ఇతర చిల్లర ఖర్చులు | = | 50000 |
| మొత్తం ఖర్చు | = | దాదాపు 7 నుంచి 8 లక్షలు |

**డ్రాగన్ ఫ్రూట్‌ని ట్రెల్లిస్ పద్ధతిలో సాగు చేయడంవల్ల మొదటి సంవత్సరం నుంచి వచ్చే దిగుబడి మరియు లాభాల వివరాలు:**

- మొదటి సంవత్సరంలో జూన్ నెలకల్లా పంట వయస్సు ఎనిమిది నెలలు పూర్తిచేసుకుంటే దాదాపుగా ఒక టన్ను పంట వచ్చే అవకాశం ఉంటుంది.
- రెండవ సంవత్సరంలో మనం ఎంచుకున్న డ్రాగన్ మొక్క రకాన్ని బట్టి ఐదు నుంచి ఆరు టన్నులు వస్తుంది.
- మూడవ సంవత్సరం నుంచి పది టన్నుల వరకు రావచ్చు.
- అధికంగా నాలుగు నుండి ఐదవ సంవత్సరం వరకు 15 టన్నులు వచ్చే అవకాశం ఉంటుంది.
- ఈ పంట జీవితకాలం ముగింపు వరకు ఈ 15 టన్నుల దిగుబడిని దాటే అవకాశం కూడాఉంది.
- మార్కెట్లో పంట ధరలను బట్టి ఐదు నుండి పది లక్షలు ఒక ఎకరం భూమి నుండి ఈ ట్రెల్లిస్ పద్ధతిలో పొందే అవకాశం ఉంది.

**ముగింపు**

- డ్రాగన్ పంటను స్తంభం మరియు రింగు పద్ధతిలో సాగు చేసే కంటే ఈ ట్రెల్లిస్ పద్ధతిలో సాగుచేయడం వల్ల దాదాపు రెట్టింపు దిగుబడి వస్తుంది కాబట్టి రైతులందరూ స్తంభం మరియు రింగు పద్ధతిని వదిలి ట్రెల్లిస్ పద్ధతిలో సాగు చేయడం మంచిది. దీనివల్ల భవిష్యత్తులో ధర తగ్గినప్పటికీ రైతులు నష్టపోకుండా ఉంటారు.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 8309504636**

# “భారతదేశంలో పురుగుమందుల వాడకం గురించి ఉన్న అపోహలు మరియు శాస్త్రీయ వాస్తవాలు”

యం. రాజశేఖర్, డా॥ కె. వాణిశ్రీ, డా॥ ఈ. సత్యనారాయణ, డా॥ లక్ష్మి ప్రసన్న, డా॥ పుష్పవల్లి, డా॥ అనురాధ, డా॥ వాణిశ్రీ మరియు డా॥ సి.వి. సమీర్ కుమార్

ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్, హైదరాబాద్



ప్రపంచ వ్యాప్తంగా వివిధ పంటల సస్య రక్షణ కోసం పురుగుమందులు వినియోగిస్తున్నారు. అయితే, పురుగుమందుల వినియోగంపై కొన్ని అపోహలు ప్రజల్లో వ్యాప్తిలో ఉన్నాయి. ఈ అపోహలు వాస్తవాలను కప్పిపుచ్చి, రైతులను తప్పుదారి పట్టించే విధంగా ఉండటం వల్ల ప్రజల్లో అనవసర భయాలు ఏర్పడుతున్నాయి. భారతదేశం ఆహార ఉత్పత్తిలో ఆత్మనిర్భరత సాధించే దిశగా ప్రయాణిస్తున్న సమయంలో, ఈ అపోహలను శాస్త్రీయ ఆధారాలతో ఖండించడం అత్యంత అవసరం.

**అపోహ 1: భారతీయ రైతులు అధికంగా పురుగుమందులు ఉపయోగిస్తున్నారు ?**

**నిజం:** భారతదేశం ప్రపంచంలో రెండవ అతిపెద్ద వ్యవసాయ ఉత్పత్తిదారుగా ఉన్నప్పటికీ, పురుగుమందుల వినియోగంలో 12వ స్థానంలో ఉంది. భారతదేశం హెక్టార్‌కి సగటున కేవలం 0.6 కిలో/హె. మాత్రమే పురుగుమందులు ఉపయోగిస్తోంది. చైనా (13.1 కిలో/హె.), అమెరికా (2.5 కిలో/హె.), జపాన్ (11.8 కిలో/హె.), ఫ్రాన్స్ (3.7 కిలో/హె.) వంటి దేశాలు భారతదేశంతో పోలిస్తే గణనీయంగా అధిక పరిమాణంలో పురుగుమందులు వినియోగిస్తున్నాయి. దీని అర్థం భారతదేశ రైతులు సమర్థవంతంగా, శాస్త్రీయంగా పురుగుమందులను నియంత్రితంగా ఉపయోగిస్తున్నారు. అంతేకాకుండా, ప్రభుత్వం, ఐసిఏఆర్, సిఐబి&ఆర్‌సి మరియు వ్యవసాయ విశ్వవిద్యాలయాల సహకారంతో శిక్షణా కార్యక్రమాలు, సమగ్ర సస్య రక్షణ పద్ధతులు ద్వారా రైతులకు శాస్త్రీయ అవగాహన కల్పిస్తోంది. ఇలాంటి అపోహలు రైతులను తప్పుదోవ పట్టించడమే కాకుండా, దేశ ఆహార భద్రత మరియు ఎగుమతులపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశముంది. కనుక, శాస్త్రీయ ఆధారాలతో భ్రమలను తొలగించడం అవసరం.

**అపోహ 2: భారతీయ వ్యవసాయ ఉత్పత్తిలో అధికంగా పురుగుమందుల అవశేషాలు ఉంటాయి?**

**నిజం:** భారతదేశంలోని పురుగుమందుల అవశేషాలపై ఆలిండియా నెట్‌వర్క్ ప్రాజెక్ట్ నిర్వహించిన విశ్లేషణ ప్రకారం, మొత్తం పరీక్షించిన నమూనాలలో కేవలం 2.2% మాత్రమే మాక్సిమమ్ రెసిడ్యూ లిమిట్ (ఎమ్ఆర్ఎల్) కంటే అధిక స్థాయిలో పురుగుమందుల అవశేషాలను కలిగి ఉన్నాయి. అంటే 98% వ్యవసాయ ఉత్పత్తులు పూర్తిగా భద్రతా ప్రమాణాల లోపలే ఉన్నాయి.

**అంతర్జాతీయంగా భారత్ స్థానాన్ని పరిశీలిస్తే:**

| దేశం | పరీక్షించిన నమూనాలు | ఎమ్ఆర్ఎల్ కంటే ఎక్కువ అవశేషాల శాతం |
|---|---|---|
| భారతదేశం | 20,618 | 2.20% |
| కెనడా | 18,000 | 1.80% |
| అమెరికా | 1,905 | 2.80% |
| యూరోపియన్ యూనియన్ (ఇయు) | 80,967 | 2.60% |
| బ్రెజిల్ | 13,556 | 3.00% |

ఈ నమూనాలలో ఆహార ధాన్యాలు, కూరగాయలు, పండ్లు, పాలు, గుడ్లు, మాంసం, చేపలు, మసాలా దినుసులు, టీ మొదలైనవన్నీ ఉన్నాయి.గమనించవలసిన ముఖ్యమైన అంశం ఏమంటే ఎమ్ఆర్ఎల్ అనే ప్రమాణాలు ఆరోగ్యపరమైన భద్రత ప్రమాణాలు కాదని, ఇవి ప్రధానంగా వాణిజ్య (ట్రేడ్) పరంగా స్థిరపరచబడిన ప్రమాణాలు. అయినప్పటికీ, భారతదేశం ఈ ప్రమాణాలను ఖచ్చితంగా అనుసరిస్తూ, అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ స్థితిని కలిగి ఉంది. ఇది భారతదేశంలో పురుగుమందుల వినియోగం పట్ల ఉన్న అపోహలను ఖండించడానికి శాస్త్రీయ ఆధారంగా స్పష్టమైన ఉదాహరణ.

**అపోహ 3: భారతదేశంలో పురుగుమందుల వినియోగం వల్ల క్యాన్సర్ కేసులు అధికంగా ఉన్నాయి?**

**నిజం:** భారతదేశంలో క్యాన్సర్ కేసుల రేటు అధికంగా ఉండటం అనేది శాస్త్రీయ ఆధారాలు లేని అపోహ. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) మరియు భారత వైద్య పరిశోధనా మండలి (ఐసిఎమ్ఆర్) నివేదికల ప్రకారం, భారతదేశం క్యాన్సర్ ప్రబలతలో ప్రపంచ వ్యాప్తంగా 172వ స్థానంలో ఉంది. ఇది తక్కువ స్థాయి ప్రబలతగా పరిగణించబడుతుంది.

**విశ్వవ్యాప్త క్యాన్సర్ ప్రబలతతో పోలిస్తే భారతదేశ స్థితి:**

| దేశం | క్యాన్సర్ ప్రబలత (ప్రతి 1,00,000 మందికి) |
|---|---|
| అమెరికా (యుఎస్ఏ) | 362 |
| సింగపూర్ | 233 |
| ప్రపంచ సగటు (గ్లోబల్ ఆవెరేజ్) | 201 |
| భారతదేశం | 106 |

భారతదేశంలో అత్యధిక క్యాన్సర్ రేటు ఉన్న రాష్ట్రాలు మిజోరం, మేఘాలయ, సిక్కిం. వీటిలో పురుగుమందుల వినియోగం అతి తక్కువ. పంజాబ్, తరచుగా ఇటువంటి ఆరోపణలకు గురవుతున్నప్పటికీ, క్యాన్సర్ ప్రబలతలో 24వ స్థానంలో మాత్రమే ఉంది. అంతేగాక, డబ్ల్యుహెచ్ఓ - అంతర్జాతీయ క్యాన్సర్ పరిశోధనా సంస్థ (ఐఎఆర్సి) నిర్ధారించిన మానవులలో క్యాన్సర్‌కు కారణమయ్యే (గ్రూప్1 కారకాల జాబితాలో ఉన్న 120 పదార్థాల్లో ఒక్కదానికీ వ్యవసాయంలో వాడే పురుగుమందులతో సంబంధం లేదు. ఇవన్నీ ఎక్కువగా జీవనశైలి, జీవన పద్ధతులు, ధూమపానం, ఆల్కహాల్ సేవనంతో ముడిపడి ఉన్నాయి. కాబట్టి, పురుగుమందుల వాడకాన్ని క్యాన్సర్‌కు ముడి పెట్టడం శాస్త్రీయంగా నిరాధారమైంది. ఇది ప్రజల్లో అపోహలు, భయాలను పెంచే మూర్ఖమైన ప్రచారం మాత్రమే.

**అపోహ 4: స్ప్రే డ్రిఫ్ట్ వల్ల రైతులు తీవ్రమైన హానికి గురవుతారు?**

**నిజం:** పురుగుమందులు పిచికారీకి ముందుగా 99% వరకు నీటితో కలుపబడతాయి, అంటే వాటిలో ఉన్న క్రియాశీల పదార్థం పరిమిత స్థాయిలో మాత్రమే ఉంటుంది. ఈ కారణంగా, పిచికారీ సమయంలో స్ప్రే డ్రిఫ్ట్ ద్వారా జరిగే ప్రమాదాలు చాలా తక్కువ. అంతేకాక, వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో ప్రస్తుతం రైతులకు వ్యక్తిగత రక్షణ పరికరాల వినియోగంపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో గ్లోవ్స్, ముఖానికి కవచం, ఎప్రాన్లు, బూట్లు వంటి పరికరాల వినియోగం చేర్చబడింది. అధునాతన పద్ధతుల్లో డ్రోన్ ఆధారిత పిచికారీ విధానాలపై జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయంలో కూడా పరిశోధనలు జరుగుతున్నాయి. దీని ద్వారా రైతులపై పురుగు మందుల ప్రభావం మరింతగా తగ్గించడం లక్ష్యంగా ఉంది.

**అపోహ 5: భారతీయ మార్కెట్ నకిలీ పురుగుమందులతో నిండిపోయి ఉంది?**

**నిజం:** "నకిలీ పురుగుమందులు" అనే పదం 1968 కీటకనాశినుల చట్టంలో పొందుపరచబడలేదు. ఇది అస్పష్టమైన పదం మాత్రమే. 2015 నుండి 2020 మధ్యకాలంలో భారత ప్రభుత్వ ల్యాబ్‌ల ద్వారా విశ్లేషించబడిన 3,38,182 నమూనాల్లో కేవలం 1.17% మాత్రమే నాణ్యత ప్రమాణాలను అందుకోలేకపోయాయి. ఇందుకు తోడు, పంట నష్టాలు మరియు నకిలీ ఇన్‌పుట్ల గురించి కొన్ని మీడియా నివేదికలు మరియు వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖను తప్పుదోవ పట్టించేలా పేర్కొన్నాయి. కానీ నకిలీ పురుగుమందుల విస్తృత వినియోగాన్ని ధృవీకరించే ఎలాంటి అధికారిక సమాచారం అందుబాటులో లేదు. ఈ కారణంగా, భారత మార్కెట్‌లో నకిలీ పురుగుమందుల ప్రబలతపై ఉన్న ప్రచారం శాస్త్రీయంగా నిరాధారమైనదే.

**అపోహ 6: పురుగుమందులు భారతదేశపు జలవనరులను కాలుష్యం చేస్తున్నాయి?**

**నిజం:** ఇది శాస్త్రీయ ఆధారాలు లేని అపోహ మాత్రమే. భారతదేశం ప్రపంచంలో రెండవ అత్యధిక మత్స్య ఉత్పత్తి దేశంగా గుర్తించబడింది. సాధారణంగా చేపలు నీటిలో ఉన్న కాలుష్యానికి అతి సున్నితంగా స్పందిస్తాయి. అయితే, ఆంధ్రప్రదేశ్ మరియు పంజాబ్ రాష్ట్రాలు, పురుగుమందుల వినియోగం గణనీయంగా ఉన్నా, అంతర్గత జలవనరుల మత్స్య ఉత్పత్తిలో అగ్రగాములుగా ఉన్నాయి, అటు ఆంధ్రప్రదేశ్ మరియు పంజాబ్ రాష్ట్రాల్లో ఎకరానికి సగటు 6,560 కిలోల మత్స్య ఉత్పత్తి నమోదు అయింది. ఈ డేటా స్పష్టంగా సూచిస్తున్నది ఏమిటంటే, భారతదేశపు నీటి మూలాలు పురుగుమందుల వల్ల గణనీయంగా కాలుష్యం చెంది ఉండటం లేదు అనే నిజాన్ని నిర్ధారించవచ్చు.

**అపోహ 7: పురుగుమందుల వాడకం భారతదేశంలో ఆత్మహత్యలకు ప్రధాన కారణం?**

**నిజం:** ఆత్మహత్యలు అనేవి ఒక సంక్లిష్టమైన సామాజిక సమస్య. పురుగుమందుల వాడకాన్ని ప్రధాన కారణంగా చూపడం శాస్త్రీయంగా తప్పు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏడాది 8 లక్షల మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇందులో జపాన్ దేశపు ఆత్మహత్య రేటు ప్రపంచ సగటుతో పోలిస్తే 60% ఎక్కువ. భారతదేశాన్ని పరిగణనలోకి తీసుకుంటే, ఆత్మహత్యలలో 93% మంది రైతులు కానివారే. రైతులలోనూ, ఆత్మహత్యలకు ప్రధాన కారణాలు: ఆర్థిక ఒత్తిడి, దీర్ఘకాలిక అనారోగ్యం, మత్తుపదార్థాల దుర్వినియోగం వంటి సామాజిక అంశాలే. పురుగుమందుల కారణంగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నది అవాస్తవ ప్రచారం. జాతీయ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) సమాచారం ప్రకారం: పంజాబ్ కన్నా నాలుగు రెట్లు అధిక ఆత్మహత్య రేటు కలిగిన రాష్ట్రం సిక్కిం – ఇది పురుగుమందుల వినియోగాన్ని నిషేధించిన రాష్ట్రం. అంతేకాకుండా, భారతదేశంలో అత్యధిక ఆత్మహత్యలు "ఉరి వేసుకోవడం (హ్యాంగింగ్)" ద్వారా జరుగుతున్నాయి, విషపదార్థాల ద్వారా కాదు. ఈ విషయాలు స్పష్టంగా తెలియజేస్తున్నది ఏమిటంటే, పురుగుమందులను ఆత్మహత్యలకు ప్రధాన కారణంగా చిత్రీకరించడం శాస్త్రీయంగా నిరాధారమైన అపోహ మాత్రమే.

**అపోహ 8: భారతదేశం ఇతర దేశాల్లో నిషేధించబడిన పురుగుమందులను ఉపయోగిస్తోంది?**

**నిజం:** పురుగుమందుల అనుమతులు ప్రతి దేశంలో వాతావరణం, పంటల ధోరణి, ఉన్నత ప్రాథమికతలు మరియు స్థానిక జీవవ్యవస్థపై ఆధారపడి ఉంటాయి. అందువల్ల, ఒక దేశంలో నిషేధించబడిన పురుగుమందు మరో దేశంలో అవసరంగా భావించి ఉపయోగించబడవచ్చు. భారతదేశంలో పురుగుమందుల ధ్రువీకరణ ప్రక్రియ చాలా కఠినమైనదిగా, శాస్త్రీయ ఆధారాలతో కూడినదిగా ఉంటుంది. ప్రతి పదార్థం స్వతంత్ర పరిశీలనకు లోబడుతుంది. భారతదేశంలో అనుమతించబడిన పురుగుమందుల సంఖ్య 308, ఇవే చైనాలో 681, జపాన్‌లో 583 ఉన్నాయి. ఇది భారత ప్రభుత్వం తగిన శాస్త్రీయ, ఆచరణీయ ప్రమాణాల ప్రకారమే నిర్ణయాలు తీసుకుంటున్నదన్న దానికి నిదర్శనం. ఇంతేకాకుండా, ప్రపంచవ్యాప్తంగా అమ్ముడవుతున్న పురుగుమందులలో 70%కు పైగా "జెనరిక్ మాలిక్యూల్స్" అంటే చాలాకాలంగా నిఖార్సైన ప్రభావంతో ఉపయోగించబడుతున్న మిశ్రమాలువే. ఇవి శాస్త్రీయంగా పరీక్షించబడిన, సమర్థవంతమైనవి. ఈ సమాచారాన్ని పరిశీలించినపుడు, భారతదేశం అంతర్జాతీయంగా సాధారణంగా ఉపయోగించబడుతున్న పురుగుమందులనే ఉపయోగిస్తున్నదని మరియు ఇది స్వతంత్రంగా, శాస్త్రీయంగా నియంత్రించబడుతున్నదని స్పష్టమవుతుంది.

**అపోహ 9: ఆర్గానిక్ మరియు బయో–పురుగుమందులు, రసాయన పురుగుమందులకంటే ఎక్కువగా భద్రంగా ఉంటాయి?**

**నిజం:** ఆర్గానిక్, బయో లేదా రసాయన పురుగుమందులు అయినా సరే, ఇవన్నీ ధ్రువీకరణ పొందే ముందు ఒకే రకమైన భద్రతా మరియు ప్రభావిత పరీక్షలకు లోబడి ఉంటాయి. ప్రయోగాత్మక విశ్లేషణల ద్వారా వాటి ప్రభావం, మానవ ఆరోగ్యంపై ప్రభావం, పర్యావరణ భద్రత తదితర అంశాలు సర్వే చేయబడతాయి. ప్రపంచవ్యాప్తంగా సర్టిఫైడ్ ఆర్గానిక్ వ్యవసాయం కేవలం 1% విస్తీర్ణంలో మాత్రమే ఉంది. భారతదేశంలో ఇది ఇంకా తక్కువగా, 0.8% స్థాయిలో ఉంది. అంతేగాక, ప్రభుత్వ అధ్యయనంలో 405 ఆర్గానిక్ కూరగాయల నమూనాలు పరిశీలించగా, 12.3% నమూనాల్లో గుర్తించదగిన పురుగుమందుల అవశేషాలు లభించాయి. ఇది ఆర్గానిక్ వ్యవసాయంలోనూ కచ్చితమైన అవశేష నియంత్రణ అనేది గ్యారెంటీ కాదు అనే విషయాన్ని చూపిస్తుంది.

**అపోహ 10: భారతీయ పురుగు మందుల తయారీదారులు అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలను చేరుకోలేరు?**

**నిజం:** ఇది పూర్తిగా నిరాధారమైన అపోహ. భారతీయ పురుగుమందుల తయారీదారులు ప్రపంచవ్యాప్తంగా 130కి పైగా దేశాలకు ఉత్పత్తులను సరఫరా చేస్తున్నారు. భారతదేశం నుండి

ఎగుమతయ్యే పురుగుమందులు దేశీయ అవసరాలకంటే ఎక్కువగా ఉంటూ, పురుగుమందుల ఎగుమతుల్లో 80% వాటా భారత తయారీదారులదే. పలు సందర్భాలలో, భారతదేశంలో తయారైన ఉత్పత్తులు దిగుమతి ఉత్పత్తుల కంటే మెరుగైన నాణ్యత మరియు స్వచ్ఛతను కలిగి ఉంటున్నాయి. దేశీయంగా తయారీ ప్రారంభమైన తర్వాత, పురుగుమందుల ధరలు 50-75% వరకు తగ్గుతాయి, ఇది రైతులకు లాభదాయకం. ఈ గణాంకాలు భారతదేశపు క్రాప్ ప్రొటెక్షన్ రంగం నాణ్యత, సామర్థ్యం మరియు స్థిరమైన అభివృద్ధి పరంగా ఎంత బలంగా ఉన్నదీ స్పష్టంగా తెలియజేస్తున్నాయి.

ఏది ఏమైనప్పటికి రైతులు కూడా పురుగు మందులను క్యాలెండర్ ఆధారితంగా విచ్చల విడిగా కాకుండా పురుగు ఉధృతి స్థాయిని బట్టి పిచికారీ చేయాలి. ముఖ్యంగా మరియు ముందస్తుగా సాంప్రదాయ, భౌతిక, యాంత్రిక మరియు జీవ సంబందిత యాజమాన్య పద్ధతులు పాటించి, అప్పటికీ పురుగు ఉధృతి తగ్గనప్పుడు మాత్రమే రసాయన పురుగు మందులను వాడాలి. ఈ విధంగా పండించిన పంటల మీద పురుగు మందుల అవశేషాలు తగ్గడమే కాకుండా సాగు ఖర్చు తగ్గి, పంటలు మంచి నాణ్యతను కలిగి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మన దేశ వ్యవసాయ ఉత్పత్తులు ఎగుమతి చేసే అవకాశం లభిస్తుంది.

భారతదేశంలో పురుగుమందుల వాడకం గురించి వ్యాప్తిలో ఉన్న అపోహలు భయాల మీద కాక, వాస్తవాల మీద ఆధారపడాలి. వ్యవసాయ రంగంలో రైతుల అవగాహన పెరుగుతోంది, విధివిధానాలు మరింత కఠినంగా మారుతున్నాయి, మరియు దేశీయ తయారీదారుల మౌలికసదుపాయాలు గణనీయంగా మెరుగవుతున్నాయి. ఈ పరిణామాలన్నీ కలిపి భారతదేశాన్ని శాస్త్రీయంగా ఆధారితమైన, స్థిరమైన వ్యవసాయం కోసం ప్రపంచ స్థాయి నాయకత్వ స్థానానికి తీసుకెళ్లుతున్నాయి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 8247421216**

## ఆకాశవాణి ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమము

**పి.జె.టి.ఏ.యు, శాస్త్రవేత్తల ప్రత్యక్ష రేడియో ప్రసార కార్యక్రమం ప్రతి గురువారం రాత్రి 7:15-7:45 ఆకాశవాణి, హైదరాబాద్ ఏ స్టేషన్ నుంచి ప్రసారమవుతుంది. సెప్టెంబర్, 2025 లో ప్రసారమయ్యే రేడియో కార్యక్రమాలు**

| తేది | అంశం | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|
| 03.09.2025 | ఖరీఫ్ వరి సాగు సూచనలు | **డా॥ జి. శివ ప్రసాద్,** శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్)<br>వ్యవసాయ పరిశోధన స్థానం, కంపాసాగర్,<br>ఫోన్ నెం. 9652329262 |
| 10.09.2025 | నూనెగింజ పంటలలో కలుపు/ఎరువుల యాజమాన్యం | **డా॥ జె.ఎస్. సుధారాణి,** సీనియర్ శాస్త్రవేత్త (అగ్రానమి)<br>ఎలక్ట్రానిక్ వింగ్, ఎ.ఆర్.ఐ., రాజేంద్రనగర్,<br>ఫోన్ నెం. 9550526096 |
| 17.09.2025 | నూనెగింజ పంటలలో సస్యరక్షణ | **శ్రీమతి జి. మాధురి,** శాస్త్రవేత్త (ఎంటమాలజీ)<br>ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం,<br>ఫోన్ నెం. 9550635307 |
| 24.09.2025 | యాసంగి జొన్న సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు | **శ్రీ ఎ. శ్రీరామ్,** శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్)<br>ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం,<br>ఫోన్ నెం. 8919777028 |

# వ్యవసాయ పదవినోదం

కూర్పు : డా॥ ఆర్. సునీత దేవి




**అడ్డం:**

1. కందిలో సగభాగం కాయలోనికి చొచ్చుకొనిపోయి మిగిలిన భాగాన్ని బయట ఉంచి తినే పురుగు ఏది? (8)
4. వరి పంటలో నీటి మట్టలపై ఉండి మొక్క పై భాగంలో నష్టాన్ని కలుగజేసే రసంపీల్చే పురుగు ఏది? (4) (కుడి నుండి ఎడమకి)
6. ఆముదం మొక్కలు వడలిపోయి, ఆకులు పాలిపోయినట్లై తర్వాత చనిపోతాయి. కాండం చీల్చి చూస్తే లోపల తెల్లని బూజు లాంటి శిలీంధ్రపు పెరుగుదల కనిపిస్తుంది? (5)
8. మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు ఏ పరాన్నజీవని విడుదల చేయాలి? (8) (కుడి నుండి ఎడమకి)
9. కత్తెర పురుగు, పొగాకు లద్దె పురుగులు ఎదిగిన లార్వాలను నివారించుటకు ఏమి తయారు చేసి సాయంత్రం వేళల్లో వెదజల్లాలి? (5)
11. మొక్కజొన్న పంట తొలిదశలో ఎక్కువగా ఆశించి నష్టాన్ని కలిగిస్తున్న పురుగు ఏది? (6)
12. పొలంలో ప్రధాన పంటల చుట్టూ గాని, గట్ల వెంబడి గాని కొద్ది వరుసలలో వేసే పైరును ఏమంటారు? (4)
13. తొలకరి వర్షాలు పడిన తర్వాత భూమి నుండి బయటకు వచ్చి వేప, మునగ, సుబాబుల్‌ను ఆశించే పురుగు పేరు ఏమిటి? (5)

**నిలువు:**

2. ప్రత్తిలో ఏ రసంపీల్చు పురుగు ఆశించడం వలన ఆకుల అంచుల నుండి ఎర్రగా మారుతుంది? (4)
3. వరిలో ఆశించే ఏ తెగులుకు ఐసోప్రోథయోలేన్ మందు వాడమని సిఫారసు చేస్తున్నారు? (5)
5. మిరపలో అధిక నష్టం కలుగజేస్తున్న రసంపీల్చే పురుగు ఏది? (8)
7. మిరపలో ఆకుముడత / జెమిని వైరస్ తెగులు వ్యాప్తికి కారణమైన రసంపీల్చే పురుగు ఏది? (4) (క్రింది నుండి పైకి)
10. ప్రధాన పంటల కన్నా పురుగులు ఎక్కువగా ఆకర్షించే పంటను ఏమంటారు? (4)

సమాధానాలు 50వ పేజీలో



# సెప్టెంబర్ మాసంలో ఉద్యాన పంటల్లో చేపట్టవలసిన సేద్యపు పనులు

డా॥ ఐ.వి. శ్రీనివాస రెడ్డి
**వ్యవసాయ కళాశాల, అశ్వారావుపేట**

**మామిడి:** ఇప్పటి వరకు కురిసిన అధిక వర్షాల వల్ల వచ్చే వివిధ మచ్చ తెగుళ్ళ నివారణకు కార్బండాజిమ్ + మ్యాంకోజెబ్ 2 గ్రా. లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా.ను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. వర్షాలు ఆగిన తరువాత ఈ మాసం చివరలో పొలాన్ని దున్నాలి. దీని వల్ల కలుపు నివారించబడటమే కాకుండా నిద్రావస్థలో ఉన్న పురుగులు నశిస్తాయి. నేల గుల్లబారి నేల నుండి తడి ఆవిరై, పొడిగా తయారై బెట్ట పరిస్థితులు ఏర్పడతాయి. దీని వల్ల పూత రెమ్మలు త్వరగా ముదిరి, పూతకు సిద్ధమై శాఖీయ పెరుగుదల తగ్గుతుంది. పచ్చిరొట్ట పైర్లు వేసినట్లైతే ఈ మాసంలోనే భూమిలోకి కలియదున్నాలి. ఈ మాసంలో గూడుపురుగు, కొమ్మలను తొలిచే పురుగులు, ఆకులను కత్తిరించే పురుగులు ఆశించకుండా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**జామ:** జామలో నులిపురుగుల నివారణకు ప్రతి చెట్టు పాదులో 40 గ్రా. కార్బోఫ్యూరాన్ 3సిజి గుళికలు లేదా 25 గ్రా. పేసిలోమైసెస్ లిలాసినస్ వేసి నీరు పెట్టాలి. జామలో ఎర్రరంగు మచ్చలు పోషక లోపాన్ని సూచిస్తాయి. నివారణకు ప్రతి మొక్కకు 1 కిలో యూరియా, 0.5 కిలో పొటాష్ వేసుకోవాలి. 15 రోజులకొకసారి సూక్ష్మపోషక మిశ్రమం 5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. ఈ మాసంలో మొదళ్ళలో నీరు నిల్వ ఉండటం వలన వచ్చే ఎండుతెగులు నివారణకు మొదళ్ళలో కార్బండాజిమ్ 1 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి మొదళ్ళు తడిచేటట్లు పోయాలి.

**అరటి:** అరటిలో పొటాష్ ధాతు లోపం వల్ల అరటి ఆకుల అంచుల వెంబడి పసుపు రంగులో మారి, క్రమేపి ఆకు మొత్తం పండిపోయి ఎండిపోవును. నివారణకు మొక్కకు 80 గ్రా. చొప్పున మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను నలభై రోజుల వ్యవధిలో నాలుగు దఫాలుగా వేసుకోవాలి. ఆకులపై 5 గ్రా. సల్ఫేట్ ఆఫ్ పొటాష్‌ను 1 లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**బత్తాయి, నిమ్మ:** ఈ మాసంలో పూత, పిందె, కాయ రాలుటను నివారించుటకు 100 గ్రా. కార్బండాజిమ్, 1 గ్రా. 2,4-డి లేదా 1.5 గ్రా. ప్లానోఫిక్స్‌లను 100 లీ. నీటిలో కలిపి పిచికారి చేయాలి. మంగుని కలుగజేసే నల్లి నివారణకు 1 మి.లీ. స్పైరోమెసిఫిన్ లేదా 3 మి.లీ. డైకోఫాల్ లేదా 2 మి.లీ. ఇథియాన్ లేదా 3 గ్రా. నీటిలో కరిగే గంధకంను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**ద్రాక్ష:** తామర పురుగుల నివారణకు 2 మి.లీ. ఫిప్రోనిల్ లేదా 0.5 గ్రా. థయోమిథాక్సామ్ లేదా 0.3 గ్రా. స్పైనోశాడ్‌ను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**సపోట:** మొగ్గ తొలిచే పురుగులు, ఆకుగూడు పురుగులు లేత చిగురును, పూతను తిని నాశనం చేస్తాయి. నివారణకు క్లోరిపైరిఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**బొప్పాయి:** అధిక వర్షాల వల్ల కాండం మొదలు కుళ్ళిపోయి మొక్కలు వాలిపోతాయి. మొదలు నుండ జిగురు లాంటి ద్రవం కారుతుంది. నివారణకు లీటరు నీటికి 2 గ్రా. మెటలాక్సిల్ కలిపి చెట్ల మొదళ్ళు మరియు కాండాన్ని తడుపుతూ పోయాలి.





**సీతాఫలం:** పిండినల్లి ఆశించకుండా పాదులో 50 గ్రా. క్లోరిపైరిఫాస్ పొడిమందును చల్లుకోవాలి. ప్రతి చెట్టుకి 250 గ్రా. యూరియా, 350 గ్రా. సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 100 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసి తడి పెట్టాలి.

**జీడిమామిడి:** ఈ మాసంలో ప్రతి చెట్టుకు 550 గ్రా. యూరియా, 375 గ్రా. సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 120 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్ చెట్టు మొదలుకు 1.5 మీ. దూరంలో చుట్టూ 15 సెం.మీ. వెడల్పు లోతు గల గాడిని తీసి, ఎరువులను వేసి కప్పవలెను.

**కూరగాయలు:**

**టమాట:** పచ్చదోమ నివారణకు డైమిథోయేట్ మందును 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. తేమతో కూడిన చల్లని వాతావరణంలో ఆకుమాడు తెగులు అధికంగా ఉంటుంది. నివారణకు 2.5 గ్రా. మ్యాంకోజెబ్ లేదా 1 మి.లీ. ప్రొపికొనజోల్ లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.

**వంగ:** మొవ్వు మరియు కాయతొలుచు పురుగు నివారణ కోసం పురుగు ఆశించిన మొవ్వు భాగాన్ని తుంచి వేయాలి. 0.2 మి.లీ. క్లోరాంట్రానిలిప్రోల్ లేదా 0.4 గ్రా. ఇమామెక్టిన్ బెంజోయేట్ లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేయాలి.

**బెండ:** తెల్లదోమ నివారణకు 2 మి.లీ. డైమిథోయేట్ లేదా థయోమిథాక్సామ్ 0.3 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**కాకర:** వర్షంతో కూడిన చల్లని వాతావరణంలో బూజుతెగులు ఆశిస్తుంది. ఆకుల పై భాగాన పసుపు రంగు మచ్చలు, అడుగుభాగాన ఊదా రంగు మచ్చలు, బూజు వంటి పదార్థం ఏర్పడుతుంది. నివారణకు మ్యాంకోజెబ్ 2.5 గ్రా. లేదా మెటలాక్సిల్ ఎమ్‌జెడ్ 2 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**మిరప:** ఆరు వారాల వయస్సు గల మొక్కలను ప్రధాన పొలంలో ఈ మాసంలో నాటుకోవాలి. వర్షాధార పైరుకి 60×15 సెం.మీ. దూరంలో పాదులో రెండు మొక్కలు చొప్పున, నీటి వసతి క్రింద 60×60 సెం.మీ. దూరంలో పాదుకు ఒక మొక్క చొప్పున నాటుకోవాలి.

**కూర మిరప:** కూర మిరపను బహిరంగ ప్రదేశాలలో ఈ మాసంలో నాటుకున్నట్లైతే అధిక దిగుబడులు సాధించవచ్చు.

**క్యాబేజీ:** మధ్యకాలిక క్యాబేజి రకాలను నారుమడిలో విత్తుకొని నారు తయారైన తరువాత ప్రధాన పొలంలో నాటుకోవాలి.

**క్యాలీఫ్లవర్:** క్యాలీఫ్లవర్ శీతాకాలపు పంటను ఈ మాసం నుండి నాటుకోవచ్చు.

**చిక్కుడు:** పొద చిక్కుడు రబీ పంటను ఈ మాసంలో నాటుకోవచ్చు.

పసుపు: దుంప, వేరుకుళ్ళు తెగులు గమనించిన వెంటనే లీటరు నీటికి 2 గ్రా. కాప్టాన్ లేదా 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి తెగులు సోకిన మొక్కల మరియు వాటి చుట్టూ ఉన్న మొక్కల మొదళ్ళు తడిచేలా పోయాలి. ఈ మాసంలో దుంప తొలుచు ఈగ ఆశించే అవకాశం ఉంది. నివారణకు ఎకరాకు 100 కిలోల వేప పిండిని మొక్కల మధ్య వేయాలి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన**
**ఫోన్ నెం.9441168156**



# తల్లిపాలతో శిశువు ఆరోగ్యానికి భరోసా

ఎమ్. హేమలత
డిడిఎస్, కృషి విజ్ఞాన కేంద్రం,
జహీరాబాద్, సంగారెడ్డి



ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఆగస్టు మొదటి వారాన్ని (1-7) తల్లి పాల వారోత్సవాలుగా జరుపుకుంటాము. తల్లి పాల యొక్క ప్రాధాన్యతను చాటి చెప్పడానికి ఈ వారోత్సవాలను జరుపుకుంటాము.

తల్లిపాలు శిశువుల ఆరోగ్యాన్ని మరియు ప్రాణాలను కాపాడడంలో ప్రధాన పాత్రను పోషిస్తాయి. ప్రసవానంతరం కొన్ని గంటల్లో తల్లిపాలు ప్రారంభమవుతాయి. శిశువు పుట్టిన వెంటనే తల్లి నుంచి వచ్చే మొదటి పాలు - 'కొలస్ట్రమ్' లేదా ముర్రుపాలు అంటారు. ఈ పాలల్లో శిశువుకు అమూల్యమైన యాంటీబాడీలు మరియు పోషకాలను అందిస్తుంది. ఇది శిశువు రోగ నిరోధక శక్తిని పెంచి, వ్యాధుల నుండి రక్షిస్తుంది. నవజాత శిష్యుల ఆకలిని బట్టి ప్రతి 2-3 గంటలకు ఒకసారి పాలు ఇవ్వవలసి ఉంటుంది.

తల్లి పాలల్లో పోషకాలు అధికంగా ఉంటాయి. శిశువు జీవితంలో మొదటి 6 నెలలు అవసరమైన మొత్తం శక్తిని మరియు పోషకాలను తల్లిపాలు అందిస్తాయి. 6-12 నెలల శిశువు యొక్క పోషక అవసరాల్లో సగం లేదా అంతకంటే ఎక్కువను అందిస్తుంది, మరియు రెండవ సంవత్సరంలో సుమారు 1/3 వరకు పోషణ అవసరాన్ని తీరుస్తుంది. ఆరు నెలల పాటు పూర్తిగా తల్లిపాలు మాత్రమే ఇవ్వడం, 6 నెలల తర్వాత సురక్షితమైన పోషకాహారాన్ని అందిస్తూ రెండేళ్ల వరకు తల్లిపాలను కొనసాగించడం అనేది శిశువుల ప్రాణరక్షణ మరియు ఆరోగ్యవృద్ధికి సహాయపడుతుంది. తల్లిపాలు సురక్షితంగా మరియు శుభ్రంగా ఉండడం వలన ఇన్ఫెక్షన్లు, అతిసారం వంటి సమస్యలు పిల్లల్లో రావు. తల్లి పాలు ఇచ్చేటప్పుడు, ముందుగా ఒక రొమ్ము పాలు ఇవ్వడం పూర్తి అయిన తర్వాతనే ఇంకో రొమ్ము పాలు ఇవ్వాలి. ఇలా చేయడం వల్ల బిడ్డకు మొదటగా మరియు చివరగా వచ్చే పాలు రెండూ సంపూర్ణంగా అందుతాయి. ఈ రెండు రకాల పాలు బిడ్డ ఎదుగుదలకు అవసరం. మొదట వచ్చిన పాలు పల్చగా ఉండి బిడ్డను హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. అయితే తర్వాత వచ్చిన పాలల్లో ఫ్యాట్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. ఇది పిల్లల బరువు పెరుగుదలకు ఎంతగానో సహాయపడుతుంది.

పోత పాలు తాగిన పిల్లల కంటే తల్లిపాలు తాగిన పిల్లలు, మేధస్సు పరీక్షల్లో మెరుగైన ఫలితాలను సాధిస్తారు, భవిష్యత్తులో స్థూలకాయం లేదా మధుమేహం వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయి.

పాలు ఇచ్చే తల్లులు బరువు త్వరగా తగ్గుతారు. అంతేకాకుండా, గర్భాశయం త్వరగా సాధారణ స్థితికి రావడంలో సహాయపడుతుంది. బ్రెస్ట్ క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ రిస్క్ కూడా తక్కువవుతుంది. తల్లి బిడ్డకు పాలు ఇవ్వడం వలన వారిద్దరి మధ్య బంధం బలపడుతుంది. శిశువు భావోద్వేగాలు కూడా బాగా బలపడతాయి.

ప్రతి తల్లి పాలు ఇవ్వడం వల్ల పిల్లల ఆరోగ్య భవిష్యత్తుకు బలమైన పునాదిని అందిస్తుంది. కాబట్టి తల్లి బిడ్డకు పాలు ఇవ్వడాన్ని అందరం ప్రోత్సహిద్దాం.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9542770314

# మిరపలో నల్ల తామర పురుగుల సమగ్ర యాజమాన్యం

డా॥ డి. అనిత కుమారి, డా॥ వి. సురేష్, డా॥ ప్రీతమ్ గౌడ్, డా॥ బి.యస్.కె. నిఖిల్ మరియు డి. వెంకటేష్
కూరగాయల పరిశోధన స్థానం, శ్రీ కొండాలక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్



భారతదేశంలో ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు వంటి ప్రాంతాల్లో మిరపను వాణిజ్య పంటగా ఎక్కువగా సాగుచేస్తున్నారు. మిరపకాయలలోని ఘాటు (కారం), క్యాప్సైసిన్ అనే పదార్థం వలన వస్తుంది. క్యాప్సైసిన్ జీర్ణక్రియను మెరుగుపరచడానికి మరియు ఇతర ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉండటానికి సహాయపడుతుంది. మిరప అనేది మన దినచర్యలో ముఖ్యమైన మసాలా పదార్థాలలో ఒకటి. ఇది ప్రపంచంలో అత్యంత ప్రాచుర్యం పొందిన కూరగాయలలో ఒకటి, ముఖ్యంగా ఆహారాలలో రుచిని కలిగించడంలో ఉపయోగిస్తారు.

భారతదేశంలో 2023-24 సంవత్సరంలో తెలంగాణ మిరప సాగు విస్తీర్ణంలో (3.92 లక్షల ఎకరాలు) మూడవ స్థానంలో మరియు ఉత్పత్తి (7.94 లక్షల టన్నులు ఉత్పత్తి) మరియు ఉత్పాదకతలో (2021 కిలోల ఉత్పాదకత) రెండవ స్థానంలో నిలిచింది. మిరప పంటను పండించే ప్రధాన జిల్లాలు ఖమ్మం, మహబూబాబాద్, గద్వాల్, సూర్యాపేట మరియు వరంగల్ (గ్రామీణ) లలో ఎక్కువగా సాగు చేస్తున్నారు.

ఈ మధ్య కాలంలో మిరపలో చీడపీడలు ఎక్కువగా నష్టపరుస్తునాయి. వీటిలో నల్ల తామర పురుగులు మిరప పంటకు గణనీయమైన నష్టాన్ని కలిగిస్తున్నాయి. వీటి ఉధృతిని తగ్గించడానికి సమగ్ర యాజమాన్య పద్ధతులను అనుసరించడం చాలా ముఖ్యం.

సాధారణంగా మిరపలో వచ్చే తామర పురుగులు కాకుండా గతమూడు సంవత్సరాల నుండి కొత్త రకం తామర పురుగులు మిరప తోటలని ఆశించి తీవ్ర నష్టం కలుగజేస్తున్నాయి.

**పురుగు:** నల్ల తామర పురుగులు చాలా చిన్నవిగా (1-2 మి.మీ. అంత కన్నా తక్కువ), సన్నగా, ముదురు గోధుమ రంగు నుండి నలుపు రంగులో ఉంటాయి. వీటి రెక్కల అంచుల వెంబడి చిన్న వెంట్రుకలు ఉంటాయి. తల్లి పురుగులు ఆకుల ఈనెల్లో గుడ్లను పెడతాయి. గుడ్ల నుండి పిల్ల పురుగులు బయటకు వచ్చి మొక్కలకు నష్టం కలిగిస్తాయి. పిల్ల పురుగులు, పెద్ద పురుగులు రెండు మొక్కల రసాన్ని పీల్చుతాయి. ఈ కొత్త రకం తామర పురుగులు మొదట 2015 సంవత్సరంలో మన దేశానికి ఇండోనేషియా నుంచి వచ్చాయి. మన దేశం లో మొదటగా కర్ణాటకలో బొప్పాయి పంటలో త్రిప్స్ పార్విస్పైనస్ బెంగుళూరులో గుర్తించబడింది. తర్వాత తెలంగాణ లో 2021 లో మిరప పంటపై ఆశించి నష్టం కలుగచేస్తున్నాయి. తర్వాత ప్రతి సంవత్సరం ఈ పురుగు ఆశించడం వలన మిరప రైతులు చాలా నష్టపోతున్నారు.

**నష్టం కలిగించే విధానం మరియు లక్షణాలు:** నల్ల తామర పురుగులు ముఖ్యంగా మిరప మొక్కలోని లేత ఆకులు, మొగ్గలు, పూలు మరియు లేత కాయల నుండి రసాన్ని పీలుస్తాయి. దీనివల్ల మొక్కలలో అనేక లక్షణాలు కనిపిస్తాయి.

**ఆకులపై ప్రభావం:**

- లేత ఆకులు చిన్నవిగా మారి, పైకి ముడుచుకొని పడవ ఆకారంలోకి మారుతాయి (దీనిని సాధారణంగా “పై ముడత” అంటారు).
- ఆకులు పాలిపోయి, లేత ఆకుపచ్చ రంగులోకి మారతాయి.
- ఆకుల అడుగు భాగంలో, పురుగులు రసాన్ని పీల్చిన ప్రాంతంలో వెండి లేదా కాంస్య రంగు మచ్చలు కనిపిస్తాయి.
- పురుగు తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు ఆకులు ఎండిపోయి రాలిపోతాయి.
- కొన్ని సందర్భాల్లో, ఆకులు పెళుసుగా మారి, అడుగున పొక్కులు కనిపిస్తాయి.

**పూలు మరియు కాయలపై ప్రభావం:**

- తామర పురుగులు ఆశించిన పూల మొగ్గలు పెళుసుగా మారి రాలిపోతాయి.

- పువ్వులు గోధుమ రంగులోకి మారి రాలిపోవడం వల్ల పూత నిలబడదు, కాయలు ఏర్పడవు.
- పూత మరియు కాయలు ఏర్పడడం పూర్తిగా ఆగిపోవచ్చు.
- కాయలపై చిన్న లేత గోధుమ రంగు మచ్చలు మరియు గీతలు ఏర్పడతాయి.
- కాయలు గిడసబారి, వికృత రూపంలోకి మారి, ఇటుక రంగులోకి మారుతాయి. వాటి మార్కెట్ విలువ తగ్గుతుంది.

**మొక్క పెరుగుదలపై ప్రభావం:**

- మొక్కల పెరుగుదల కుంటు పడుతుంది.
- కణుపుల మధ్య దూరం తగ్గుతుంది.
- పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు మొక్క మొత్తం ఎండిపోయి క్రమేపి చనిపోతుంది.

**వ్యాప్తికి కారణాలు మరియు అనుకూల పరిస్థితులు:**

- ఈ పురుగులు పొడి వాతావరణంలో, తేమ శాతం ఎక్కువగా ఉన్నప్పుడు వీటి ఉధృతి ఎక్కువగా ఉంటుంది.
- నేలలో నత్రజని అధికంగా ఉన్నప్పుడు ఈ పురుగు తీవ్రత పెరుగుతుంది.
- కలుపు మొక్కలు ఈ పురుగులకు ఆవాసాలుగా పనిచేస్తాయి.
- మిరపలో వచ్చే 'ఆకు ముడత వైరస్' వ్యాప్తికి తామర పురుగులు వాహకాలుగా పనిచేస్తాయి.

**మిరప పంటలో నల్ల తామర పురుగుల పర్యవేక్షణ:**

- ప్రధాన పొలంలో నాటిన 5 రోజుల తర్వాత నల్ల తామర పురుగుల ఉనికిని పర్యవేక్షించాలి.
- పుష్పించే ముందు దశలో ఆకుల దిగువ భాగంలో మరియు తరువాతి దశ పువ్వులలో నల్ల తామర పురుగులను గమనించాలి.

**పర్యవేక్షణ పద్ధతి:** ప్రధాన పొలంలోని వివిధ ప్రాంతాల నుండి 10 మొక్కల భాగాలను తెల్ల కాగితంపై దులిపి, నల్ల తామర పురుగులను లెక్కించాలి.

- ఎకరానికి 5 నీలి రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేయాలి.
- ఒక మొక్కకు 5-10 నల్ల తామర పురుగులు ఉన్నపడు తగిన చర్యలను ప్రారంభించాలి. ఆకుల దిగువ భాగంలో కాంస్య వర్ణంలో మరియు ఆకు ముడతలను పర్యవేక్షించాలి.

**సమగ్ర యాజమాన్య పద్ధతులు:**

నల్ల తామర పురుగుల నియంత్రణకు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు క్రింద తెలుపబడినవి.

**1. భౌతిక, సేద్య మరియు జీవ నియంత్రణ యాజమాన్య పద్ధతులు:**

- మిరప నారును ఆగస్టు మొదటి వారంలో నాటుకోవాలి.
- మిరప నారును ప్రధాన పొలంలో దగ్గర దగ్గరగా నాటుకోవద్దు.
- ప్రతి ఎకరాకు 1 టన్ను పశువుల ఎరువు (ఎఫ్‌వైఎమ్)ను, 2 కిలోల మేటరైజియం అనిసోపిలె లేదా సుడోమోనాస్ ఫ్లూరెన్‌సెన్ మరియు 200 కిలోల వేప పిండిని నాటే సమయంలో ప్రధాన పొలంలో వేసుకోవాలి.
- వెండి రంగు ప్రతిబింబించే పాలిథీన్ మల్చ్‌ని ఉపయోగించాలి.

**నీటి యాజమాన్యం:** మొక్కలను బెట్టకు గురి చేయకుండా ఎప్పటికప్పుడు నీటి తడులు ఇవ్వాలి. భూమిలో తేమ ఉంటే పురుగు ఉధృతి తగ్గుతుంది.

**పంట అవశేషాలను కాల్చివేయాలి:** పంట కోత తర్వాత పొలంలో మిగిలిపోయిన అవశేషాలను కాల్చివేయడం వలన పురుగుల కోశస్థ దశలు నాశనం అవుతాయి.

**కలుపు మొక్కల నివారణ:** పంట పొలాల గట్లపై వయ్యారిభామ, తుత్తురు బెండ, రైలు కంప, జిల్లేడు వంటి కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి. ఈ మొక్కలు మిరప పంట లేనప్పుడు తామర పురుగులకు ఆశ్రయం కల్పిస్తాయి.

**అంతర పంటలు:** మిరప:జొన్న/మొక్కజొన్న:అలసంద లతో 10:3:1 నిష్పత్తిలో అంతర పంటలు వేసుకోవడం ద్వారా మిత్ర పురుగుల సంఖ్య పెరుగుతుంది, తద్వారా నల్లతామర పురుగుల ఉధృతి తగ్గుతుంది.

**వేసవిలో లోతు దుక్కులు:** వేసవిలో పొలాన్ని లోతుగా దున్నుకోవడం వల్ల మట్టిలో ఉండే తామర పురుగుల కోశస్థ దశలు సూర్యరశ్మికి నాశనం అవుతాయి.

**అంతరకృషి:** తామర పురుగులు మట్టిలో, రాలిన ఆకులలో కోశస్థ దశను గడుపుతాయి. కాబట్టి, సాళ్ళ మధ్య తరచు అంతరకృషి చేయడం వల్ల కోశస్థ దశలు సూర్యరశ్మికి గురై చనిపోతాయి.

**నత్రజని ఎరువుల నియంత్రణ:** నత్రజని ఎరువులను మోతాదుకు మించి వాడకూడదు, ఇది పురుగుల ఉధృతిని పెంచుతుంది.

**జిగురు అట్టలు:** ఎకరానికి 25-35 నీలి రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలి. ఇవి తామర పురుగులను ఆకర్షించి, వాటి సంఖ్యను తెలుసుకోవడానికి, కొంతవరకు నియంత్రించడానికి సహాయపడతాయి.

**వేప పిండి:** ప్రధాన పొలంలో ఎకరానికి 200 కిలోల వేప పిండిని వేసుకోవడం వలన తామర పురుగుల సంఖ్యను నియంత్రించవచ్చు.

**వేప నూనె:** 5 శాతం వేపగింజల కషాయం లేదా వేప నూనెను (10,000 పిపియం) 3 మి.లీ. లీటరు నీటికి పిచికారీ చేయడం వల్ల పురుగు ఉధృతిని తగ్గించవచ్చు. వేప కషాయం పురుగులు ఆహారాన్ని తీసుకోలేక చనిపోవడానికి, గుడ్లు పెట్టే శక్తిని తగ్గించడానికి సహాయపడుతుంది.

**జీవ నియంత్రణ:** లెకానిసిలియం లెకాని లేదా మేటరైజియం అనిసోపిలె వంటి శిలీంధ్ర ఆధారిత పురుగు మందులను (5 గ్రాములు లీటరు నీటిలో కలిపి) చల్లని వాతావరణంలో పిచికారీ చేయాలి.

- పురుగు ఆశించిన ప్రారంభదశలో, ఆంథోకోరిడ్ ప్రెడేటర్‌ను 5–10 పెద్ద పురుగులను/చదరపు మీటరుకు వారానికి (ఐదు సార్లు) విడుదల చేయాలి.

**2. రసాయన నియంత్రణ పద్ధతులు:**

పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు రసాయన మందులను వాడాల్సి వస్తుంది. అయితే మందులను మార్చి మార్చి వాడాలి, లేనిచో రసాయనిక నిరోధకత పెరిగి పురుగుమందులు పనిచేయవు కాబట్టి సిఫారసు చేసిన మోతాదులోనే వాడాలి.

**కొన్ని సిఫార్సు చేయబడిన పురుగుమందులు:**

- ఫిప్రోనిల్ 5% ఎస్.సి 2 మి.లీ. లీటరు
- స్పైనోసాడ్ 45% ఎస్.సి 0.3 మి.లీ. లీటరు
- బ్రొఫ్లనిలైడ్ 30 ఎస్‌సి 0.16 మి.లీ. లీటరు
- ఫ్లక్సమెటమైడ్ 10 ఇసి 0.8 మి.లీ. లీటరు
- టోల్ఫెన్పిరాడ్ 15 ఇసి 2 మి.లీ. లీటరు
- సయాంట్రానిలిప్రోల్ 10.26% ఓడి 1.2 మి.లీ. లీటరు
- స్పైనటోరం 11.70% ఎస్‌సి 1 మి.లీ. లీటరు
- ఎసిటామిప్రిడ్ 20% ఎస్‌పి 0.2–0.25 గ్రా. లీటరు
- స్పైరోటేట్రామేట్ 15.31% డబ్ల్యు/డబ్ల్యు ఓడి 0.8 మి.లీ. లీటరు
- ఫిప్రోనిల్ + ఇమిడాక్లోప్రిడ్ 0.2 గ్రా. లీటరు
- ఐసోసైక్లోసిరం 9.2% డబ్ల్యు/డబ్ల్యు డిసి 10% డబ్ల్యు/వి డిసి 0.8 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**ముఖ్య సూచనలు:**

- మందుల దుకాణంలో, వ్యవసాయ నిపుణుల సలహా మేరకు సరైన మందులను ఎంచుకోవడం మరియు మోతాదును పాటించడం ముఖ్యం.
- సాయంత్రం వేళల్లో పిచికారీ చేయాలి.
- రైతులందరూ సామూహిక సమగ్ర సస్యరక్షణ చర్యలను చేపట్టినట్లయితేనే ఈ పురుగు ఉధృతిని నివారించవచ్చు.

ఈ సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా మిరప పంటను నల్ల తామర పురుగుల బారి నుండి రక్షించుకోవచ్చు.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9440162396**

**ఆగష్టు 2025 మాసంలో పి.జె.టి.ఏ.యు. వారి అగ్రికల్చర్ వీడియో యూట్యూబ్ ఛానల్‌లో అప్‌లోడ్ చేసిన నూతన వీడియోలు**

| క.సం. | తేది | అంశం |
|---|---|---|
| 1. | 02.08.2025 | వరి పంటలో సస్యరక్షణ |
| 2. | 02.08.2025 | ప్రత్తి పంటలో సస్యరక్షణ |
| 3. | 07.08.2025 | వానాకాలం పెసర, మినుములో సస్యరక్షణ |
| 4 | 11.08.2025 | 55వ స్నాతకోత్సవం – ఫోటోలు |
| 5 | 14.08.2025 | పాడి పశువులలో వచ్చే పొదుగువాపు వ్యాధి చికిత్స |
| 6 | 18.08.2025 | Inaugural Lecture on Growing Leaders in Agri Food Systems : Essential Skills and Strategies |
| 7 | 20.08.2025 | మొక్కజొన్నలో బ్యాక్టీరియా కాండం కుళ్ళు తెగులు – నివారణ |
| 8 | 25.08.2025 | 55వ స్నాతకోత్సవం – ఎడిటెడ్ వీడియో |

# పాడి పశువుల మేతలో విటమిన్ 'ఎ' ఆవశ్యకత

డా॥ జె. శశాంక్ మరియు డా॥ ఎమ్. ఫిబి రాణి
పశు వైద్య కళాశాల, పి.వి. నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం, కోరుట్ల





విటమిన్ 'ఎ' ప్రధానంగా రెండు రూపాలలో శరీరానికి అందుబాటులోకి వస్తుంది. మొదటిది రెటినాల్, రెండవ రూపం బీటాకెరోటిన్. పచ్చిగడ్డి సమృద్ధిగా లభించినపుడు పశువులకు విటమిన్ 'ఎ' కెరోటిన్ రూపంలో అందుబాటులోకి వస్తుంది.

**విటమిన్ 'ఎ' వలన పశువులకు ఉపయోగాలు**

వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది. అందువలన దీనిని వ్యాధినిరోధక శక్తినివ్వగల విటమిన్ అంటారు. సంతానోత్పత్తి మామూలుగా జరగడానికి ఉపయోగపడుతుంది. ఎముకలలో ఉన్న కణాల పెరుగుదలను క్రమబద్ధీకరించి సక్రమంగా పెరుగుదలకు ఉపయోగపడుతుంది. పిండిపదార్థాలు సక్రమంగా అరుగుదలకు సహాయపడుతుంది. మూత్రాశయంలోగాని, మూత్రనాళాలలోగాని లేదా మూత్రపిండాలలో గాని రాళ్ళు ఏర్పడకుండా నివారించగలుగుతుంది. మూత్రాశయంలో గాని, మూత్రపిండాలలోగాని మూత్రనాళాలలోగాని పైపొర (ఎపితీలియం) దెబ్బతినడం వలన సాధారణ విసర్జన క్రియకు పశువులలో అంతరాయం ఏర్పడుతుంది. పైపొర గట్టిపడినపుడు లోపలి కణాలు విడిపోయి అవి కేంద్రాలుగా ఏర్పడుతాయి. దానిచుట్టూ కొన్ని రకాల లవణాలు ఏర్పడి రాళ్ళుగా మారి మూత్రపిండాలలోను, మూత్రాశయంలోను లేదా మూత్రనాళాలలోను తయారవుతాయి. మ్యూకస్ పొర రక్షణకు విటమిన్ 'ఎ' ఎంతో ఉపయోగపడుతుంది. ఎముకల పెరుగుదలకు చాలావరకూ ఉపయోగపడుతుంది. కళ్ళు ఆరోగ్యకరంగా ఉంచడానికి ఉపయోగపడుతుంది. కంటి లోపలి భాగంలో ఉన్న రెటీనా లోపల ఉన్న రాడ్సుకు మసక చీకటిగా ఉన్నపుడు వెలుతురును గ్రహించే శక్తి ఉంటుంది. రెటీనా లోపలి భాగంలో ఉన్న రాడ్సులో రోడోప్సిన్ అను రసాయనం అందుబాటులో ఉంటుంది. కళ్ళకు వెలుతురు తగిలినపుడు రోడోప్సిన్ అను రసాయనిక పదార్థం రెటినిన్ గాను ఒప్సిన్ గాను విడిపోతుంది. చీకటి పరిస్థితులు ఏర్పడినపుడు రెటినిన్ మరియు ఒప్సిన్ కలసి రోడొప్సిన్గా మారుతాయి. చీకటిలో చూడాలనుకున్నపుడు రెటినిన్ సహాయపడుతుంది. 'రెటినిన్' పెరిగినపుడు, రక్తంలో విటమిన్ ఎ లభ్యత తక్కువగా ఉన్నపుడు దానిని భర్తీ చేయడానికి రక్తంలో అందుబాటులో ఉన్న విటమిన్ 'ఎ' ఖర్చవుతుంది. రక్తంలో తగినంత విటమిన్ ఎ లేకపోయినపుడు రెటినిన్ మరియు ఒప్సిన్ కలవక రోడోప్సిన్ తయారు కాదు. అటువంటి పరిస్థితులలో చీకటిలో చూడడానికి వీలుకాదు. పచ్చిమేత తినిపించినపుడు విటమిన్ 'ఎ' లభ్యత పెరుగుతుంది.

విటమిన్ 'ఎ' దంతములు ఏర్పడటానికి, ఎముకల ఎదుగుదలకు అవసరం. దూడలలో కంటినరం చుట్టూ ఉన్న ఎముకల పెరుగుదల సక్రమంగా లేనపుడు కంటినరానికి ఎక్కువ ఒత్తిడి కలిగి, దూడలలో చూపు తగ్గిపోతుంది. గర్భాశయం పునరుత్పత్తికి సంబంధించినంత వరకూ పశువులలో విటమిన్ 'ఎ' చాలా అవసరం. ఇది ఆవులకు, ఆబోతులకు అన్వయిస్తుంది. విటమిన్ 'ఎ' తక్కువైనపుడు ఆబోతులలోని వృషణాలలోని

వీర్యకణాలు ఉత్పత్తి చేసే బీజం పైపొర దెబ్బతిని వీర్యకణ ఉత్పత్తి తగ్గుతుంది. అందువలన ఆబోతులు సంతానోత్పత్తికి పనికిరావు. ఆవులు, గేదెలలో గర్భాశయం యొక్క పైపొర ముఖ్యంగా యోని గట్టిపడటం వలన సరిగా ఎదకు రాకపోవడం, ఎదకు వచ్చినా సకాలంలో గర్భధారణ జరుగకపోవటం జరుగుతుంది. చూలు నిలువదు. విటమిన్ 'ఎ' లోపించినపుడు చూలు నిలిచినా కూడా ముందుగా ఈని బలహీనమైన దూడలు పుడతాయి. ఈనడానికి కొంతకాలం ముందుగా ఈని చనిపోయిన దూడలు పుట్టడం జరుగుతుంది. దీనికి మావి క్షీణించడం ప్రధాన కారణంగా చెప్పవచ్చును. చనిపోయిన దూడ పుట్టడమే కాకుండా మాయవేయక పోవడం జరుగుతుంది. తరువాత ఎదకు రావడం ఆలస్యమవుతుంది. దూడలలో పెరుగుదల తగ్గడం, తెల్లగా పారడం, ఎముకల పెరుగుదల సక్రమంగా లేకపోవడం జరుగుతుంది. అండం విడుదల కాని పరిస్థితులు ఏర్పడవచ్చు. ఆవులలోను, గేదెలలోను అండకోశం సరిగా పనిచేయదు. పరిమాణం తగ్గుతుంది. చర్మం దళసరిగా తయారవడం, బలహీనంగా, నీరసంగా ఉండటం, ఆకలి మందగించడం, కళ్ళ నుండి నీరు ఎక్కువగా కారడం వంటి పరిస్థితులు ఆవులు, గేదెలలో కొన్ని కారణాలుగా చెప్పవచ్చును.

### పశువులలో విటమిన్ 'ఎ' లోపం ఏర్పడటానికి కారణాలు

దాణాలో సరైన మోతాదులో విటమిన్ 'ఎ' ఇవ్వకపోవడం, పేగులకు సంబంధించిన వ్యాధులు ఎక్కువ కాలం ఉన్నప్పుడు, సకాలంలో వైద్య సహాయం చేయకపోవడం, కార్జానికి సంబంధించిన రోగాలు తరచుగా రావడం, పచ్చిమేత సిఫారసు మేర ఉపయోగించకపోవడం.

### పశువులకు కావలసిన విటమిన్ 'ఎ'

పెరిగే పశువులకు, పెయ్యలకు ప్రతికిలో బరువుకు 3.8 నుండి 6.5 మి. గ్రా., చూడి పశువులకు ప్రతికిలో బరువుకు 12.7 నుండి 14.4 మి. గ్రా., ఆంబోతులకు ప్రతికిలో బరువుకు 7.3 నుండి 8.2 మి. గ్రా. అవసరం ఉంటుంది. ప్రతి మిల్లీగ్రాము కెరోటిన్ లో 400 యూనిట్ల విటమిన్ ఎ అందుబాటులో ఉంటుంది.

### విటమిన్ 'ఎ' లభ్యత

పచ్చగడ్డి సమృద్ధిగా లభించినపుడు విటమిన్ ఎ పశువులకు కెరోటిన్ రూపంలో అందుబాటులో ఉంటుంది. వాణిజ్యపరంగా విటమిన్ ఎ వీటాబ్లెండ్, ప్రిపాలిన్ యఫ్ 40 రూపంలో పశువుల వయస్సును బట్టి సిఫారసుమేర దాణాలో కలిపి ఇవ్వవచ్చు.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. **9866922336**

**సెప్టెంబర్ 2025లో పి.జె.టి.ఎ.యు వారి రేడియో కార్యక్రమం చేనుకబుర్లు ప్రతి బుధవారం మధ్యాహ్నం 1:30 నుండి 1:50 వరకు ఆకాశవాణి, హైదరాబాద్-ఏ స్టేషన్ నుంచి ప్రసారమవుతుంది.**

| తేది | అంశం |
|---|---|
| 03.09.2025 | సుస్థిర వ్యవసాయం |
| | అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ ప్రాముఖ్యత |
| 10.09.2025 | మిరపలో చీడపీడల నివారణ |
| | ఇంటి చిట్కాలతో వర్షాకాలం వ్యాధులకు చెక్ |
| 17.09.2025 | వేసవిలో వేరుశనగ సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు |
| | ఫోలిక్ యాసిడ్ యొక్క ప్రాముఖ్యత – గర్భిణీ మరియు బాలింత స్త్రీలకు |
| 24.09.2025 | ఆహార భద్రత ప్రమాణాలకు సంబంధించి నియమాలు, నిబంధనలు మరియు |
| | లైసెన్సింగ్ (ఎఫ్.ఎస్.ఎస్.ఎ.ఐ. రూల్స్, రెగ్యులేషన్స్ & లైసెన్సింగ్) |
| | మహిళలో మానసిక ఆరోగ్యం – ఒత్తిడి, నిరాశ ఎదుర్కోవడానికి వ్యూహాలు |

# టి.వి. ఛానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు

డా॥ యం. శ్రీనివాసులు మరియు డా॥ జె.ఎస్. సుధా రాణి
ఎలక్ట్రానిక్ వింగ్, రాజేంద్రనగర్, హైదరాబాద్

**రైతు వేదికల వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా శాస్త్రవేత్తల - రైతుల ముఖాముఖి - సెప్టెంబర్ 2025**

| క్రమ సంఖ్య | తేది | అంశము | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|---|
| ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు వ్యవసాయశాఖ వారు సంయుక్తంగా నిర్వహిస్తున్న "రైతు నేస్తం" | | | |
| 1 | 02.09.2025 | వివిధ పంటలలో పైపాటుగా వాడదగిన కలుపు మందులు - విశ్లేషణ | **డా॥ బి. పద్మజ,** ప్రధాన శాస్త్రవేత్త & హెడ్<br>ఎ.ఐ.సి.ఆర్.పి. ఆన్ వీడ్ మెనేజ్‌మెంట్, రాజేంద్రనగర్<br>ఫోన్ నెం. 9440040605, 8333818242 |
| | | తెలంగాణలో డ్రాగన్ ఫ్రూట్ సాగు - పాటించవలసిన మెళకులవలు | **డా॥ పి. హరికాంత్,** శాస్త్రవేత్త (హార్టికల్చర్)<br>ఫల పరిశోధన స్థానం, సంగారెడ్డి, ఫోన్ నెం. 9440091020 |
| 2 | 09.09.2025 | డిజిటల్ వ్యవసాయం - ఉపయోగాలు | **డా॥ జి. వెంకటేశ్వర్లు,** యం.డి., అగ్రి హబ్<br>పి.జె.టి.ఎ.యు., రాజేంద్రనగర్, ఫోన్ నెం. 9599766313 |
| | | లాభాసాటి గొర్రెల మరియు మేకల పెంపకం - ఎంపిక చేసుకోవడంలో మెళకువలు | **డా॥ ఎ. అనిల్ పవన్ కుమార్,** ప్రొఫెసర్ (ఎ.జి.బి.)<br>పౌల్ట్రీ రీసెర్చ్ సెక్షన్, రాజేంద్రనగర్,<br>ఫోన్ నెం. 8332926336 |
| 3 | 16.09.2025 | వానాకాలం వరిలో సస్యరక్షణ | **డా॥ ఐ. అరుణ శ్రీ,** శాస్త్రవేత్త (ఎంటమాలజీ)<br>వరి పరిశోధన విభాగం, ఎ.ఆర్.ఐ., రాజేంద్రనగర్<br>ఫోన్ నెం. 9701051104 |
| 4 | 23.09.2025 | మిరప సాగులో సస్యరక్షణ | **డా॥ జె. హేమంత్ కుమార్,** అసోసియేట్ డీన్<br>వ్యవసాయ కళాశాల, అశ్వారావుపేట,<br>ఫోన్ నెం. 8332970374 |
| | | పశువుల ఆరోగ్యం కోసం టీకాలు - అవశ్యకత | **డా॥ కె. కవిత,** అసోసియేట్ ప్రొఫెసర్<br>డిపార్ట్‌మెంట్ ఆఫ్ వెటర్నరీ,<br>మైక్రోబయాలజీకాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్, రాజేంద్రనగర్,<br>ఫోన్ నెం. 9849381845 |
| 5 | 30.09.2025 | యాసంగి పంటల ప్రణాళిక | **డా॥ యం. గోవర్ధన్,** అసోసియేట్ డీన్<br>వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్,<br>ఫోన్ నెం.: 8332970372 |
| | | టమాట, వంగలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు | **డా॥ షాహనాజ్,** అసోసియేట్ ప్రొఫెసర్<br>ఉద్యాన కళాశాల శ్రీ కొండలక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చర్ యూనివర్శిటీ, మొజర్ల, ఫోన్ నెం.: 7683053157 |



# రైతన్నకో ప్రశ్న...

డా॥ ఆర్. సునీత దేవి మరియు డా॥ సి. పద్మవేణి
వ్యవసాయ సమాచార ప్రసార మరియు ముద్రణాలయం, రాజేంద్రనగర్, హైదరాబాద్

**1. పంట పొలాల్లో పురుగుమందుల పిచికారికి తైవాన్ పంపును ఉపయోగించినప్పుడు ఒక ఎకరానికి ఎన్ని లీటర్ల మందు ద్రావణాన్ని వాడాలి?**

ఎ) 100 లీ. బి) 200 లీ.
సి) 80 లీ. డి) 400 లీ.

**2. భారతదేశంలో నిషేధించబడిన సస్యరక్షణ మందుల సమాచారం క్రింద తెలిపిన ఏ వెబ్‌సైట్‌లో ఉంటుంది?**

ఎ) www.insecticidesindia.com
బి) www.cibrc.nic.in
సి) www.chemicab.gov.in
డి) www.cib.gov.in

**3. జాతీయ అరటి పరిశోధన కేంద్రం (ఎన్ఆర్‌సిబి) ఎక్కడ ఉన్నది?**

ఎ) ట్రిచీ బి) మధురై
సి) కోయంబత్తూర్ డి) చెన్నై

**4. నూనెగింజల పంటల్లో ఈ క్రింద పేర్కొన్న ఏ ఎరువు వాడడం వలన నూనెశాతం పెరుగుతుంది?**

ఎ) డిఎపి బి) జింక్ సల్ఫేట్
సి) జిప్సం డి) మ్యూరేట్ ఆఫ్ పొటాష్

**5. ప్రత్తి పంటలో పైపాటుగా క్రింద తెలిపిన ఏ ఎరువును వాడరాదు?**

ఎ) డిఎపి బి) 20:20:0:13
సి) మ్యూరేట్ ఆఫ్ పొటాష్ డి) ఎ & బి

**6. వరిలో సుడిదోమ ఉధృతిని నివారించాలంటే ఎలాంటి యాజమాన్య పద్ధతులను ఆచరించాలి?**

ఎ) ప్రతి 2 మీ.లకు 20 సెం.మీ. కాలిబాటలు తీయటం
బి) నత్రజని ఎరువులను దఫదఫాలుగా వేయటం
సి) సరియైన పురుగుమందులను పిచికారి చేయడం
డి) పైవన్నీ

**7. వానాకాలంలో రాగి పంటను ఎప్పటి వరకు వేసుకోవచ్చును?**

ఎ) జూన్ చివరి వరకు బి) జూలై చివరి వరకు
సి) ఆగష్టు చివరి వరకు డి) ఏదీకాదు

**8. ప్రత్తిలో తొలిదశలో (30,45 మరియు 60 రోజులకు) కాండంపై మందు పూత (బొట్టు పెట్టే పద్ధతి) వలన కలిగే ప్రయోజనాలు ఏమిటి?**

ఎ) రసంపీల్చే పురుగులను నివారించడం
బి) తక్కువ ఖర్చు పద్ధతి
సి) మిత్ర పురుగులు సంరక్షించబడతాయి
డి) పైవన్నీ

**9. ఈ క్రింది వాటిలో గడ్డిజాతి పశుగ్రాసాలు ఏవి?**

ఎ) బాజ్రా నేపియర్ హైబ్రిడ్లు
బి) పారాగడ్డి
సి) అంజన్ గడ్డి
డి) పైవన్నీ

**10. చెఱకులో గడ్డి దుబ్బు తెగులు లక్షణాలు ఎలా ఉంటాయి?**

ఎ) తెగులు సోకిన మొక్కల మొదళ్ళ నుండి సన్నని, కురచగా ఉన్న తెల్లని పిలకలు ఎక్కువగా వస్తాయి
బి) ఆకులు పాలిపోయి చాలా చిన్నవిగా ఉండి మొక్కలు గడ్డి మబ్బుల వలే ఉంటాయి
సి) పై రెండూ
డి) ఏదీకాదు

పై ప్రశ్నలకు సమాధానాలు 50వ పేజీలో చూడవచ్చు

## ఘనంగా నిర్వహించిన ప్రొ॥ జయశంకర్ జయంతి ఉత్సవాలు

తెలంగాణ స్వరాష్ట్ర స్థాపకుడు, సిద్ధాంతకర్త, ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతిని 06.08.2025న విశ్వవిద్యాలయ పరిపాలనా భవనంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జయశంకర్ చిత్రపటానికి రిజిస్ట్రార్ డా॥ జి.ఇ.సి.హెచ్. విద్యాసాగర్ పూలు అర్పించి, ఘనంగా శ్రద్ధాంజలి ఘటించి, మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం విజయవంతమై ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాకారం కావడానికి, జయశంకర్ గారు కారణమని అభిప్రాయపడ్డారు. అటువంటి నిస్వార్థ, నిజాయితీపరుడైన జయశంకర్ పేరుని వ్యవసాయ విశ్వవిద్యాలయానికి పెట్టడం మనందరికీ గర్వకారణమని, ఆయన ఆశయాలని కొనసాగించడానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, బోధన, బోధనేతర, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొని ఘనంగా నివాళ్ళు అర్పించారు.

## విశ్వవిద్యాలయంలో జాతీయ గ్రంథపాలకుల దినోత్సవం

విశ్వవిద్యాలయం నాలెడ్జ్ మేనేజ్‌మెంట్ సెంటర్, రాజేంద్రనగర్‌లో 11.08.2025న పద్మశ్రీ ఎస్.ఆర్. రంగనాథన్ 133వ జయంతిని పురస్కరించుకొని జాతీయ గ్రంథపాలకుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా యూనివర్సిటీ లైబ్రేరియన్ డా॥ వివేకవర్ధన్ జాతీయ గ్రంథపాలకుల దినోత్సవ ప్రాధాన్యత గురించి మరియు నాలెడ్జ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అందుతున్న వివిధ సేవలను వివరించారు. యూనివర్సిటీ లైబ్రరీ సేవలు గురించి విద్యార్థులు ఈ సందర్భంగా పంచుకున్నారు. వర్సిటీ డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డా॥ ఝాన్సీ మాట్లాడుతూ డిజిటల్ మాధ్యమాలు ఎన్ని అందుబాటులోకి వచ్చిన గ్రంథాలయాల యొక్క ప్రాధాన్యత ఏమాత్రం తగ్గలేదని అన్నారు. గ్రంథాలయ సేవలను విద్యార్థులంతా విరివిగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు, అధ్యాపకులు, లైబ్రరీ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## విశ్వవిద్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

విశ్వవిద్యాలయ క్రీడా ప్రాంగణంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను 15.08.2025న ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రొ॥ అల్దాస్ జానయ్య జాతీయ జెండాను ఎగురవేసి, మాట్లాడుతూ గడిచిన 78 ఏళ్లలో భారతదేశం అనేక రంగాలతోపాటు వ్యవసాయ రంగంలోనూ గణనీయమైన ప్రగతిని సాధించిందని, ఆహార ధాన్యాల ఉత్పత్తిలో భారతదేశం స్వయం సమృద్ధిని సాధించడమే కాకుండా విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదిగిందని అన్నారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రం కూడా ఆహార ధాన్యాల ఉత్పత్తిలో గణనీయమైన ప్రగతిని సాధించిందని, భారతదేశం 2047 నాటికి వికసిత్ భారత్ గా ఎదగాలన్న లక్ష్యాలను చేరుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం నిర్దేశించిన రైజింగ్ తెలంగాణ సాధన లో వ్యవసాయ రంగ అభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. వ్యవసాయ రంగంలో వాతావరణ మార్పుల వల్ల సంభవించే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి శాస్త్రవేత్తలు, విద్యార్థులు కీలక బాధ్యతలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వ విద్యాలయ ఉన్నతాధికారులు, విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ర్యాగింగ్ పై అవగాహన కార్యక్రమం

వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్‌లో ఆగష్టు 19న యాంటీ ర్యాగింగ్ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు ర్యాగింగ్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ కు చెందిన సబ్ ఇన్స్పెక్టర్లు శ్రీ కిషోర్, శ్రీ రాజకుమార్, శ్రీ భాను ప్రకాష్ హాజరై ర్యాగింగ్ పాల్పడటం వల్ల విద్యార్థులపై తీసుకునే చర్యలు, వాటి నివారణ కోసం ఉన్న చట్టాలు, వాటికి విధించే శిక్షలు తదితర అంశాలపై అవగాహన కల్పించడం జరిగింది. కళాశాల అసోసియేట్ డీన్ డా॥ జి. గోవర్ధన్ మాట్లాడుతూ ర్యాగింగ్ అన్న పదం వినపడకూడదని విద్యార్థులకు సూచించారు. జూనియర్ విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పోస్టర్ మేకింగ్, స్లోగన్స్ రైటింగ్, ఎస్సే రైటింగ్ వంటి అంశాలలో పోటీలు నిర్వహించి గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి కళాశాలలోని వివిధ విభాగాధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు హాజరయ్యారు.

## సుస్థిర వ్యవసాయ ఉత్తమ పద్ధతులపై శిక్షణ కార్యక్రమం

వ్యవసాయ కళాశాల, అశ్వారావుపేట వారి దత్తత గ్రామం నారాయణపురంలో ఆగష్టు 26న సుస్థిర వ్యవసాయ ఉత్తమ పద్ధతులపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బయో ఎరువుల వాడకం, కంపోస్ట్ తయారీ, మల్చింగ్, నీటి వినియోగ సామర్థ్యం మరియు జువెనైల్ ఆయిల్‌పామ్, పంట రక్షణ చర్యలు వంటి అంశాలపై శాస్త్రవేత్తలు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మరియు రైతులు పాల్గొన్నారు

డా॥ వి. సుధాకర్, పిఆర్ఓ మరియు మార్ప్స్ బాబు

# వానాకాలం వరికి ముందుగా పచ్చిరొట్టగా పెసర సాగు - రైతు విజయగాథ

డా॥ సిహెచ్. పల్లవి
ఏరువాక కేంద్రం, తోర్నాల







సిద్దిపేట జిల్లాలో దాదాపుగా 3.5 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. సిద్దిపేట జిల్లాలో నేలలు తేలికపాటిగా ఉంటాయి. జిల్లా రైతులు ఎక్కువగా వరి తర్వాత వరి పండించడం వలన భూమిలో పోషకాలు తగ్గడం, పురుగు తెగుళ్ల ఉధృతి పెరగడం వలన దిగుబడులపై ప్రభావం చూపిస్తుంది. కావున రైతులు పచ్చి రొట్ట పంటలుగా జీలుగ, జనుము, పిల్లి పెసర, అలసంద, ఉలవ, పెసర వంటి పంటలను పెంచి అవి 50% పూత దశకు వచ్చిన తర్వాత లేదా పూతదశకు వచ్చే ముందు కాని భూమిలో కలియ దున్నడం వలన నేల స్థితిగతులను మెరుగుపరచుకొని, పలు కాలల పాటు పంట ఉత్పాదకత శక్తిని పెంచడమే కాకుండా పెట్టుబడి ఖర్చులను కూడా ఆదా చేయవచ్చునని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు అవగాహనా కల్పించారు.

ఏరువాక కేంద్రం, తోర్నాల మరియు వ్యవసాయ శాఖతో మమేకమై దాదాపుగా సిద్దిపేట జిల్లాలో 30000 -50000 ఎకరాల్లో జీలుగ/జనుములు వరి పండించే (10-15%) భూమిలో వేయడం జరుగుతుంది. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం ముండ్రాయి గ్రామానికి చెందిన శ్రీ ఎన్. కరుణాకర్ రెడ్డి అనే రైతు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తల సలహా మేరకు తనకున్న ఐదు ఎకరాల భూమిలో గత ఐదు సంవత్సరాలుగా వరి తర్వాత వరి పద్ధతిలో పంటను పండిస్తున్నాడు. ఈ పద్ధతిలో పండించడం వలన రసాయన ఎరువులు ఎక్కువగా ఉపయోగించడంతో ఖర్చు విపరీతంగా పెరగడం, రసాయనలను ఉపయోగించినందున దిగుబడి తగ్గడం జరుగుతుంది. కావున గత రెండు సంవత్సరాలుగా జీలుగ/జనుము విత్తనాలు సకాలంలో అందుబాటులో దొరకడం లేనందున ఏరువాక కేంద్రం తోర్నాల శాస్త్రవేత్తలను సంప్రదించినపుడు 60 రోజుల పంటకాలం కలిగిన పెసర రకం డబ్ల్యు.జి.జి. 42 (యాదాద్రి) అనే రకాన్ని రైతుల పొలాల్లో పరీక్షించగా రైతులు మే మొదటి వారంలో పెసర 6-8 కిలోల విత్తనం వరి కోసిన అనంతరం చల్లి, రోటవేటర్‌తో చదును చేశారు. మేలో పడిన అడపదడప వర్షానికి పంట మొలిచింది, పంట ఏపుగా ఎదిగి 35 రోజుల్లో పూతకు వచ్చింది, 50 రోజుల్లో కాయ ఏరడానికి వచ్చింది. దాదాపుగా 3-4 క్వింటాళ్ళ పెసరకాయ జూన్ 25 లోపు ఏరి తర్వాత జూన్ ఆఖరిలోపు పెసర పంటను రొప్పి భూమిని చదును చేశారు. రైతులు తర్వాత వేసే వరికి కూడా ఒక బ్యాగు యూరియాను తగ్గించి వాడుకున్నప్పటికీ దిగుబడిలో ఎలాంటి నష్టం లేకుండా ఇంకా 1.5 క్వింటాళ్ల వరి దిగుబడి అదనంగా వచ్చిందని రైతు చెపుతున్నారు. రైతులు జీలుగ, జనుము విత్తనాలు దొరికే వరకు ఎదురుచూడకుండా ఇలా పెసర పంటను సాగు చేసుకున్నట్లయితే అదనంగా 3-4 క్వింటాళ్ల పెసలు దిగుబడి సాధించడంతో పాటుగా పచ్చి రొట్టెగా కూడా పనిచేస్తుందని తెలుపుతున్నారు.

**సుస్థిరత్వం కొనసాగింపు:** ముండ్రాయి గ్రామ రైతు ఎన్. కరుణాకర్ రెడ్డి ను ఆదర్శంగా తీసుకుని డబ్ల్యు.జి.జి -42 పెసర రకాన్ని వానాకాలం వరికి ముందుగా సాగు చేయాలని, జీలుగ విత్తనం కోసం ఎదురు చూడకుండా 60 రోజుల్లో పూర్తయ్యే పెసర్లను సాగు చేయాలని రైతులు నిర్ణయించుకున్నారు. ఈ సంవత్సరం సిద్దిపేట జిల్లాలో దాదాపుగా 1000-1500 ఎకరాలలో పెసర సాగు జరిగింది.

**రైతు అభిప్రాయం:** రైతులు వానాకాలం వరికి ముందుగా జీలుగకు బదులుగా పెసర సాగు చేయడం వలన అదనంగా తనకు 19,240/- ఒక ఎకరానికి వస్తున్నాయని, తద్వారా వరి సాగు ఖర్చులు ఎల్లిపోతున్నాయని, అంతేకాకుండా ఒక బ్యాగు యూరియా ఒక ఎకరాకు తక్కువగా వాడినప్పటికిని దిగుబడిలో ఎలాంటి నష్టం లేకుండా మరియు పచ్చిరొట్ట వేయని పంటలతో పోల్చినప్పుడు 1.5 క్వింటాళ్లు అదనంగా వచ్చాయని తెలిపారు. కావున రైతులు వానాకాలంలో జీలుగ విత్తనాల కోసం ఎదురు చూడకుండా పెసర వంటి పప్పు జాతి పంటలు వేసినట్లయితే అదనపు ఆదాయంతో పాటుగా భూమి కూడా గుల్లగా మారిందని, పంట మార్పిడితో పురుగు తెగుళ్ళ ఉధృతి తగ్గిందని తెలియజేస్తున్నారు.

## పెసర మరియు జీలుగ పంట సాగు వివరాలు (ఒక ఎకరాకు):

| క్ర.సం. | వివరాలు | వరికి ముందుగా పెసర సాగు ఖర్చు (రూ./ఎకర) | వరికి ముందుగా జీలుగ సాగు ఖర్చు (రూ./ఎకర) |
|---|---|---|---|
| 1. | నేల తయారీ (రోటావెటర్) | 1,600/- | 1600/- |
| 2. | విత్తన ఖర్చు | 1000 (6-8 కేజీ/ ఎకరానికి) | 1040/- (10కేజీ/ ఎకరానికి) |
| 3. | విత్తడానికి అయ్యే ఖర్చు | 500/- | 500/- |
| 4. | కోత ఖర్చు/నూర్పిడి | 4,800/- | - |
| 5. | మొత్తం సాగు ఖర్చు | 7,900/- | 3,140/- |
| 6. | దిగుబడి (క్వి./ఎకరానికి) | 3 | - |
| 7. | అదనపు ఆదాయం (రూ. 8,000/క్వి.) | 24,000/- | - |
| 8. | పచ్చి రొట్ట కలియదున్నడం | 1,400/- | 1,400/- |
| 9. | వరి సాగు ఖర్చు | 24,600/- | 24,600/- |
| 10. | వరి దిగుబడి (క్వి./ఎకరానికి) | 30 క్వి. | 30 క్వి. |
| 11. | స్థూల ఆదాయం | 69,600/- | 69,600/- |
| | | పెసర-వరి | జీలుగ-వరి |
| | మొత్తం సాగు ఖర్చు | 32,500/- | 27,740/- |
| | స్థూల ఆదాయం | 93,600/- | 69,600/- |
| | నికర ఆదాయం | 61,100/- | 41,860/- |
| | నికర ఆదాయం : ఖర్చు నిష్పత్తి | 1.88 : 1 | 1.50 : 1 |

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9963164507**

## 37వ పేజీలోని పదవినోదం సమాధానాలు

| | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 శ | న | గ | ప 2 | చ్ఛ | పు | రు | గు | | | | అ 3 |
| | | | చ్ఛ | | | | | | మ | | గ్గి |
| టు | పో | మ | దో 4 | | | | | | దో | | తె |
| | | | మ | | | | | | ల్ల | | గు |
| | | | | న 5 | | | 6 ఎం | డు | 7 తె | గు | లు |
| | | | | ల్ల | | | | | | | |
| | | | | తా | | | | | | | |
| జా | యో | టీ | ప్ర | మ | గ్రా | కో | ట్రై 8 | | | | |
| | | | | ర | | | 9 వి | ష | పు | 10 ఎ | ర |
| | 11 క | త్తె | ర | పు | రు | గు | | | | ర | |
| | | | | రు | | | | 12 కం | చె | పం | ట |
| 13 వే | రు | పు | రు | గు | | | | | | ట | |

**47వ పేజీలోని ప్రశ్నలకు సమాధానాలు : 1. ఎ 2. బి 3. ఎ 4. సి 5. డి 6. డి 7. సి 8. డి 9. డి 10. సి**

# యాంటీ ర్యాగింగ్ వారోత్సవాలలో భాగంగా వివిధ వ్యవసాయ కళాశాలలో ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమం



















RNI No : TELTEL/2015/60296 September, 2025 Postal Regd.No:HSE/1013/2024-2026
Total No. of Pages : 52
Date of Publication : 06.09.2025
Date of Posting : 09.09.2025

Posting at BPC - IV Patrika Channel, Nampally, Hyderabad- 500 001



## మధిర పెసర - 1 (యం.జి.జి. 385)

మొవ్వకుళ్ళు మరియు ఆకు ముడతను సమర్థవంతంగా తట్టుకునే అన్ని కాలాలకు అనువైన పెసర రకం

To

*Striving for a greener tomorrow...*

ముద్రణ మరియు ప్రచురణ: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం

Printed and Published by Dr. C. Padma Veni on behalf of Professor Jayashankar Telangana Agricultural University, Owned by Professor Jayashankar Telangana Agricultural University,
Printed at: PJTAU Press, ARI Campus, Rajendranagar, Ranga Reddy (Dist.), Hyderabad, Telangana
Published From: Professor Jayashankar Telangana Agricultural University, ARI Campus, Rajendranagar, Ranga Reddy (Dist.), Hyderabad, Telangana
Editor: Dr. C. Padma Veni, RNI File No. 1262077, Title-Code: TELTEL00152